# ‘పాపం బద్దలైంది’

‘రాఘవ’

తరతరాలనుంచీ, వారసత్వం ప్రకారం వస్తున్న మునసబుగిరికి జగన్నాథం రాజీనామా యివ్వటంతోనే, దానిని తప్పకుండా చేయవలసిన బాధ్యత యావత్తూ ఉన్న ఒక్క కొడుకైన ధర్మారావునెత్తి మీదపడింది. వాస్తవంగా ధర్మారావుకి మునసబుగిరి చేయటమంటే యిష్టంలేదు. కాని, తండ్రి ఏమనుకుంటాడో? అనే భయంకొద్దీ సరే అని చేయక తప్పింది కాదు. అప్పటికి ధర్మారావు పెద్దమాటకారిగా లేడు. తండ్రిపేరు చెబితే, తలవంచుకొని ఏపనైనా చేయటానికి, సంసిద్ధుడయ్యేవాడు. ఒక్కొక్కసారి, ఆయన చెప్పినపనిని, తను చేయటానికి మనస్కరించకపోయినా సరే, ఎదురుమాట చెప్పకుండా, కుక్కిరి పేనులాగా పడివుండి, ఆ పనిని పూర్తిచేసేవాడు. అప్పట్లో అతను తండ్రినిచూస్తే ఎందుకో గడగడలాడి పోయేవాడు. వ్రాయనూ-చదవనూ కేవలం స్కూలువల్లనేకాకుండా కూడా, జగన్నాథంవల్లకూడా కొంతవచ్చింది. ఏ నాడు జగన్నాథం చెయ్యి చేసుకొని ధర్మారావుని మందలించలేదు. కేవలం కళ్లతోనే కన్నకొడుకుని, తగిన కట్టుబాట్లలోవుంచుతూ వచ్చాడు. మునసబుగిరి చేస్తూన్న క్రొత్తరోజుల్లో జగన్నాథం కొడుక్కి, చాలావరకు తర్ఫీదునిచ్చాడు. దానిని ఆధారంగా పెట్టుకొని ధర్మారావు తండ్రి అడుగుజాడల్లో మెదులుతూరావటం జరిగింది. దుర్గమ్మ కూడా, అప్పట్లో కొడుకు చేస్తూన్న మునసబుగిరిని చూసి, ఎంతో ముచ్చటపడింది. ఎంతో ప్రయోజకుడైనాడని సంతోషించింది. జగన్నాథం యిస్తున్న సలహాలతోనూ — చేస్తున్న సహకారంతోనూ — ధర్మారావు మునసబుగిరి నిరాఘాటంగా చేస్తూవున్నాడు.

ఒక సంవత్సరం పూర్తిగాగడిచింది. తల్లిదండ్రుల వాత్సల్యంలో ధర్మారావు ఒకవ్యక్తిగా మారాడు. గ్రామంలో ధర్మారావంటే, కేవలం తల్లిదండ్రుల చాటు బిడ్డడు అన్నచిన్నచూపు మాసిపోయింది. చిల్లరతగాదాలను పరిష్కరించి, తీర్పు చెప్పేనేర్పుని ప్రదర్శించసాగాడు. రైతులతో, తెల్లవారిన దగ్గర నుంచీ, లౌకికంగా ఎట్లామాట్లాడాలో తెలుసుకున్నాడు. హద్దు మీరి, పల్లెటూరిలో ప్రవర్తిస్తే అభాసుపాలై పోతామని గ్రహించాడు. ఎంతసేపూ, తన వ్యవహారమేదో తాను చేసుకొని, గుంభనగా చక్కాపోతూండేవాడు. ఆ గ్రామంలో వున్న రైతాంగంలో పరస్పరంగా ఎన్నిపోట్లాటలున్నా, ఎవరికేసహాయంకావాలంటే, దాన్ని సహృదయంతో చేసిపెడుతూండేవాడు. ఎవరొచ్చి ప్రామిసరీనోటు వ్రాయమంటే, వాళ్లకల్లా వ్రాసిచ్చేవాడు. మామూలుగా గ్రామీణులు సంతోషంకొద్దీ డబ్బురూపంగా ఎంతయిస్తే అంతే తీసుకొనేవాడు. మరే యితరసాయంచేసినా, మనస్ఫూర్తిగా స్వీకరించి తృప్తిపడేవాడు. ఆశ అంతగా వుండేదిగాదు. యిలాంటి జగన్నాథంకుమారుడైన ధర్మారావు, అప్పట్లో — ఆ వూళ్లోనిజంగా ‘ధర్మమూర్తే’ననిపించుకున్నాడు.

రోజులు మంచిగానే గడుస్తున్నాయి. ధర్మమూర్తిలాగా, ధర్మారావు మునసబుగిరి చేస్తూనే వున్నాడు. అయిదారు నెలలు గడిచినయి. దస్తువసూలు రోజులొచ్చాయి. రైతాంగం తమతమ

పాలాలకు కట్టవలసిన శిస్తుని యథాప్రకారంగా కడుతున్నారు. ధర్మారావుకి అందచేసే మామూళ్ళి తప్పనిసరిగా యిచ్చే వాళ్లు యిస్తున్నారు. తక్కువగా యిచ్చారేమిటని యే వొక్కరినీ ఎదురుప్రశ్న లేసి, ఎక్కువ రాబట్టడానికి ప్రయత్నించటంలేదు. ఏ రోజున యెంత మామూలు చేతికొస్తే, అంతా తండ్రి చేతికి ఒప్పగించి, తన పనుల్లోకి తలదూర్చేవాడు. కాని, యీ సారి అలా జరగలేదు. ధర్మారావుకి వచ్చిన మామూలుని, తండ్రికంటే ముందుగానే, తల్లి అడిగి తీసుకొంది. 'ఎవరికిస్తే' ఏంలెద్దూ అని ధర్మారావు వూరుకుండిపోయాడు. కాని జగన్నాధం మాత్రం వూరుకోక, ధర్మారావుని పిల్చి, మెల్లగా –

"నిన్న వసూలైన మామూలు ఏంలేదా?" – అని అడిగాడు.

"ఏం లేకపోవటమేమిటి, పాతికరూపాయలు వసూలైతే అమ్మకిచ్చాగా. నీకు చెప్పలేదా?"– అని ఎదురుప్రశ్న వేసాడు.

"చెప్పలేదురా!" – అని అంటూండగానే దుర్గమ్మ అక్కడికొచ్చి నిలబడింది.

"ఏమే... వాడు నీకు పాతికిచ్చాడటగా –"

"ఊఁ... యిచ్చాడు... దాచాను... ఎందుకూ?"

"ఆఁ... ఏంలేదూ... మామూలుగా నాకిస్తుండే వాడు, నీకిచ్చి ఎందుకు దాయించాడూ అని ఆలోచిస్తున్నాను"

"ఇవ్వకూడదా? మీరేదాయాలిగానీ, నేనుదాయకూడదా? ఏమిటలా అంటారు?" కాస్తకోపంతో గునిసింది.

"వాడి సొమ్ముని యింతవరకూ నేను జాగ్రత్త చేస్తుంటే, మధ్యలో నీవు కల్పించుకొని, మళ్లీ చేయటం దేనికి?"

"ఎవరు జాగ్రత్తగా కూడబెట్టినా వాడి కోసమేగా?"

"అంటే, నేను జాగ్రత్తచేయటంలో ఏదో లోటు జరుగుతోందన్నమాట"

"ఆ మాట నేననను... మీరా సమయానికి లేకపోవటంవల్ల నేనడిగి తీసుకొన్నాను."

"అడిగి తీసుకోకపోతే, వాడివ్వనన్నాడా?"

"నేనేమీ బలవంతంగా అడిగి గుంజుకోలేదు..."

ధర్మారావుకి తలవేడెక్కిపోయింది. తల్లితండ్రులెందుకు అనవసరంగా తన్నుగురించి, మాటా మాటా పెంచుకొని, వాదనకి దిగుతున్నారో అర్థంకాలేదు. పతనుగా దాచే తండ్రి సమయానికి లేకపోవటంవల్ల అడిగింది. యివ్వక తప్పదుగదా! ఆమాత్రానికి తన తండ్రి, ఆ పాతికాయివ్వటుని అడిగి పుచ్చుకొని దాయరాదూ! కీచులాట దేనికి? ముష్టి మునసబుగిరి మీదవచ్చే మామూళ్లు కోసం తగూలాడుకోవాలా! యేమైనా అర్థముందా?

ధర్మారావు తనలో తాను వితర్కించుకొంటూ. తల్లిని, "యిక వూరుకోవే, యెవరన్నా వింటే నవ్వుతారు" - అని తల్లిదండ్రుల గొంతుకన్నా బిగ్గరగా అరిచాడు. ఆపాళాన దుర్గమ్మ నోరు తగ్గించుకొని, చెంగున కట్టుకున్న ఆ పాతిక రూపాయిలను జగన్నాధం ముందు విసురుగాపెట్టి, రుసరుసలాడుతూ వంటింట్లోకి వెళ్ళిపోయింది. జగన్నాధం, ఆ పైకం వంకచూస్తూ – "యీ వెధవ డబ్బు మూలాన ఎన్ని మాటలూ! – ఎంతరగడా! ఛీ, ఛీ" అని ఆ డబ్బుని తీసుకొని సరాసరి యినప్పెట్టవద్దకుపోయిదాచి, ధర్మారావు ఖాతాలో జమవేశాడు. ఇక మొదలైంది ఆ నాటినుంచి జగన్నాధంకి, దుర్గమ్మకి కలవరం. జగన్నాధం వృధాగా కూర్చున్నప్పుడల్లా దుర్గమ్మ ఎత్తిపొడుపుమాటలనేది. అతను నోరుచేసుకొని యెంతో ఓర్పుతో ఆమెను వూరుకునేలాగు చేద్దామనుకునేవాడు. ఆమె లొంగేదికాదు. భర్తచేసే పనుల్ని చూసి భార్యగా విమర్శించేది. జవాబిచ్చే వాడుకాదు. అతని మాటల్ని ఆమె లెక్కచేసేది కాదు. ఆమె మాటల్ని అతను పట్టించుకునేవాడే

గాదు. ఇరువురి మధ్యా నూటీపోటీ మాటలు, పాత విషయాలను తవ్వుకోవటాలు —, 'నువ్వా పని చేసావు కాబట్టే, నేనీపని చేసానని' జగన్నాథం అనటం, "మీ రలా ప్రవర్తిస్తారని ముందే తెలుసు కున్నాను కావునే, నేనీ విధంగా వున్నాను' అని ఆమెగారు పోటీగా అనటం రోజురోజుకి ఎక్కువ కాసాగినయి. యిరువురిమధ్యా పొత్తు సన్నగిల్లటం క్రమేపీ జరుగుతోంది. 'నీదే తప్పని' — జగన్నాథం అంటే, 'మీదే ముమ్మాటికీ తప్పు'అని దుర్గమ్మ రెట్టించ సాగింది. యిరువురిలోనూ ఏదో ఆధిక్యత బలిసిపో సాగింది. కదిలితే కోపం — ఆవేశాలు ఉధృతం కాసాగినయి. ఒకరికొకరు చేయూత లిచ్చుకోవటం తగ్గిపోయింది. ఎవరిచిత్తమొచ్చినట్టువాళ్లు ప్రవర్తించ సాగారు. నోరు మెదిపితే, యింటిపైకప్పు లేచి పోతోంది. పాత్రసామగ్రి వంటింట్లో దుర్గమ్మ చేతి పుణ్యమా యని బ్రద్దలైపోతున్నది. పొయ్యి విసురు కునే విసనకర్ర సైతం, జగన్నాథంమీద కారాలు — మిరియాలు నూరుతూ టపటపమంటూ శబ్దంచేయటం మొదలెట్టింది. కంచు గ్లాసులతో, మంచినీళ్ళ బిందెల అంచులు గణగణమని మోతమోగటం అధికమైంది. అదే సమయంలో, వాకిట్లో కెవరైన పెద్ద మనుష్యు లొస్తే, వాళ్ళకి యింకా బాగా తెలియటంకోసం, దుర్గమ్మ యింటిగుట్టుని బయటపెడుతూండేది. కాళ్ళ రిగేవరకూ దొడ్డంతా కలియతిరుగుతూ, పాలేరుమీద కాస్తంతసేపూ — పనిచేసేదానిమీద మరి కాస్సేపు ఆ మాటా యీ మాటా అంటూ, జగన్నాథంమీదవున్న అక్కసంతా వెళ్ళగ్రక్కుతూ, రాచి — రంపాన పెడుతూ అనేది.

"యీవిడెప్పుడూ యింతే, ఒక్కనాడూ సంతో షంగా వుండదు" — అని ఆ పాలేరూ — ఆ పని చేసేది మనస్ఫూర్తిగా అనుకొని, యెన్నిమాటలన్నా, యెన్నితిట్లు తిట్టినా, పట్టించుకోకుండా, "పాత మనిషే — పాతమాటలేగా" — అని దులుపుకొంటూ, తలవంచుకొని పనిచేసుకొనిపోయేవాళ్లు.

జగన్నాథం యీ రగడ యావత్తూ చూస్తూ వింటూవుండేవాడు. భోజనాల దగ్గరకూడా, మౌనమే అంగీకార సూచనంగా వుండేది. ఏంవేసిపెడితే అదే ప్రాప్తి యీ పూట కనుకొని, పెట్టిన ఆ గుప్పెడు మెతుకుల్ని ఎలాగో గతికి, మూతి తుడుచుకొని వసా రాలోకొచ్చి, ఆ వాలు కుర్చీలో జారగిలబడేవాడు. ఇంతకన్నా వేరే గత్యంతరం ఏమిటో జగన్నాథంకి తోచేదిగాదు. మాట్లాడితే కురుక్షేత్రం యుద్ధం సాగుతున్నప్పుడు, ఎట్లా నోరు మెదపటం ? అన్ని విషయాల్లోనూ దుర్గమ్మదే పైచేయిగా వుండసాగింది. జగన్నాథంకి ఆ యింట్లో స్వేచ్ఛగా బ్రతకటం చాలా కష్టమనిపించింది. యిట్లాంటి దుర్భరస్థితిగతుల సమ రంలో ధర్మారావు నిరాఘాటంగా మునసబుగిరి చేయలేకపోయాడు. క్రొత్తగా కాపురానికొచ్చిన జయలక్ష్మికి యీ రసాభాసయేమీ అర్థంగాలేదు. అత్తగారు చెప్పిన పనులన్నింటిని, పుట్టింటినుంచి వచ్చేనాడు రాసుకొన్న పసుపురంగు పోకముసుపే, చేయటానికి పూనుకొంది. క్రొత్త కోడల్ని, కొడు కుతోపాటు కొంతకాలం సుఖపెడదామనే సదు ద్దేశ్యం దుర్గమ్మకి సనేమీకలగలేదు. పాతకాలపు ఝూడింపులతో, జయలక్ష్మిని భయపెట్టసాగింది. దుర్గమ్మ పురమాయింపులతో జయలక్ష్మి వణికి పోవటం మొదలెట్టింది. ఊపిరి పీల్చుకుంటానికూడా వ్యవధి నిచ్చేదిగాదు. ఒక్కొక్కసారి యేపనిముందు చేద్దామా ! అని ఆలోచిస్తూ నిలబడటం జరిగితే — కళ్లెర్రజేసి చూస్తూ,

"బెండాకర్రలాగా అలా నిలబడివుంటే, ఆ పనంతా ఎవరుచేస్తారనుకుంటున్నావే ? మీ బాబు నౌకర్లు ఎవ్వరూ లేరిక్కడ లేరగాచేయడానికి, చూడు ఆ అంట్లు ఎలా ఎండిపోతున్నయ్యో ! పాచి చెంబులు యింకా తోమనేలేదుటే ! పాలకుండ కడిగావా ? తోట్లో చిట్టువేశావా ? మంచినీళ్లు యింకా తేలా ? బాగానేవుంది నీ నిర్వాకం ! యిలా చేస్తే యివ్వాళీపని తెమిలినట్టే !" — అంటూ ఎడా- పెడా దూసిపోసేది మాటల్ని. జయలక్ష్మి కిక్కురు మనకుండా చెప్పిన ఆ పనులన్నింటిని, గాను గద్దు

గా చేయటానికి నడుంవంచేది. పొరపాటున
ం చేయబోయో యింకోటి చేసేది. ఆ రోజున
ధింపుకివున్న యిరవై నాలుగు గంటలూ చాలేవి
వు. తేదీలు - వారాలూ మారినా, దుర్గమ్మ
టలు మాత్రం మారేవిగావు. ఎప్పుడైనా జయ
్మి చేతిలోంచి పట్టుదప్పి యేకంచుగ్లాసో, యేపాల
ంబో, - యే గరిటో - యే యితరవస్తువో-పడటం
గిందో, ఆ నాడు జయలక్ష్మికి మంగళహారతులు
స్తమానమూ యిస్తూనే వుండేది. కేవలం ఆమె
క్కడాన్నే అంటే, అంత బాధపడవలసిన అవ
ంలేదు. అలా కాదుగా! జయలక్ష్మి తాత
త్తాతల దగ్గరనుండి, ఆమె వరకూ బ్రతికివున్న
ళ్లనీ, చచ్చిస్వర్గాన సుఖంగావున్న వాళ్ళనీ యేకరువు
డుతూ నిర్మోహమాటంగా ఝాడించిపారవేసేది.
ంగా పాపం ఆమె తరపువారు ఏంచేసారు?
ర్గమ్మ అలా నోరు పారవేసుకోడానికి? ఆమె
సహజగుణమని యెంతనుకున్నా ధర్మారావూ -
స్నాధం సహించి వుండగలరుగాని, క్రొత్తగా
ద్చిన జయలక్ష్మి వుండగలదా? ఉండకేం చేస్తుంది?
త్తింటివద్ద అలిగితే ఆర్చేవాళ్లూ - తీర్చేవాళ్లూ
? యివేవీ లేకపోగా శరీరం హూనమైపోయేట్లు
రికే దెబ్బలుకూడా తినాల్సొస్తుంది, ఆ దుర్గతి
డా దేనికని స్తబ్దుగా తనకి పురమాయించిన ప్రతి
ని సహనంతో చేసుకుపోతూండేది. అత్తగార్ని
దుపులో పెట్టుకోవటం, కొంతమంది క్రొత్త కోడ
కి యిట్టే తెలిసివుంటుంది. అలాంటి గోసాయి
ట్కాలేవీ జయలక్ష్మికి తెలియకపోవటంచేత,
ర్గమ్మ చెప్పింది చెప్పినట్టుగా చేయాల్సొస్తోంది.
నీ, 'తన భర్త - ధర్మారావు - నిజంగా ధర్మ
రాత్రే, కలగచేసుకొని తనపట్ల బాధ్యతవున్నవారి
గా-ఏమైనా మాట్లాడుతారా!' అంటే అలాంటి
యీలేదు. తల్లిచాటు మనిషిలా మసులుతూ
ంటారు. ఇదేం కర్మ. భార్యతో మాట్లాడ్డానికి
డా తల్లి అనుమతి వుండాలా? వింతగావుంది.
వరితోనన్నా చెప్పుకుందామన్నా సిగ్గువేస్తుంది.
క భర్తపట్ల తనకే చిత్రంగావుంటే, పరాయివాళ్ల
కుండటంలో ఆశ్చర్యమేముంది? స్వతంత్రించి భర్త
కన్నంపెట్టడానికి ఆస్కారంలేదు. ఆలనా-పాలనా
లేని స్త్రీ జీవితంలాగా, నాకీ దుస్థితిఏమిటి? జయ
లక్ష్మి ఒకనాడు విచారపడింది. తన తల్లిదండ్రు
లింత తెలివితక్కువవాళ్ళని, తాను కాపురాని
కొచ్చేంతవరకూ అనుకోలేదు - జయలక్ష్మి. జయ
లక్ష్మి పల్లెటూరిలో పుట్టి పెరిగినా, చదువూ
సంస్కారం మాత్రం తగు మాత్రంగా అలవడినాయి.
ఎదుటి వ్యక్తిని పరామర్శించి - ఆత్మీయంగా మాట
లాడటం ఆమె పుట్టింటివారికున్న గొప్ప లక్షణం.
అదే నేటివరకూ జయలక్ష్మిలో జీర్ణించుకొనివుంది.
దాని సాధారణంగా పెట్టుకొని అత్తగారితోనూ,
మామగారితోనూ - భర్తతోనూ, కాలం వెళ్ళ
బుచ్చుకుందామనే వూహించింది. కాని, అలాంటి
మంచి లక్షణాలకి, తన అత్తింట్లో అవకాశం కలగ
నందుకు చాలా విచారపడింది. నోరు మెదిపితే,
తిన్నతిండి కక్కేదాకా తిట్టిపోయటం, కన్నెత్తి
కారణంలేకుండా చూస్తే, కన్నీరు కాలేంతవరకూ
కకావికలు పడేటట్లు కర్కశంగా సూటిపోటీ మాట
లతో - సాధించటం యివి అత్తింట్లో క్రొత్త కోడ
లైన జయలక్ష్మికి లాంఛనాలు. ఎంత కాలానికి
యిక తనకు హాయిగా వుండటం లభ్యమయ్యేది?
ఎప్పటికి తన భర్తకు 'నా భార్య జయలక్ష్మి
ఏమైంది? ఎలావుంది? ఏంచేస్తోంది?' అని
ఆరావచ్చేది? జయలక్ష్మి మరోనాడు కంటతడి
బెట్టుకొని కుమిలిపోతూ ఆలోచించుకొంది.

జయలక్ష్మి చాలా చురుకైన మనిషి. పెద్ద పెద్ద
కళ్లు. ఆ కళ్ళకి కాటుక వున్నంతకాలం కమనీయ
మైన భావాలు నిరంతరం కదులుతూనే వుంటయి.
బక్కపల్చగావున్న శరీరం పసిమిరంగుతో సమా
నంగా వుంటుంది. పెళ్ళికాక మునుపు ఆమె చదవని
పుస్తకాలు, వాళ్ళ వూరి గ్రంధాలయంలో లేవంటే
అతిశయోక్తికాదు. ఎన్ని చదివానని తనెన్నిసార్లు
అనుకొంటేనేం? లాభమేముంది? తన భర్తపేరు
నిస్మరించినప్పుడల్లా విశ్వనాథ వారి 'వేయిపడగలు'
లోని ధర్మారావు గుర్తుకొస్తాడు. నిజంగా పేర్లు

ఒక్కటే, అంతటికవీ — పండితుడా! తన భర్త. అతనికున్న తెలివితేటలుగాని, ఆ లౌక్యంగాని, ఆ మనోదారుఢ్యంగాని, ఆ విశాల దృక్పథంగాని, ఆ పరోపకార బుద్ధిగాని, అంతటి స్నేహపాత్రత — విశ్వాసం — దైవభక్తి — ఓర్పుగాని, తను అగ్ని సాక్షిగా పెళ్లాడిన ధర్మారావులో వున్నయ్యా! ఉంటే విశ్వనాథవారి ధర్మారావు నెందుకు కొనియాడటం? సుఖాన్నే అనుభవించేదాన్నిగా! యిన్ని విముక్తాలోచనలు తన హృదయంలో ఎందుకు తలెత్తుతయి? యింతటి ఆవేదన ఎందుకు క్రుంగిపోయేలాగు చేస్తుంది? అయినా యిదంతా నా పిచ్చిగాని, విశ్వనాథవారి ధర్మారావు నా లాంటి తక్కువ నోములు నోచుకొన్న ఆడదానికి నిజంగా లభిస్తాడా? ఏ అరుంధతికో అందుతాడు. కనీసం తన పేరు 'అరుంధతి' అని వున్నా బాగుండేదేమో! ఆ పేరునన్నా తల్చుకోడానికి ఆస్కారము — అర్హతా వుండేవి. అలాంటివేవీకూడా లేకుండా చేయడానికేనేమో! తన పేరు 'జయలక్ష్మి' అని పెట్టారు. పెట్టారు. బాగుంది. ఏం లాభం? ఏవిషయంలో జయం పొందాను? భయంతో గజగజ వణికి చస్తుంటే! నిత్యమూ భర్తను సుముఖంగా మార్చుకోవటంలో జయంపొందలేకపోయాను. అత్తమామలకి ఆప్యాయంగా సేవచేయటానికి నోచుకోలేకపోయాను. అత్తింట్లో తన పట్ల అనుక్షణమూ రేగే చిల్లరమాటల్నిగాని, అల్లరితనాన్నిగాని జయించలేకపోయాను. తనను క్షణక్షణానికి క్రుంగతీసే బాధాకులిత స్వాంతనాన్ని జయించలేకపోతున్నాను. తెల్లారిన దగ్గరనుంచి, ప్రొద్దువాటారేవరకు ఎదురు తిరిగే నిష్ఠూరపు కష్టాల్ని నిలబడి పోరాడి, గెలువలేకపోతున్నాను. తలవాచేటట్లు మాటలంటున్న అత్తగార్ని ఓర్పుతో 'అత్తయ్యగారూ!' అని పిలవటం తప్పటంలేదు. పోని పిలుస్తున్నదాన్ని ఎలాగు పిలుస్తున్నాను.

"మీరుకూడా నన్నిలా మనసు కష్టపెడితే, యిక యీ యింట్లో నన్నోదార్చే వారెవరు? నేనేం తప్పు చేస్తూన్నానని మీరిలా ఆడిపోయటం? కోడలిగా చేసుకొంది నన్నీరీతిగా ఏడ్పించడానికేనా? 'నా' అనే దృష్టి మీకు లేకపోతే, నేనీయింట్లో సుఖంగా కాపురం చేయగలనా? నేను, నిన్న మొన్నటివరకూ పరాయి సంబంధపు పిల్లనైనా, నేడు మీ కోడలిగా, మీయింట్లో కొచ్చి కాపురం చేస్తున్నాను. యిక నాయావజ్జీవితం మీ వుపచారాలకు - మీ కుటుంబ క్షేమానికీ వినియోగపడవలసిందేగా! అలాంటప్పుడు నన్నెందుకు బేధభావంతో చూస్తారు.-" అని హృద్గతభావాన్ని సాయశక్తులా ప్రయత్నించి చెపుదామనుకొంటాను. కాని తీరికేది. చెప్పేంతవరకూ వింటారని నమ్మకం ఏమిటి? ఎలాగూ చెప్పలేకపోతున్నాను కాబట్టే, నా ప్రయత్నంలో నేనే ఓడిపోతున్నాను. జయ మెట్లా సంభవిస్తుందిక? 'జయ'తో నాపేరు తునిగిపోతే, ఎంతోబాగుండేది. నా ఆలోచనలుకూడా తెగిపోయేవి. 'లక్ష్మి' అనికూడా చివర్లో తగిలించారు. ఏముంది లక్ష్మి నా తల్లి దండ్రులేమీ స్థితిమంతులు కారని నన్ను చూచిన ప్రతిముత్తయిదువా నా ముఖానే మాటవరుసగా అంటూనేవుంది. యిక అత్తగారి వ్యాఖ్యానానికి అంతేలేదు. పోనీ భర్తఏమైనా పెట్టాడా? "ఉన్నపుస్తెతాలూ కా బంగారం పూరికే అరిగిపోవటం దేనికి మెళ్ళోవుండి" — అని పెట్టెలో దాయమని సలహాయిచ్చేవారైనారు. పసుపుకొమ్ము కట్టుకొని, మడితో సతమతమై పొమ్మని యింట్లో గుసగుసలు. పోతే, తనసంగతి యింత తెలిసివుండి కూడా, తననే ఎందుకు చేసుకున్నారు...? "నా ముఖంలో కళవుంది -" జగన్నాథం సంబంధం చూసి అన్నమాట. ఏ నాటిదో? దానికోసం ధర్మారావు నాకు లభించాడు....తప్పలేదు...నాజీవితం అతనిపాదాలకు అంకితమైపోయింది. యిప్పుడెన్ని అనుకొంటేనేముంది? ... గతజల సేతుబంధనంవల్ల ప్రయోజనమేమిటి? జయలక్ష్మి ఒకనాటిరాత్రి - విరిసిన పండు వెన్నెలలో ఒంటరిగా పడుకొని, పదే పదే, తల్చుకొంటూ కలవరపడింది. తన జీవితానికి పట్టిన యీగాఢాంధకారం ఎప్పటికి సంపూర్తిగా విడిపోనున్నదోనని ఓర్పుగా భావించి,

ఆరాత్రికి కలత హృదయంతో కన్నుమూసి పడుకొంది.

ఇంతటి విషమస్థితిలోకూడా ధర్మారావు జయలక్ష్మిని 'నా' అనే భావనతో పలకరించలేక పోయాడు. క్రొత్త కాపురంలో ఎన్నో మధురాతి మధురమైన భావాలు పొదగబడి వుంటాయి. అలాంటివాటి నేవీ కోరకుండానే ధర్మారావు ఎడ ఎడంగా వుంటూవస్తున్నాడు. మూడునాళ్ల ముచ్చట కేవలం అతి కష్టంమీద జరిగింది. ప్రతి పురుషుని జీవితానికి ఆ మూడునాళ్లూ మహా ముచ్చటైనరోజులు. జీవితంలో సనేమి మరువలేని మధురఘడియలవి. మర్చిపోదామనుకున్నా ఏకోశానా మరుపుకొచ్చేవి కావు ... అలాంటివి ఎందుకో ధర్మారావుకి గుర్తే లేవు. భార్యతో మురిపెంగా మాట్లాడితే, ఎక్కడ మల్లెపూలుకొని తేవాల్సొస్తుందోనని జంకుతూ వుండేవాడు. తల్లితో సంప్రదించి ఒక గదిలో పక్క వేయమని, జయలక్ష్మితో చెప్పడానికి ధైర్యం గుండెలోవుండేదిగాదు. లాలనగా చూస్తూ - నవ్వుతూ దగ్గరకు తీసుకొన్న కొద్దీ - స్త్రీహృదయంలో తీరని కోరికలెన్నో పుడతాయని అపార్థం చేసుకొని అంటీ అంటనట్లు యింట్లో ప్రవర్తించేవాడు. దీనికితోడు తల్లిదండ్రుల మధ్య ఆరనిమంట నిత్యమూ జ్వలిస్తూండేది. అటూ - యిటూ రేగిన కల్లోలానికి పరిష్కారం వెతకటం చాతకాక, స్తబ్ధుగా వూరుకుండిపోయేవాడు.

ఇంటి పరిస్థితులు దారుణరూపం తాల్చినయి. జయలక్ష్మికి చాకిరీ యెక్కువైంది. అస్తమానమూ దుర్గమ్మ శుచీ — శుభ్రమంటూ చేసినపనినే పదిసార్లు చేయటం మొదలెట్టింది. మాటిమాటికి అది ముట్టుకున్నాను, యిది తాకినాను అని నూతివద్ద రొచ్చయ్యేలాగు స్నానాలుచేయటం ఎక్కువైంది. అటు జయలక్ష్మికి యేపనీ తీరేదిగాదు. యిటు దుర్గమ్మకి వంటపని పూర్తయ్యేదిగాదు. తిండి తినేసరికి ప్రొద్దు నడినెత్తిమీద కొచ్చేస్తూండేది. 'అదేమిటీ!' అని అడిగే నాధుడు నిగ్గదీసి అడిగితేగా! వంట పెందలాడే అయి కూళ్లు తింటానికి. 'పెట్టినప్పుడే ఎంగిలిపడదామని' తండ్రీ కొడుకులతోపాటు జయలక్ష్మి నకనకలాడుతూ వుండేవాళ్లు. వీళ్ళకిట్లా కడుపుమాడేలాగు చేయటంలో, తనకున్న అక్కసు కొంత తీరిపోతున్నట్లుగా దుర్గమ్మ భావించేది. ఒకనాడు ధర్మారావు వుండబట్టలేక తల్లిని నాలుగూ అడుగుదామనుకున్నాడు. కాని గుండె నిబ్బరం అంతలోనే దిగజారిపోయింది. ఒకవైపు ఆకలితో కడుపు మండిపోతోంది. మరోవైపు కని, పెంచిన తండ్రి 'యీసురో' మంటూ వాకిటి వసారాలో నిరుత్సాహంగా వాలుకుర్చీలో జారగిలబడివున్నాడు. చాకిరితో పొద్దున్నుంచి వేసారిన భార్య దొడ్డివేపు గుమ్మంలో నకనకలాడుతూ కొనవూపిరితోవుంది. ప్రొద్దు నడినెత్తిదాటింది. తీర్చినట్లుగా ఎండ తీవ్రంగా కాస్తోంది. ధర్మారావు తెగించి తల్లిని చెడామడా అడుగుదామనుకున్నాడు మళ్లా, జారిన ధైర్యాన్ని గుండెల్లోకి తీసుకొని, సరాసరి వంటింట్లోకి వెళ్లి చూసాడు. దుర్గమ్మ లేదు. పొయ్యిమీద ఎసరు కాగుతోంది. యేకూరా — నారా వండినట్లే లేదు. ఏపచ్చడి చేసినట్లూ లేదు. చారు — పులుసు తాలూకు వాసనలుకూడ అసలే లేవు. కడుపు మరీ మండిపోయింది. దొడ్లోకి వెళ్ళిచూశాడు. దుర్గమ్మ యింకా మందకొడిగా మడిబట్టలారవేస్తోంది. కడిగి, బుట్టకెయ్యవలసిన బియ్యం యింకా ఆ పళ్ళానే కడక్కుండానే వున్నయి. 'తన తల్లి యింత నిర్దయురాలైందేం?' ఎందుకో అప్రయత్నంగా యీ ప్రశ్న కలకవేసింది, ఉండబట్టలేక —

(సశేషము)

# పాపం బ్రద్దలైంది

'రాఘవ'

(గతసంచిక తరువాయి)

"ఇంతవరకూ యింకా వంటేకాకపోతే, యింకెప్పుడు మేం తిళ్లుతినేది?" రేగినకోపాన్ని దిగమ్రింగుకొంటూ అడిగాడు. ఆమె ముఖం చూసేసరికి భయం వేసింది.

"ఏం అంత తొందర వండేదాకా ఆగలేరా?" కన్బొమలు ముడివేసింది.

"ఇంకా యెప్పుడే! రెండు ఝాములకా?"

"ఉన్నవాళ్లు యింత వరకూ యెలాగో వున్నారుగా! కాస్తాగండి. వండి వారుస్తాను. తొందరపెడితే ఎట్లా? చేయద్దూ!"

"మరీ నీకు రానురాను చాదస్తం ఎక్కువైంది లెద్దూ!"

"అంత ఆగలేనివాళ్లు, జయలక్ష్మితో చిన్నపొయ్యి మీదవుడకేయించుకోలేకపోయారా! ఏకంగా మైలకూడే తినేవాళ్ళు"

"నీ మడికూడు తిని చచ్చేబదులు - ఆ మైలకూడు తినటమే మేలు."

"ఏరోయి! మాటలు తిన్నగారానీ! అంత చస్తున్నారా! యివాళంటే ప్రొద్దెక్కిందిగానీ, రోజు యీ మాదిరిగానే అవుతోందా?"

"ఆఁ...ఖచ్చితంగానూ! మీరూ మీరూ దెబ్బలాడుకుని అనవసరంగా మా పొట్టలు మాడుస్తున్నారు." కాస్త ధైర్యంతో అనటం ప్రారంభించాడు. జయలక్ష్మికీ, జగన్నాధంకి తల్లీ కొడుకుల సంభాషణ వినిపిస్తూనేవుంది. 'అలా గట్టిగా నువ్వన్నా నిగ్గతీసి అడుగూ' అని జగన్నాధం మనసులో హెచ్చరికచేసినట్లుగా అనుకున్నాడు. గట్టిగా అంటే, భార్య ఎక్కడ వినిపోతుందో నన్నభయంతో మెల్లిగా అనుకున్నాడు తనలో తాను. "ఒకవేళ విన్నదో, మీరే రెచ్చగొట్టి, నామీదకి జగడానికి పంపారు. నాకూ-వాడికి తగూపెట్టి, దిక్కులేని పక్షిగా చేద్దామని పన్నాగం పన్నారు" అని ఎక్కడనిపోతుందోనని శంకించి వూరుకున్నాడు.

"తనదాకా వస్తేగానీ, యితరుల కష్టాలూ-బాధలూ తెలియవన్న" సామెత నిజమే అనుకొని, భర్త అడిగేవాటిని, అత్తగారనే మాటల్ని వింటూ శోషిల్లి పడుకొనివుంది జయలక్ష్మి.

ఆ మాటకామాట పెరిగి పెరిగి, చివరకు తల్లీ కొడుకుల మధ్యా పెద్ద రగడజరిగింది. "నీ మూలానే యిదంతా జరిగిందని"-దుర్గమ్మ ధర్మారావుని యీసడించింది.

"నా సంసార జీవితం నాకిట్లా దుర్భరంకావటం నీవల్లనే! నీ మూలాన నాకు మనశ్శాంతిలేకుండాపోయింది. యిల్లు యమకూపంకన్నా హీనంగా తయారైంది. నా భార్యను నిర్దాక్షిణ్యంగా రాచిరంపాన పెడుతున్నావ్. మడి-మడి అని మా ప్రాణాలు నిలువునా తోడుకుతింటున్నావు. యేమిటిదంతా? నీ మూలానగాదూ!" _ యెలాగో అడగదల్చుకున్న నాలుగు మాటలూ, దుర్గమ్మ గొంతుక్కి-తావు యివ్వకుండా బిగ్గరగా గబగబా అనేశాడు. ఇలా అడగటం చూస్తూ వినేసరికి జగన్నాధానికి కొంత వుత్సాహం వచ్చింది. శోషిల్లి పడుకున్న జయలక్ష్మికి క్రొత్తశక్తి యేదో శరీరంలో ప్రవేశించినట్లయింది. తన తరఫున తన భర్త-ధర్మారావు యిట్లా అడుగుతాడని కలలో

కూడా తలపోయలేదు. తనంటే ఆయనకు మనస్ఫూర్తిగా యిష్టమున్నదని గ్రహించింది. తను అనుకున్నంత అసమర్థుడు కాదని తేలిపోయింది. ఆ రోజున భోజనాలయ్యేసరికి రెండు గంటలు దాటినయి. ఆకలి తీరటమనేది యెలావున్నప్పటికీ, ఆయాసం ఓదలిక ఎక్కువైనయి. కాలి కాలి వున్న కడుపులో ఒక్కసారిగా వేడివేడి అన్నం పడేసరికి, నిస్సత్తువుగా వున్న నరాలన్నీ ఒక్కుమ్మడిగా సళ్ళిచ్చాయి. మంచినీళ్ళపోత అధికమైంది. తిండి తింటం తక్కువైంది. ఆనాటినుంచీ, దుర్గమ్మ వంటయింటికి స్వస్తి చెప్పింది. యిష్టముంటే - అదైనా ఓపికనిబట్టి తోచినపని చేస్తానంది. మిగతా యింటెడుచాకిరీ జయలక్ష్మి భుజస్కంధాలపై బడింది. జయలక్ష్మి వెఱగందలేదు. యిదంతా తన మంచికే ననుకొంది. మితభాషణ మొదలైంది. అవుసరముంటే, అచ్చటో ముచ్చటో ప్రస్తావించుకోటం - లేకపోతే ఎవరిదోవ వాళ్ళదన్నట్లు ప్రవర్తించసాగారు. అయినా, ధర్మారావు మనస్సుకి శాంతిచేకూరలేదు. అందువల్ల చేస్తూ చేస్తూ వున్న మునసబుగిరికి, తండ్రిలాగే రాజీనామా యిచ్చి వూరుకున్నాడు. జగన్నాధం ఏ అభ్యంతరమూ పెట్టలేదు. "యిష్టంలేనప్పుడు తనెందుకు పట్టుబట్టి చేయమని బ్రతిమిలాడటం" అని వూరుకొన్నాడు. వారసత్వప్రకారం ఆ మునసబు గిరిని, జగన్నాధం, తమ్ముడైన నారాయణరావు కిప్పించాడు. అప్పట్లో అతడు స్కూలుఫయినల్ పూర్తి చేసి వుద్యోగం కోసం అన్వేషిస్తున్నాడు. అన్నగారి యందు అమితమైన గౌరవం కలవాడు కాబట్టి, కాదనటానికి నాలుకాడక, ఒప్పచెప్పిన మునసబు గిరిని స్వీకరించాడు.

అప్పటికి మృగశిర కార్తె సగంకూడా జరగలేదు. తొలకరి మబ్బులతో వుండీ వుడిగీ వర్షాలు పడుతున్నయి. ఉరుముల మెరుపులతో ఆకాశం బ్రద్దలైపోతోంది. రైతులు వ్యవసాయం పనులమీద ఒత్తిడిగా తిరుగుతున్నారు. నాగళ్ళు భూమిని దున్నుతున్నయి. ధర్మారావుకి కూడా వ్యవసాయం చేయాలనిపించింది. వూరికేవుండి చేయవలసినదేమీ కనిపించలేదు. తండ్రితో సంప్రదించాడు. అయితే జగన్నాధం పేరిటవున్న పొలం ఆ వూరికి పదిపన్నెండు మైళ్ళదూరంలోవున్న మరో వూళ్ళోవుంది. అక్కడే దగ్గర్లోవుంటే, సొంత వ్యవసాయం సుళువుగానూ సక్రమంగానూ నడుస్తుందని ఆశించి తరలి వచ్చేసారు యావత్ కుటుంబమున్నూ. ఆ సమయంలో నారాయణరావు చాలా దిగులుపడ్డాడు. యింతవరకు తనకు అండగావుంటున్న అన్నగారు వెళ్ళిపోవటం బాధకలిగి - విచారంగా తోచింది. ఆనాటినుంచి, నారాయణ సంసారం వేరైంది. జగన్నాధం సంసారం యిక్కడకొచ్చేసింది. నారాయణరావు శారదతో కాలక్షేపం చేస్తున్నాడు. జగన్నాధంకి మాత్రం తమ్ముణ్ణి చూడకుండటమనేది భరించలేకపోయాడు.

తండ్రి మరణానంతరం ఉన్న స్థిరాస్తిని పంచుకోగా, జగన్నాధంకి వోఅయిదెకరాలూ - నారాయణరావుకి వోఅయిదెకరాలు సమానంగా సంప్రాప్తించింది. ఉన్న పూర్వకాలపు యింటిని చెరిసగం పంచుకున్నారు. యింట్లోవున్న పాత్రసామాగ్రిని, వస్తువాహనాల్నికూడా, యే మనస్పర్థా - ఏ కీచులాటలు లేకుండానే, న్యాయబద్ధంగా తీసుకున్నారు. ధర్మారావు మునసబుగిరికి స్వస్తిచెప్పిన మరుక్షణంలోనే, జగన్నాధం తనవాటాకొచ్చిన యింటికి బేరం పెట్టాడు. యీ సంగతి తెలిసి నారాయణరావు ఆ వాటాని అమ్మవద్దని చెప్పాడు. దుర్గమ్మకి కోపం వచ్చింది.

"మావాటా మేమమ్ముకొంటే నీకేం నష్టం?" అని మరిదిని ముఖానే అడిగివేసింది. 'యీవిడెప్పుడూ యింతేలే' అని నారాయణరావు సరాసరి అన్నగారివద్దకుపోయి, "నువ్వు నవుసరంగా నీ వాటా యింటిని అమ్ముకోవటం దేనికన్నయ్యా! తరతరాలనుంచీ మన కచ్చివస్తున్న యీ గడ్డనమ్ముకోవటం మర్యాదైనపనిగాదు. నా మాట కాస్త చెవిని బెట్టుకో అన్నయ్యా!" - అని ఒకనాడు ప్రాధేయపూర్వకంగా చెప్పాడు. జగన్నాధంకి, తమ్ముడి మాటలు నిజమని తెలుసు. కాని యింట్లో పోరు యింతింతకాదుగా..

"మనదారి మనం మాటామల్లే చంకనెట్టుకొని పోతుంటే, యింకా యిక్కడ కొంపదేనికి? ఎవరుంటారు? పోనీ అద్దెకిద్దామంటే పల్లెటూరై పోయింది. ఎవరువుండేది? వెళ్ళేచోటులో వుండటానికి అద్దెకొంప తీసుకొంటామా! అందుకని యీ వాటా అమ్మేసి, ఏకంగా ఒక యిల్లే కొనుక్కొని వుండటం ఎంతైనా మంచిది" - దుర్గమ్మ ధర్మారావు యీ మాటలు నిత్యము అంటూ వుండటంచేత, చెవులు చిల్లులుపడిపోయి, జగన్నాథం తన వాటాకి బేరం పెట్టాడు. పరాయివాడుకొనటం నారాయణరావుకి యిష్టంలేదు. అందుకని, ఒకనాటి సాయంత్రం అన్నగారితో రహస్య సమాలోచన చేస్తూ–

"నువ్వు యెలాగు నీ వాటా నమ్ముకోదల్చావు కాబట్టి, నేనే కొంటాను. పరాయివాళ్ళకమ్ముకున్న దగ్గర్నుంచి, నేను బ్రతికివున్నంతకాలము, వాళ్ళ పొరుగున కాపురం చేయాల్సొస్తుంది. నిన్న మొన్నటి వరకు నువ్వు కాపురంచేసిన యింట్లో మరో పరాయి వ్యక్తులొచ్చి పొయ్యి రాజేయటం నేను చూస్తూ వూరుకోలేని సంగతి. అది ఒక విధంగా నాకు న్యూనతగాకూడా వుంటుంది. మనిద్దరం ఎంతవేర్లు పడినా, లోకం దృష్టిలో రక్తస్పర్శకలవాళ్ళమేగదా! సహిస్తూ బ్రతకగలనా! కావున నేనే కొంటాను, బేరంతేల్చిచెప్పు"మన్నాడు. జగన్నాథం కాస్సేపు దీర్ఘాలోచనచేసాడు. నిజమే! పరాయివాడి కమ్ముకునే బదులు, తన తమ్ముడికే ఏదో ఒక ధరకు అమ్ముకోవచ్చునుగా! అయిన వాడికన్నా, కాని వాడి గొప్పేమిటి? యిక యీ విషయాన్ని సాగదీయకుండా జగన్నాథం, పదిహేనువందల రూపాయలకు, నారాయణరావుకి మాటిచ్చేశాడు. ఆ మర్నాడే రిజిస్టరుకూడా పూర్తయింది. అమ్ముకున్న తన వాటావంక చూస్తూ, తమ్ముడివద్ద స్వహస్తాలతో కోరిన పైకం పుచ్చుకొంటుంటే, జగన్నాథం కళ్లు చెమ్మగిల్లినయి. హృదయం బెంగతో మరిగిపోయింది. తన జీవితంలో యింతటి ఘనకార్యం చేతులారా తలపెట్టాల్సి వస్తుందని ఎన్నడూ వూహించనైనాలేదు. పైకం అందుకొని, ఆ యింటి ఆవరణ దాటిరావడానికి, జగన్నాథం కాళ్లు తడబడినయి. వెడుతూకూడా, యింటిని పదేపదే కలయచూసుకోవటం మానుకోలేకపోయాడు. చేతులారా చిన్నప్పటి నుంచి పెంచిన కొబ్బరిచెట్లను వదిలివెళ్ళబుద్ధి కాలేదు. తమ్ముణ్ణిపిల్చి, గాద్గదిక స్వరంతో - "మరి యిక నేను వెళ్ళొస్తాను, యింటిని జాగ్రత్తగా కనిపెట్టుకొని చూసుకో" - అన్నాడు. కంఠం పూర్తిగా గద్గదమైంది. హృదయం మమకార పూరితమైన ఆవేదనతో కలతపడసాగింది. 'తన' అనే భావాన్ని మర్చిపోవటం, ఆ సమయంలో చాలా కష్టతరమనిపించింది. జీవితంలో యింతటి అనిర్వచనీయమైనభావన మరేదిలేదని రూఢీచేసుకొన్నాడు. "అయితేనేం, తమ్ముడిఆస్తి" - అనే మరో అభిప్రాయం అతణ్ణి కొంచెం తేరుకునేలాగు చేసింది. నారాయణరావు కూడా, అన్నగార్ని ఓదారుస్తూ సాగనంపాడు.

తీరా యింటికి వెళ్లటం జరిగిన పిదప, దుర్గమ్మ విరుచుకుపడింది. అప్పటికే వూరునాడు ఏకమైపోయింది. జగన్నాథం యెంతో తెలివి తక్కువగా యిల్లమ్ముకొన్నాడని. నారాయణరావు అన్నగార్ని యుక్తితో లోబరుచుకొని, తక్కువ ధరకే యిల్లు కొన్నాడని. ధర్మారావుకి నఖశిఖ పర్యంతం శివమెత్తింది.

"తమ్ముడుగదా తక్కువ ధర కిచ్చుకొని, బంగారమంటి యిల్లుని అమ్మివేశారు-మరే యితరులకమ్మితే, నిక్షేపంలాగా రెండువేలు వచ్చేవి. అన్నిందాల మీవల్ల కొంపకూడాలేకుండా చేసుకోవాల్సొచ్చింది. ఆయనతప్పు, కొనేనాధుడే లేకపోయాడా? మీరమ్మినందుకే చెప్పుకోవాలి, యిలా చేయబట్టిగాదు యీ సంసారానికి యీ దురవస్థ వచ్చిపడింది" - దుర్గమ్మ నాలిక ఆ పూటల్లా మడతపడనేలేదు. ధర్మారావు పళ్లు పటపట కొరుక్కున్నాడేగాని, తెగించి తండ్రిచేసిన పనిని విమర్శించలేకపోయాడు. యీ విషయంలోనే దుర్గమ్మ - ధర్మారావు తిరిగి ఆశాలోచితంగా ఏకమైపోయారు. ఆ నాటినుంచి మామగారు కోడలు ఒకటైనారు. తల్లికొడుకు ఒకటైనారు.

నారాయణరావు, శారదతో నిక్షేపంగా సంసారం చేస్తూ - నిరాఘాటంగా మునసబుగిరినికూడా చేస్తున్నాడు. అంత పెద్దింట్లో బిక్కుబిక్కుమంటూ, పిల్లా జెల్లా లేకుండా, కేవలం నారాయణరావు దంపతులే, కాలక్షేపం చేయటం ఒక విధంగా భయంగానే వుంది. ఎవరికైనా అద్దెకిద్దామా అని ఆలోచించాడు. వచ్చి జగన్నాథం వాటాలో దీపం వెలిగించేదిక్కు కనిపించలేదు. తాళంవేసి కొన్నాళ్లు వుంచాడు. అయిదెకరాల్ని కవులికిచ్చి, పరువు ప్రతిష్ఠలతో కాపురంచేస్తున్నాడు. అప్పటికి శారద కాపరానికొచ్చి రెండు సంవత్సరాలు గడచినయి. అల్లారుముద్దుగా చూసుకోవటానికి, ఏ వొక్క నలుసూ పుట్టలేదు. అప్పట్లో ఆ భార్యాభర్తలకి తీరనిలోటు సంతానం కల్గలేదే! అన్నదొక్కటే, మిగతా పరిస్థితులన్నీ సక్రమంగానే వున్నాయి. రోజులు ఆనందంగా గడిచిపోతున్నాయి.

ఇలా వుంటూ వుండగా శారద తరఫు బంధువుల్లో జీవనోపాధి దొరక్క, ఎక్కడైనా పదిమంది పిల్లలికి ప్రయివేట్లు చెప్పుకొని బ్రతుకుదామని వచ్చిన వీరభద్రం ఆ వూరొచ్చి నారాయణరావుని ఆశ్రయించాడు. భార్యతరఫు బంధువని మర్యాద చేసి, తనింట్లో ఆశ్రయమిచ్చి, ఆదరాభిమానాలతో చూడసాగాడు. వీరభద్రం, శారదకు వేలువిడిచిన మేనత్త కొడుకు. స్కూలుఫైనల్ వరకు చదివాడు. ఉద్యోగం కోసం నానాశ్రమలు పడ్డాడు. తండ్రినాటి కొద్దిపాటి ఆస్తిని తెగనమ్మి చదువుకోసం ఖర్చుచేశాడు. తల్లి చిన్నప్పుడేపోయింది. తండ్రి పక్షవాతంతో తీసుకు, తీసుకొని చనిపోయాడు. 'నా' అనేవాళ్లు కన్నెత్తిచూసి, నోరు కదిపి బ్రతుకు తెరువు చూపించలేకపోయారు. అతనిలో అతనికే నిర్జీవంగా బ్రతకట అసహ్యమనిపించింది. పెళ్ళిచేసుకొని సుఖపడదామనే ఆశ చివురెత్తినప్పుడల్లా, తన దురదృష్టం గుర్తొస్తూండేది. అయినవాళ్లెవ్వరు సాహసించి వీరభద్రంకి పెళ్ళిచేయలేకపోయారు. తోడబుట్టినవాళ్లులేకపోయారు. ఏకాకి. బ్రతుకుదామని ఆశవుంది. మార్గం కనిపించేదిగాదు. వీరభద్రంకి దాదాపు పాతికేళ్లుపైచిలుకొచ్చి వుంటయి. చిన్న కళ్ళు, తేనెకళ్ళులాగా వుంటయి. సన్నగా జెండా కర్రలాగా వుంటాడు. చెప్పిన విషయం చెప్పకుండా చెప్పుకొస్తాడు. యీ రకమైన అలవాటు అనేక ప్రదేశాలు తిరగటంలోను - అనేకమంది రకరకాలైన మనుష్యులతోను మాట్లాడటంవల్లను అలవడింది. తన పని గడుపుకొనిపోవటంలో ఎంత నేర్పు చూపించాలో అంతా ప్రదర్శించగలడు. అందితే జుట్టు - అందకపోతే కాళ్ళు పట్టుకోగల్గే ప్రజ్ఞ వుంది. ఏయెండకాగొడుగు పడతాడు. తన అవుసరం తీరేంత వరకు జలగలాగాపట్టి, నరనరాల్లోని రక్తం పీల్చేస్తాడు, వూరికే, పనివున్నా లేకపోయినా. రెండుపూట్లా కాఫీ త్రాగుతాడు. తన అనుభవాలన్నీ ఏకరువుబెట్టి ఎదుటివార్ని లోబరుచుకొంటాడు. తిన్న యింటి వాసాలు లెక్కపెట్టేరకం. మంచి మర్యాదలిచ్చి గౌరవం చూపటం జరిగిందో నెత్తికెక్కి పిండికొడతాడు. మానవుడు స్వార్థపరుడని మానవుడికే తెలుసు. అలాంటివాళ్ళలో యీ వీరభద్రం ఒకడు. తన కడుపునిండి, కాలంసుఖంగా గడిస్తేచాలు. ఎదుటివ్యక్తి యేమైపోయిన పట్టించుకోడు. యిలాంటి దుర్మార్గలక్షణాలన్నీ తనలో వున్నయ్యని తెలిస్తే ఎవ్వరు తనని దరిజేర్చుకోరని యెంచి, ఎంతో పెద్దమనిషిలాగాను - మితభాషిగాను - నటిస్తాడు. యిటువంటి వ్యక్తులు లోకంలో సహజంగా, నగ్నసత్యానికి దూరమవుతున్నకొద్దీ నటుడికన్నా మిన్నగా నటించుతు వుంటారు. వాళ్ళకి నటన జీవితంలో కొన్ని మధురఘడియల్నిగూడ రుచి చూపుతుంది. అందుకే వీరభద్రం, ఎన్నో ఆశలు పెట్టుకొని మరీ వచ్చాడు నారాయణరావు యింటికి.

నారాయణరావు వస్తుతహా మొగమాటపు మనిషి. 'నీతో యీ పని కానున్నది' అని మంకుపట్టుదల పడితేచాలు, నిజంగా తనవల్లే అవుతుందని భావించే మనస్తత్వంగలవాడు. ఎవరిమాటా కాదనలేదు. తనకున్న శక్తి సామర్థ్యాలకొద్దీ యెవరికెంత ప్రాప్తో

అంత సహాయము - సహకారము చేసితీరుతాడు... గ్రామంలో నారాయణరావంటే పలుకుబడే కేవలం కాకుండా, ఆత్మీయతకూడా తగుపాళ్లుగావుంది.

ఒకవారం రోజులు గడిచాక, వీరభద్రం ఆ మాట-యీ మాట చెప్పుకొస్తూ, తన వుద్దేశ్యాన్ని వ్యక్తపర్చాడు. నారాయణరావు ఆలోచించి, చేద్దామని మాటిచ్చాడు. యీ వారం రోజుల్లోను, వీరభద్రం ఆ యింటి నైసర్గిక స్వరూపాన్ని, వాతావరణాన్ని అవలీలగా అర్థంచేసుకొన్నాడు. శారద పుణ్యమాయని వీరభద్రం యేలోటులేకుండా కడుపునిండా మెక్కుతున్నాడు. నారాయణరావు పనుండి గ్రామంలోకి కదిలివెళ్ళినప్పుడల్లా తను వెంటవెళ్ళి, పరిసరవాతావరణాన్ని చూసి తన్మయపడేవాడు. శారదకూడ, ఎంత వేలువిడిచిన మేనత్తకొడుకైన, లోటుకల్పించకుండా, వీరభద్రానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. వీరభద్రం, తన బ్రతుక్కి రాచరికం అబ్బిందని కలగన్నాడు. బీడీలు కాల్చే వీరభద్రం, నారాయణరావు కోరికపై సిగరెట్లు కాల్చటం మొదలెట్టాడు. ...

ఎలాగైతేనేం, నారాయణరావు వీరభద్రంచేత ఒక ప్రయివేటుస్కూలు తను కొన్న అన్నగారి వాటాయింట్లో పెట్టించాడు. నారాయణరావు మాట తీసెయ్యలేక, ఆ వూరిపిల్లలు ప్రయివేటు చదువుకి చేరారు. అంతాగూడి ఒక పదిహేనుమంది వుంటారు. జగన్నాథం అమ్మిన వాటాకి, నారాయణరావు వాటాకి, మొదట్లో యే అడ్డుగోడగానీ, యే తడిక గానీ లేనేలేవు. యిద్దరన్నదమ్ములు వాటాలుపడిన పిమ్మట మధ్యపేడబూసిన, వెదురు తడికెలు పెట్టుకున్నారు. అప్పట్నించి వీరభద్రం బడిపెట్టేంత వరకూ, ఆనాటి మేదరతడికెలు అలాగే, పేడపూత రాలివున్నయి. స్కూలుప్రారంభించిన మరునాటి నుంచీ వీరభద్రంకి పడుకోడానికి ఒక మంచం, ఒక పరుపు రెండు తలదిండ్లూ, ఒక దుప్పటి, యింకా కొంత ముఖ్యసామాగ్రి నారాయణరావు యిచ్చాడు.

వేరేవంట పెట్టుకుందామనుకుంటుండగా, వీరభద్రాన్ని సమాధానపరుస్తూ నాతోపాటు నువ్వూ మా యింట్లోనే భోంచెయ్యమని కోరాడు నారాయణరావు. శారదకూడా, ఎంతో ఆప్యాయితగా— "అదేమిటి బావా! నేనుండగా నీకీ అవస్థ దేనికి? ఆయనతోపాటు నువ్వూ వేళకింత ఎంగిలి పడితే పోయేదానికి అస్తమానము ఆ పిల్లలతో వాగివాగి, వంట చేసుకోవటం కష్టంగాదూ! నువ్వేం అనుకోకు, యిక్కడే భోంచేద్దువుగాని" అంది. వీరభద్రం యిక యేమంటానికి తోచక, తలూపాడు. తన బ్రతుకిట్లా పండుతుందని, కాఫీలు త్రాగుతూ, కడుపునింపుకొని బిక్కఫకీరులాగా జీవితం గడిపే వీరభద్రం యేనాడైనా అనుకున్నాడా? అదృష్టం కలిసిరావటమంటే యిట్లాగే వుంటుందని భావించాడు. "తనని ఎవ్వరూ నమ్మరు" అని అపోహపడినందుకు, నారాయణరావు దంపతులు మనస్ఫూర్తిగా నమ్మినందుకు, ఎంతో ఆశ్చర్యపడ్డాడు.

నారాయణరావుతోపాటు, శారద వీరభద్రంకి రెండు పూటలా లోటులేకుండా భోజనం పెడుతోంది. ప్రొద్దునా, సాయంత్రం కాఫీలు కాచి యిస్తోంది. అడపా తడపా చేసుకొన్ననాడు ఫలహారం కూడా పెడుతోంది. యిక వీరభద్రంకి కష్టాలెందుకు గుర్తుకొస్తయి? బాధలెందుకు తారసిల్లుతయి? దిగులెందుకుంటుంది? దర్జాగా.పోగైన ఆ పదిహేను మందికి డొక్క శుద్ధిచేయటం సాగించాడు. పగలల్లా పిల్లకాయల చదువులతో యింటిపై పెంకులు లేచిపోతున్నయి. పాఠాలు వొప్పచెప్పనివాళ్ళ వీపులు, వీరభద్రం చేతిలోవున్న యీతబెత్తంతో తాటలేచి, తుప్పరాలిపోతున్నది. ఏనాడు పిల్లలకి చదువు చెప్పటం చేతకాకపోవటంతో, వీరభద్రంకి యిట్టె కోపమొస్తూవుండేది. అక్కడికీ తమాయించుకునేవాడు. లేకపోతే, చటుక్కున పిల్లలు చదువుమానేస్తారేమోననీ, వచ్చేరాబడి పోతుందేమోనని భయపడేవాడు.

వీరభద్రం యెంత నక్కజిత్తుల మారివాడయినప్పటికీ, అతని కంఠం నాటకాల సంగీతంలో బాగా

తిర్ఫిదుపొంది పోయింది. తీరిక దొరికినప్పుడల్లా యే పాండవోద్యోగవిజయాల్లో పద్యాల్నో - లేకపోతే మరేయితర హరిశ్చంద్రలోనో కురుక్షేత్రంలోనో కంఠమెత్తి రాగయుక్తంగా పాడుతూండేవాడు. దీన్నిబట్టి నారాయణరావు దంపతులతో బాటు ఆ చుట్టుప్రక్కల ప్రజానీకం కూడా "యీ పంతులు పద్యాల్నెంత బాగా పాడతాడు." అనుకోవడం కోసం, నామోషీ లేకుండా పాడేవాడు. వీరభద్రం ఆశించినట్లే, ఆ వూరు యావత్తూ, అతన్ని ఒక గొప్పనాటకాల పాటకుడిగానే మెచ్చుకొని చెప్పుకొంది. శారదకి కూడా, వీరభద్రం సంగీతం నచ్చింది. యింతవరకూ యే కలతలూ లేకుండానే వీరభద్రం జీవితాన్ని గడుపుతున్నాడు. నారాయణరావు దంపతుల పుణ్యమా అని కడుపు నిండుతోంది. నెల తిరక్కమునుపే, పిల్లలద్వారా వచ్చిన యాభైరూపాయిలు, చల్లగా జేబులో దాచుకొన్నాడు. మాటవరుసకి మాత్రం శారదతోను నారాయణరావుతోను అన్నాడు గొంతుక పెద్దదిచేసి పాఠాలు చెప్పటంతో, 'బాగా చెప్తున్నార'ని, మరికొంతమంది పిల్లలు రెండో నెలలో చేరారు. రోజులు గడుస్తున్నాయి.

## 8

శారద మధ్యరకం కుటుంబంలో జన్మించినప్పటికీ సంసారపక్షంగా జీవితాన్ని వెళ్ళమార్చటానికి తగిన స్త్రీ. తగుమాత్రం రూపసి. చామనచాయగా వుంటుంది. విశాలమైనకళ్లు. అమాయకత, నిర్మలత్వం ఆ కళ్ళల్లో దాగొని వున్నయి. కలుపుగోలుతనంగా మాట్లాడే వ్యక్తిత్వం. క్రొత్తవిషయాల్ని, సక్రొత్త అభిరుచుల్ని తెలుసుకొని తృప్తిపడే మనస్తత్వం. చదువూ - సంస్కారంలో పెద్దగా ఆరితేరిన మనిషి కాదు. పుట్టింటివద్ద నేర్చుకున్న పనిపాటలవల్లనే, నారాయణరావుతో సంసారం నిరాక్షేపణీయంగా చేస్తూ వుంది. వివాహం కాకముందు ఎన్నో కట్టుబాట్లలో కాలంగడిచింది, అలా గడుపబట్టే, తానీరోజున నారాయణరావుతో సుఖంగా కాపురం చేయగల్గుతున్నానని విశ్వసించింది. అయితే సంతానం లేకపోవటంతో ఏదో అనిర్వాచ్యమైన దిగులు పదే పదే కలతచేస్తూండేది. భర్తవల్ల యే లోపమూ కలగటం లేదని మనస్ఫూర్తిగా తెలుసు. అయినా, తన కడుపు పండటంలేదు. కారణం ఏమిటో అర్థంకావటంలేదు. ఎవరివల్ల యీ లోటు కల్గుతోందో ఎవరు తెల్పుకల్గేది? తన సంసారంగూర్చి సలహాలివ్వడానికి ఎవరికేంపని? లోకం హర్షించదూ! కాకిమూకగోల చేయదూ! శారద పరిపరివిధాలుగా తలపోసుకునేది. ఇక జీవితంలో పిల్లాజెల్లా కల్గరేమో! నని సందేహిస్తూ వుండేది. తనకింత యిల్లువుండీ, ఎంతో పరువు ప్రతిష్టలు గల్గినభర్తవుండీ, కూడా కలకలలాడుతూ పిల్లలు లేకపోయేసరికి శారద, తన ఒంటరిపాటుకి వ్యాకులపాటు చెందేది. పెట్టుకున్న ఎక్కడి వస్తువులు అక్కడే చెల్లాచెదురు కాకుండా వుంటూవుండేవి. నిజంగా పదిమంది పిల్లలుంటే, ఆ వస్తువులట్లా వుంటయ్యా! ఏదో ఒకటి పగులకొడుతూనో, విరగ్గొట్టుతూనో, చింపుతోనో, వుంటారు. "ఊరుకోండర్రా" అని ఎన్ని కేకలేసినా వాళ్ళూరుకోరు. కొడితే భావురుమని ఏడుస్తారు. పసిహృదయాలు తీరా కొంతసేపటికి వాళ్ళమీదే జాలికల్గుతుంది. ఎత్తుకొని తిప్పుతూ సముదాయించాల్సొస్తుంది. ఏది కావాలని మారాంచేస్తే, అదల్లా తెచ్చియివ్వాలనిపిస్తుంది. చిట్టిచిట్టి పెదవులతో బుల్లిబుల్లి మాటలలో యేదో మూగభాష మాట్లాడుతారు. మృదువైన చేతుల్ని చాస్తూ ఏమిటో కోరుతారు. తెచ్చి యివ్వకపోతే, నేలమీదపడి శోకనాలు పెడుతూ దొర్లుతారు. కట్టుకున్నబట్టలు దుమ్ముకొట్టుకొనిపోతయి. తలచెరిగి, చీకేసిన తాటికాయల్లాగా వుంటయి. కళ్లు ఏడ్పులతో కందిపోతయి.

(సశేషము)

# 'పాపం బ్రద్దలైంది'

'రాఘవ'

(గతసంచిక తరువాయి)

జారిన నీటిచారికలు నునుపైన బుగ్గలమీద చెరిగి పోవు. వెక్కిళ్లువుండీ - వుడిగిపోవస్తూనే వుంటయి. ఏ చిరుతిండి పెట్టో వాళ్ళని సముదాయించటం జరుగుతుంది. బొమ్మల పెళ్ళిళ్ళు ఆడుకొంటూ వుంటారు. మధ్య మధ్యా కీచులాడుకొంటూనే, ఏడుస్తూనే, తిట్టుకుంటూనే, అంతలోకీ రాజీపడి, పాతవన్నీ విస్మరించి, ఎంతో సమిష్టిగా, ఆనందంగా ఆడుకొంటారు. యిలాంటివన్నీ తన కెప్పుడు సంభవించేది? యిటువంటి ఆనందపూరితమైన అనుభవాలు యింకా ఎప్పుడూ సంప్రాప్తించేది? మనస్ఫూర్తిగా ఎప్పుడు అటువంటి వాళ్లని ఎత్తుకు పెంచేది? కళ్యాణరామాని తన్మయత్వ చెందేది యింకెప్పుడూ?' శారద ఆవేదనతో ఆలోచిస్తూండేది. వింత వింత ఆలోచనలతో [illegible] కలలు గనేది. అవన్నీ తన అనుభవాలే అయిపోయినట్లుగా భావించుకొని, పరాయివాళ్ళ పిల్లల్ని ముద్దాడుతూవుండేది. లక్కపిడతలు బొమ్మలు, నారాయణరావుతో తెప్పించి యిస్తూ వుండేది. ఆడపిల్లలకు తలలు దువ్వి, జడలువేసి పరాయి పిల్లలనే భావం పూర్తిగా మర్చిపోయి, 'తన' అనే దృష్టితో, ముస్తాబు చేసేది. దగ్గరగా కూర్చొబెట్టుకొని, వెండిగిన్నెలో పెరుగన్నం కలిపి పెడుతూ వుండేది. చుట్టూవున్న అమ్మలక్కల పిల్లలంతా శారదకు చనువైపోయారు. రోజుకి ఒక్కమారైనా బిలబిలమంటూ శారద దగ్గరకు వస్తూవుండేవాళ్లు; వచ్చిన వాళ్ళని వూరికే పంపటం మనస్కరించక యేదో ఒకటి తింటానికి పెట్టి సరదాగా వాళ్ళతో, ఆ మాటా - యీ మాటా కూడా బల్కి, తృప్తి పడుతూండేది. ప్రొద్దు కూకుతూండగా ఎవరిళ్ళకి వాళ్లు వెళ్లేసమయంలో శారద బెంగగా చూస్తూ, తనకి పిల్లలు లేకపోవటం గుర్తుకొచ్చి కంట తడిబెట్టుకునేది. నారాయణరావు ఎప్పుడైనా ఆవేళప్పుడు యింటికొస్తే, దగ్గరగా వెళ్ళి గుండెలమీద తల ఆనించుకొని బిట్టుగా విలపించేది. అతను తన దృష్టిని భార్య ఆలోచన మీదకు పోనిస్తూ, ఓదారుస్తూండేవాడు. అదపా - తదపా పట్టణం వెళ్ళివచ్చినప్పుడల్లా శారదకు వుత్సాహం కల్గించే పిల్లల నిమిత్తం ఏ బిస్కట్లు పొట్లాన్నో, మరే యితర చిరుతిండో తెచ్చి యిస్తూండేవాడు. తనకి పిల్లలు లేకపోయినా, చుట్టూ వుండే అమ్మలక్కల పిల్లలు, తన యింటికొచ్చి ఆడుకొంటుంటె, నారాయణరావుకి, వచ్చిన ఆ పిల్లమూకంతా 'తనా' అనే భావంతోనే చూసుకొంటూ వుండేవాడు.. పిల్లల సరదా తీరటం కోసమేనేమో! అన్నట్లు వీరభద్రం ప్రయివేటు స్కూలు కూడా పెట్టాడు.

శారద తరచు పనిపాటలన్నీ ముగించుకొన్న తరువాత వీరభద్రం వున్న చోటుకివచ్చి, పాఠాలు చదువుకొంటున్న పిల్లల్ని చూస్తూ నిలబడుతూండేది. కొందరు వొప్పజెప్పిన పాఠాల్ని చూడకుండా వ్రాస్తూండేవాళ్లు. కొందరు నిలబడి రాని పాఠాన్ని వల్లె వేస్తూండేవాళ్లు. మరికొంతమంది ఎక్కాలు చదువుతూండేవాళ్లు. యింకా కొందరు దిక్కులు చూస్తూ అచ్చటా - ముచ్చటా పిచ్చికబుర్లు చెప్పుకొంటూవుండేవాళ్లు. ఒంటికనీ, రెంటికనీ, పోయేవాళ్లు పోతున్నారు. వచ్చేవాళ్లు వస్తున్నారు. 'పుస్తకాలు చింపాడ'ని ఒకడు వీరభద్రంకి ఫిర్యాదు చేస్తున్నాడు. 'నా జడ లాగుతున్నాడు చూడండి మేస్టారూ' - అని ఒకఆడపిల్ల కోపంతో వీరభద్రంవంక చూస్తూఅంటోంది. 'నా బలపం విరగ్గొట్టాడండీ!' అని ఒకడు ప్రక్కవాణ్ణి తిన్నతిండి కక్కేటట్టు గుద్దాడు. 'సాయంత్రం చెచ్చా లాడుకొందామా'-అని ఒక సోమరిపోతు

ప్రక్కవాణ్ణి చదువుకోనివ్వకుండా చేస్తున్నాడు. "నిద్రపోతున్నావా? ఉండు మేస్టారితో చెబుతా" అని ఒక ఆడపిల్ల లేచి, విసురుగా వీరభద్రం దగ్గరకి వస్తూ దారిలో మరొకడి ముందున్న సిరాబుడ్డిని 'ఫడేల్'మని తన్నింది: దాంతో ఒకడి గుడ్డలు పాడైనయి. వ్రాసుకొన్న కాపీ పుస్తకం సిరాతో తడిసి పోయింది. వాడు ఏడుస్తున్నాడు. 'చెబుతా'నంటూ వచ్చిన ఆడపిల్లకు ఏంచెప్పాలో తోచక, అక్కడే చతికిలబడి, ఒలికిన సిరాను ఎత్తడానికి ప్రయత్నిస్తోంది. ఒకడు సినిమా బొమ్మల పుస్తకం తెచ్చి ఆడపిల్లలందర్ని దగ్గరకు చేరదీసి, 'నువ్వు అంజలీదేవిలాగా వున్నావు. నువ్వేమో భానుమతివి. వీడు నాగేశ్వరరావులాగే వున్నాడు. వీడేమో తోటరాముడు.' అని మొగపిల్లల్ని కూడా చూపుతున్నాడు. అందరూ చదువులు మాని వాళ్ళలో వాళ్లు సినిమా బొమ్మల్ని గూర్చి చెప్పుకొంటున్నారు. మరి కాసేపటికల్లా ఆ పుస్తకం తెచ్చినవాడి లేతవీపు వీరభద్రం చేతిలో పెసరట్టు తేలినట్లు తేలింది. వాడు 'అమ్మో - బాబో' అంటూ పుస్తకం దాచేసాడు. అంతే ఎక్కడివాళ్ళక్కడ గప్‌చిప్ - చదువుల్లో మునిగారు. శారదకు యీ దృశ్యాలన్నీ చూడ ముచ్చటగా వున్నయి. వీరభద్రం, ఆ బొమ్మల పుస్తకం తెచ్చినపిల్లవాణ్ణి అంత దెబ్బకొడతాడని అనుకోలేదు. కళ్ళు చివతలారినయి. సిరా పారబోసిన ఆడపిల్ల చేతులు యీత బెత్తంతో వాతలు తేలినయి. శారదకు కళ్ళు చెమ్మగిల్లినయి. నిద్రపోతున్నవాణ్ణి ఒక్క గదుము గదిమాడు. శారద వులిక్కిపడింది. బలపం విరగ్గొట్టినవాణ్ణి పిల్చి తొడపాశం పెట్టాడు. వాడు మెల్లిగా మొదలెట్టిన ఏడుపుని, సైరన్ కూతలాగా పెద్దదిచేసి, తగ్గించాడు. శారద ద్రవించింది. వీరభద్రం గూడ కట్టు కట్టుకొని కుర్చీలో కూర్చొని సిగరెట్ కాలుస్తూ లెఖ్ఖలు చెబుతున్నాడు. శారదకి యిక అట్టేసేపు వుండబట్టలేక, ఆనాడు పిల్లలంతా వెళ్ళిపోయిన పిదప, తన వాటాలోవుండి వీరభద్రాన్ని 'బావా'! అని కేక వేసింది. అతను లేచి, తలదువ్వుకొని, - మెల్లిగా శారద వున్నచోటుకొచ్చి, ఒక కుర్చీలో కూర్చున్నాడు.

"అట్లా పిల్లల్ని చావ చితక్కొడుతున్నావ్ గదా! బ్రతకటానికేనా?" — అని అడిగింది.

"లేకపోతే చదువెట్లా అబ్బుతుంది?" - అని సమాధాన మిచ్చాడు. శారద యింకేం మాట్లాడలేదు; కాని ఆమె ముఖంలో తను చేసే హింసాకృత్యాల తాలూకు బాధ — ఆవేదన ఎందుకో వున్నట్లు గ్రహించేడు. యికముందు తానట్లా ప్రవర్తించటం బాగుండదనుకొని, వీరభద్రం-

"ఏదో పొరబాటైపోయిందిలే యికనుంచి ఏపిల్లల మీద చెయ్యిచేసుకోను. అనవసరంగా నీ మనస్సు కష్టపెట్టాను. నీకు పిల్లలంటే యింత మక్కువని యీ వరకూ తెలుసుకోలేకపోయాను. పశువుగా ప్రవర్తించాను. క్షమించు శారదా!" - అని కాస్త దైన్యభావంతో అన్నాడు. తన మనస్సులోని బాధనూ - ఆవేదననూ యింత సులువుగా అర్థంచేసుకొని, మనసుని మార్చుకొన్నందుకు వీరభద్రంని చూసి, శారద సంతోషించింది. అక్కణ్ణుంచి, వీరభద్రానికి, తనకి పిల్లలమీద ఎంత మక్కువగల్గివున్నదో తెలియపర్చింది. 'నీదగ్గర కొచ్చేపిల్లలంతా నావాళ్లేనని వూహించుకొంటున్నా'నంది. 'అలా కొంతకాలం పిల్లలతో కాలక్షేపం చేస్తేనన్నా సంతానం కల్గుతుందేమోనని ఆశపెట్టుకొని పూరటపడుతున్నా'నని కూడా చెప్పింది. "తన జీవితంలో దిగడిపోయిన కోరిక, సంతానం లేకపోవడ మొక్కటేనని" పదేపదే వ్యక్తీకరించటమే కాక, స్పష్టీకరించింది కూడా అలా శారద చెప్పుకొన్తూ కంట తడిపెట్టేంది. వీరభద్రం కూడా మొసలి కన్నీటి మాటలతో ఓదారుస్తూ—

"నువ్వలాంటి దిగులేమీ పడకు. అదృష్టం తోసుకు రావాలేగాని, పిల్లలెంత సేపట్లో పుడతారూ—" అన్నాడు. ఆ మాటతో శారదకు కాస్త ధైర్యమొచ్చింది. వీరభద్రం వచ్చి అప్పటికి ఆర్నెల్లు

దాటింది. ఎంతో స్వతంత్రం అతని కాయింట్లో ఏర్పడింది. నారాయణరావు వున్నా లేకపోయినా, వీరభద్రం, శారదకు అండదండగా వుంటూవున్నాడు. బంధురీత్యా వీరభద్రం మెలగటం సన్నగిల్లిపోయింది. శారదను వుత్సాహవంతురాలినిగా చేయాలని తలంపు కల్గింది. పాతకాలపు భావాలతో నారాయణరావుని పూజిస్తున్న శారదను, నవీన భావాలతో మార్చివేయాలనే ఆకాంక్ష ఏర్పడింది. సినిమాలు చూడటానికి ప్రయత్నించని శారద, వీరభద్రం మాటల రీతితో, సినిమాలు చూడాలనే అభిలాష కల్గింది. నేత చీరెలు కట్టి, ముఖానింత అర్థరూపాయి మందంగా కుంకుమ పెట్టే శారద, వీరభద్రం చెప్పి మారిపోసే క్రొత్త అలంకరణలతో, వాయిల్ చీరెలు, సిఫాన్- సిల్కు చీరెలు కట్టడం నేర్చుకొంది. తిలకం సన్నగా ఆశ్చర్యార్థకం లాగా పెట్టుకోవటం చేస్తోవుంది. నారాయణరావు, తన భార్య శారదలో కల్గుతున్న మార్పులికి వేరేదురభిప్రాయమేమీ పడకుండా, ముచ్చట పడుతూ వుండేవాడు. కాలానుగుణ్యమైన మార్పులు రావటంవల్ల ఏ ఆటంకమూ పెట్టలేదు. వీరభద్రం తన సంసారానికి ఎంతో ఉపకారిలాగా వుంటున్నాడని నమ్మివేశాడు. చేతికందుబాటులో వుంటూ, ఏ పని చెపితే ఆ పనల్లా చేస్తూన్నవాడని విశ్వసించాడు. దిక్కులేనివాడికి జీవనోపాధి కల్పించటం, తనవల్ల ఎలాగో జరిగిందని తృప్తిపడ్డాడు. ఎంతో హితుడైనందుకూ — సంతోషించాడు. పిల్లలు గల యిల్లు కాకపోయినా, వీరభద్రం చలవవల్ల వూరిలో పిల్లలంతా తనింట్లో అస్తమానమూ అల్లరిగా చదువుకొంటూ గోలచేయటం, ఎంతో ఆనందదాయకమని మురిసిపోయాడు. అంతేగా మరి! లేకపోతే వీరభద్రం విరాట్ స్వరూపం, నారాయణరావు కేంతెలుసు? శారదకేం తెలుసు?

వీరభద్రం స్థితిగతులు క్రమేపీ శృతిమించి రాగాన పడటం మొదలెట్టినయి. చాకలివుతికి తెచ్చిన బట్టల్ని కట్టుకోవడానికి అలవడిన నారాయణరావు దంపతుల్ని యిస్త్రీబట్టలు కట్టుకునేలాగూ చేసాడు. అయితే నారాయణరావు అంత చెప్పుడు మాటలు విని ప్రవర్తించే రకమా! శారద భర్తకోసం - అతని ఆనందకోసం తాపత్రయపడుతూండేది. పడకగదిలో అమర్చిన దేవుడి పటాలను, కొన్నింటిని మండువాయింట్లోకి మార్పించి, ఆ స్థానంలో సినిమా తారల ఫొటోల క్యాలండర్లను తగిలించాడు. గోడకు ఖాళీవున్న చోటల్లా ఒక్కో మేకుకొట్టి, పౌడరు తాలూకా బొమ్మల క్యాలండర్లనూ - సబ్బు తాలూకు బొమ్మల్ని - తగిలించాడు. ముఖ్యంగా ఆ బొమ్మల్లో వైంగిక విజ్ఞానాన్ని గుర్తుచేస్తూ మానసికమైన వుద్రేకాన్ని కల్గించేటట్లుగా వున్నయి. క్రొత్త క్రొత్త పత్రికలను దగ్గర్లో, ఒకమైలు దూరంలోవున్న ఒక మాదిరి బస్తీనుండి కొని తేవటం సాగించాడు... ఆ పత్రికల ముఖచిత్రాల్ని చూస్తుంటే, కొనాలనిపించేటట్టు చేస్తయి. వీరభద్రం యిలాంటి సెక్సు పుస్తకాల్నే కాక, మరికొన్ని చెత్తపుస్తకాల్నికూడ తెచ్చి, నారాయణరావుకి తెలిసీ తెలియకుండా యిచ్చి, చదువుకోమని చెపుతూండేవాడు. అక్కడికి ఒకనాడు భోజనాలు చేస్తున్న సందర్భంలో నారాయణరావు, వీరభద్రాన్ని వుద్దేశిస్తూ —

“మా యింటిని రానురాను బస్తీకొంపగా మారుస్తూన్నావేమిటి?” అన్నాడు. వీరభద్రం, ఏరకంగాను జంకక —

“ఇల్లు చూడ్డానికి అందంగా లేకపోతే, యింట్లో వాళ్లు అందంగా ఎలా వుంటారండీ! ఆనందం ఎలా కల్గుతుంది? యింకా పాతకాలంలో ఎన్నాళ్ళుంటాం చెప్పండి” వీరభద్రం నిర్భయంగా వుపన్యాసం చెప్పటం సాగించాడు. ఆ పూటకి భోజనాలైనయి. వీరభద్రం తన వాటాలో కొచ్చేసి దర్జాగా పడుకున్నాడు. యింకా తిండి తినటానికి పోయిన బడిపిల్లకాయలు తిరిగి రాలేదు. మధ్యాహ్నం అవుతోంది.

శారదకూడా నెమ్మదిగా అన్నం తిన్నది. నారాయణ తన పనిమీద ఎటో వెళ్ళిపోయాడు. పడుకొన్న వీరభద్రం మెల్లిగాలేచి, తన పెట్టెతెరచి, తెచ్చిదాచిన క్రొత్త క్రొత్త సెక్సు పుస్తకాల్ని, రెండు పౌడరు డబ్బాల్ని, రెండు స్నో సీసాల్ని,

యిలాంటి అలంకరణ సామాగ్రిని చేతపట్టుకొని, తీసికొచ్చి, పడుకొనివున్న శారద మంచంమీద వుంచాడు. శారద చటుక్కున లేచి - వింతగా చూస్తూ, ముందు పడివున్న వాటినతను పక్కకు చేసుకొంటూ—

"ఇవన్నీ ఏమిటిబావా ?" - అని ప్రశ్నించింది. తొణుక్కుండా బెణుక్కుండా వీరభద్రం, శారద ముఖంలో ముఖం వుంచుతూ,-"నీకోసమే తెచ్చాను శారదా !" - అన్నాడు.

ఆమె ఉలిక్కిపడింది. కొంచెం జంకింది. రెప్ప వాల్చకలాగే చూసింది. అతను కీచకుడిలా నవ్వుతున్నాడు. సెంట్ సీసా ఒకటి జేబులోంచితీసి, ఆమెకివ్వబోతూ —

"రాసుకో శారదా !" - తీయగా అన్నాడు. జళ్లో తురుముకున్న కిల్లీ వాసన మత్తుగా వచ్చింది. ఆమె వాటివంక చూస్తూ "ఎవరు తెమ్మన్నారు ?"- అంది.

"వీటిని తెమ్మనమని ఒకరు చెప్పాలా ? నీకు ఎలాగూ లేవని తెలిసి తెచ్చాను. నారాయణరావు అన్నగారితో చెప్పినా యివ్వేగా తెచ్చిపెట్టేవి. అందువల్లనే ఎవరు తెస్తేమాత్రం ఏముందిలే అని, నేనే తెచ్చాను. ఏం? కోపం వచ్చిందా ? అవమానం వేస్తోందా ? చెప్పు శారదా ?" - సూటిగా చూస్తూ అడుగుతున్నాడు.

శారద నోరు మాటాడలేదు. "యివన్నీ ఎవరు చెప్పితే తెచ్చావు ?" - అనే ప్రశ్న ఆమెను నిలవ తీస్తోంది. "ఒకవేళ మాట వరుసకైనా, తన భర్త ఏమైనా అన్నారా ?" - సందేహించింది.

"అంటే మాత్రం వీరభద్రం, తనతో చెప్పకుండా వెళ్ళి బుడుబుడా తేవటమేనా ? తెచ్చాడూ, బాగానేవుంది. భర్తలేని సమయంచూసి యిట్లా తన మీద మీదకొస్తూ, తీసుకోమనటం భావ్యమేనా!"- తీవ్రంగా దీర్ఘాలోచన సాగిస్తోంది. "వీరభద్రం యిలా ప్రవర్తిస్తాడని తను అనుకోలేదే !" తనలో తాను వితర్కించుకొంది.

వీరభద్రం అలాగే సిగ్నల్ స్తంభంలాగా నిలబడి వున్నాడు. పిల్లలింకా రాలేదు. వస్తే బాగుండు ననుకొంది. రావటంలేదు... పరిస్థితి అగమ్యగోచరంగా తోచింది. అతని హృదయంలోని ఆ కాంక్ష ఏమిటో అర్థంకాలేదు. కాసేపు స్తిమితంగా వుండామనుకొంది. వీరభద్రం వున్న చోటునుంచి కదలటంలేదు. వెళ్ళి పొమ్మని చెబుదామనుకొంది. మాట గొంతుక పెగలి రావటంలేదు. శరీరమంతా చెమటలు చిరుచిరుగా పోస్తున్నాయి. సుడిచి, సుడిచి గాలివీస్తోంది.

నారాయణరావు అప్పటికీరాలేదు. 'ఒకవేళ వస్తాడేమో!' అనుమానించటం మొదలెట్టింది. తీరా వచ్చి యీ భాగోతంచూసి ఏమనుకొంటారో! భయంవేయసాగింది. 'మోసంచేస్తున్నానని' అపార్థం చేసుకొంటారేమో!' హృదయం గజగజ వణికి పోతోంది. తెగనిపోని ఆలోచనలు ఆమెను, సలిపి వేస్తున్నాయి. కానరాని గాయమేదో కలకవేస్తున్నట్లుంది. ఏదో అజ్ఞాత భయోత్పాతాన్ని కలిగిస్తోంది. ధైర్యం దిగజారిపోతోంది. చేతులారా తన పండంటి సంసారాన్ని కూలదోసుకొంటున్నానేమోనని తర్జన భర్జన చేసుకోవటం ప్రారంభించింది.

(సశేషము)

డాక్టరు కే. యన్. కేసరిగారి

నా చిన్ననాటి ముచ్చట్లు

వెల రు. 2.00 లే — పోస్టేజి ఉచితం

హిగిన్ బాదమ్స్ స్టాల్సులో దొరుకుతుంది

# 'పాపం బద్ధలైంది'

'రాఘవ'

(గతసంచిక తరువాయి)

పిల్లలు లేకపోవటంతో యింతటి అఘాయిత్యానికి పాల్పడదల్చుకోబోతున్నాడేమోనని, లోతుగా భావించింది. ఇంతలో గగ్గోలుచేస్తూ, బడి పిల్లలు వచ్చి, చాపలు పర్చుకొని కూర్చుండబోతున్నారు. వీరభద్రం, శారదవంక కిరాతుడిలాచూస్తూ, తన వాటాలోకి వెళ్ళిపోయాడు. శారద ఒక్కనిట్టూర్పు విడిచింది. కడివెడుపాలని ఒక్క ఉప్పుగల్లు ఎలా విరిచేస్తుందో, ఆ విధంగానే వీరభద్రం, నారాయణరావు మనస్సునికూడా, విరిచేసి దురలవాట్లపాలు చేసాడు. మొగమాటంచేత ముందు వీరభద్రంచెప్పే మాటలతో సంతృప్తిపడి, ఆ సంవత్సరం శ్రీరామనవమి ఉత్సవాలంటూ ఏర్పాటు చేసాడు. దానికి వూరివాళ్ళవద్దనుండి చందాలుప్రోగుచేసి, తానొక అయిదువందలు వేసుకొని పదిహేను రోజులపాటు నిరాఘటంగా భజనలూ, హరికథలూ — నాటకాలూ పెట్టించాడు. ఉత్సవాలు పూర్తయినయి. పెట్టుబడికి మించిన ఖర్చయింది. నారాయణరావు జంకకుండానే, నిలువచేసిన పైకాన్ని సర్దివేశాడు. ఆ దెబ్బలో నారాయణరావుకి దాదాపు వెయ్యి రూపాయలదాకా ఖర్చయింది. వచ్చిన నటులంతా, భాగవతార్‌లంతా నారాయణరావు యింట్లోనే చేతులుకడుక్కోవటంతో యింతఖర్చయిందని వూరు వూహించింది. 'ఇలాంటి వుత్సవాలు యింతవరకు మన వూళ్ళో జరగనేలేదని మెచ్చుకున్న మోతుబరులు మొఖాసాదారులు నారాయణరావుని ఎంతో అభినందించారు. వీరభద్రంకూడా రెండు మూడుసార్లు రంగుపూసుకొని కురుక్షేత్రంలో కృష్ణుడి పాత్రనూ, రామాంజనేయ యుద్ధంలో రాముడిపాత్రనూ హరిశ్చంద్రలో విశ్వామిత్రుడి పాత్రను పురజనులు మెచ్చుకొనేటట్లువేశాడు. నారాయణరావుకి అమితానందం కలిగింది. అతనులోగడ పిచ్చాపాటీగా నాటకాల్ని గురించీ, నటుల నటనాశక్తిసామర్థ్యాల్ని గురించి చెప్పుతుంటే నారాయణరావు మామూలుగా వినగల్గాడేగానీ మనస్ఫూర్తి నమ్మలేదు. అలాంటిది కళ్ళారాచూసిన తరువాత వీరభద్రంని పొగడకుండా వుండలేకపోయాడు.

"నువ్వు సినిమాల్లో చేరితే బాగారాణిస్తావోయ్!" అనికూడా అన్నాడు. అప్పుడు వీరభద్రం చిరునవ్వు నవ్వుతూ -

"మీలాంటివారు ఆసరాగావుండి, ఆదుకొంటే నేను సినిమాల్లో నటిస్తూ రాణించకుండా వుంటానా!" — అన్నాడు. తరువాత యిరువురూ భుజాలమీద చేతులు వైచుకొని గృహోన్ముఖులయ్యారు.

ఇదే మొదలు, నారాయణరావు, వీరభద్రం చేతిలో కీలుబొమ్మ అయ్యాడు. తనకున్న విద్యలన్నీ క్రమక్రమంగా నారాయణరావుకి నేర్పుతుంటం సాగించాడు.

ఒక సంవత్సరం పూర్తిగా గడిచేసరికి, వీరభద్రం ఉద్బోధలతోనూ - మాయమాటలతోనూ — లత్తుకోరు కబుర్లతోను - మోసం ఎత్తుగడలతోనూ, నారాయణరావు మనస్సు పూర్తిగా మారిపోయింది. శారద వున్నదా? — లేదా అనే విషయంకూడా పెద్ద ఆలోచనగా లేకుండా పోయింది. ఏదైనా కావాల్సొస్తే వీరభద్రంతో చెప్పిపంపేవాడు. మునసబు గిరిమీద యావ, శ్రద్ధా, సన్నగిలిపోయి జగన్నాథం వాటాలో వెనుకవైపువున్న గదిలో పేకాట ఆడుతూవుండేవాడు. అక్కడికి చేరేవాళ్ళంతా వీరభద్రం చలవవల్ల వచ్చినవాళ్ళే. యీ విషయం

నారాయణరావుకి తెలుసు. అయినా పెద్దతప్పుగా తోచలేదు. సరదాగా వూరివాళ్లతో ఆడుకోవటం అనుకున్నంత నామర్దాకాదనుకున్నాడు. వీరభద్రం కూడా ప్రయివేటు స్కూలుమీద చిన్న చూపు విసిరి పేకాటభాయిగా మారాడు. ఎన్నడూ రాని మార్పు ఆ వూళ్లో ఒక్కసారిగా వచ్చేసింది. నారాయణరావు పేరుకి, అంతవరకూ ఎంతటి విలువా, సభ్యతా గౌరవం, ప్రతిష్ఠవున్నయో అన్నీ యీ మార్పుతో తారుమారైనయి. మునసబులాంటి వాడే పేకాటాడుతూంటే యిక ఆ వూళ్లో ముక్కలు త్రిప్పనివాడెవడుంటాడు?

క్రమేపీ పేకాట, జూదంగా మారిపోయింది. మూడు నాలుగు నెలలు అమితోత్సాహంగా గడిచినయి. నారాయణరావు డబ్బు ఆటలో మునిగి, ఆస్తి అమ్మటానికి వీరభద్రం సలహాకోసం ఆలోచిస్తున్నాడు. శారద హెచ్చరించింది. ఎన్నో విధాలుగా బ్రతిమిలాడుకొంది. "సంతానం లేనందుకే ఎన్నో విధాలైనా అపవాదులుపడి యీ యింటిలో, మ్రగ్గి చస్తుంటే, పైగా మీకీ చెడు అలవాటులేమిటని" నిగ్గ తీసి అడిగింది. నారాయణరావుకి సహజంగా విచక్షణాజ్ఞానంవుంటూ వుండేది. అది ఏమైందో శారద అలా అడిగేసరికి, ఆమె కర్థంకాలేదు. అతను వినిపించుకోలేదు. సూటీగా ఆలోచించాడు. జేబులు తడుముకొన్నాడు 'వీరభద్రం' అని కేకలేశాడు. అతను పలకలేదు. వెంటనే చేతిగడియారం చూసుకొన్నాడు. పన్నెండుదాటింది. ఎండ తీండ్రించుతోంది. ఆ రోజునంత మార్పు నారాయణరావులో ఎందుకు కల్గిందో ఎవ్వరికీ తెలియదు. సరాసరి చెప్పులు తొడుక్కొని పేకాటవద్దకొచ్చాడు. వీరభద్రం మంచి ఆటలో మునిగివున్నాడు. యింకా యితర ఆటగాళ్లుకూడా తిండీ తిప్పలూ మానుకొనివున్నారు. ఆవూళ్లో ఎన్నడూ లేని ఒక చెడు అలవాటు ఎట్లా కల్గిందో కల్గింది. అంతే! ప్రొద్దస్తమానమూ ఆడిన వాళ్లు ఆడుతున్నట్లే వుంటున్నారు. సిగరెట్లు తగలేనివాళ్లు తగలేస్తూనేవున్నారు. వీరభద్రం ఎందుకో తలెత్తి చూశాడు. నారాయణరావు కనిపించాడు. ప్రయివేటు పిల్లలు తిట్లు తినివచ్చి, మేష్టారి కోసం ఎదురుచూస్తున్నారు.

"ఇవ్వాల్టికి యిక ఆట ఎత్తేయండి"—అన్నాడు—సభికులంతా నారాయణరావు వంక ఎగా దిగా చూశారు. ఎప్పుడు అడ్డుచెప్పని మునసబు యివాళెందుకన్నాడా? అని వింత వింతగా ఆలోచించుకొంటూ, ఆట కట్టేసి లేచి, ఒళ్లు విరుచుకొని ఎవరిదారిన వాళ్లు చీలిపోయారు. వీరభద్రం నారాయణరావుని వెంటబెట్టుకొని, తన గదిలోకి వచ్చాడు. అప్పటికే పిల్లలంతా రావటంతో, నారాయణరావు, వీరభద్రం వంక చూసి—

"తర్వాత మాట్లాడదాం... నాకు పనుంది... అలా వెళ్ళొస్తా" అని చెప్పి వెళ్లిపోయాడు. యీ మాటలు వీరభద్రంకేగాక, శారదకు కూడా అర్థంకాలేదు. ఆశ్చర్యం వేసింది. కారణాలు రకరకాలుగా వూహించుకొన్నారు. పరిస్థితులు యిద్దరికీ భీతావహంగా వున్నయి. పిల్లలు చదువుతున్నారు. నారాయణరావు సంగతి క్రమక్రమంగా ఆ నోటా నోటా పడి, జగన్నాధంవరకూ వెళ్ళింది. అతను విభ్రాంతుడయ్యాడు. ఇట్లా మారిపోవటానికి కారణం ఏమిటో తెలియలేదు. డబ్బు తగలేస్తూ చెడు అలవాట్లకు లోనయి, పరువు ప్రతిష్టల్ని పోగొట్టుకోవటం సహించలేకపోయాడు. చూసి వద్దామని బయలుదేరి వచ్చాడు. ఆనాడే, మూడు గంటల సమయంలో నారాయణరావు లేడు. వచ్చిన బావగారికి మంచినీళ్ళిచ్చి, కుర్చీచూపింది. జగన్నాధం వ్యధితహృదయంతో నారాయణరావుని గూర్చి ప్రశ్నించాడు. వీరభద్రం యింట్లోలేడు, పిల్లలు చదువుతున్నారు. హఠాత్తుగా వచ్చిన జగన్నాధం యింటంతటిని కలయచూసి, చాలావరకు మారిపోయిందని వూహించాడు.

"ఇంట్లో అంతా కులాసాగా వున్నారా? మా అక్కగారేమంటోంది," శారద మెల్లిగా క్షేమ సమాచారాల్నడుగుతూ, దుర్గమ్మనిగూర్చికూడా అడి

గింది. జయలక్ష్మినికూడా అడిగింది. జగన్నాథం వాటన్నిటికీ సమాధానములిచ్చి, మళ్ళీ కాసిని మంచి నీళ్ళు త్రాగాడు.

"ఎంతసేపైందీ వాడెళ్ళి" - నారాయణరావు సంగతి ఎత్తాడు జగన్నాథం.

"చాలాసేపైంది ...యీపాటికి వస్తూండాలి."
"ఎక్కడికి వెళ్ళాడో తెలుసా!"
"తెలియదు... కాఫీవేళవుతోందిగా! వస్తారు."
"వీడెందుకిట్లా మారిపోయాడు శారదా?"

శారద తలవంచుకొంది. ఎట్లా ప్రారంభించి, వున్న విషయాన్ని ఎరుక పర్చాలో తెలియలేదు. తన భర్తని గురించి, భార్యగా తాను చెప్పటం పొరపాటు అవుతుందేమోనని అనుమానించింది. కానీ, చెప్పక తప్పదు.

"తనకి భర్త కాకముందునుంచి, ఆయనకు తమ్ముడు. అలాంటప్పుడు తాను చెప్పకపోతే, ఎంత బాధపడతాడు..." శారద లోలోన అనునయపర్చుకొని,- వీరభద్రం గురించి, తానూహించినంతా చెప్పింది. అటుపిమ్మట భర్తనిగూర్చి, చెప్పుకొస్తూ-

"ఎటొచ్చీ మరీ యీ మధ్యనే బొత్తిగా మారిపోయారు, క్షణం సేపు యింటి పట్టున వుండమంటే వుండరు, అదేమిటండీ! అంటే, నాకేం తోచటం లేదంటారు. పిల్లా జెల్లా లేకపోబట్టేగా - యీ వీరభద్రం ఎంతో మంచివాడనే వూహించాను. అతనొచ్చిన తరువాతే, యీయన మరీ మన మనిషి కాకుండా పోయారు, పూలమ్మిన వూళ్ళో కట్టెలమ్ముకోవలసిన గతి పడుతోంది. ఎన్నిసార్లు చెప్పినా చెవిన పెడుతున్నారు. ఏంచేయమంటారు?" కంటనీరిడుతూ అంటోంది. ఇంతలో నారాయణరావు, వీరభద్రాన్ని వెంటేసుకొని, కాఫీ త్రాగడం కోసం వస్తున్నాడు. జగన్నాథం చూశాడు. దగ్గరగా రానిచ్చి, కళ్లజోడు తీసాడు.

నారాయణరావు క్రుంగిపోయాడు అన్నగార్ని చూసేసరికి. వీరభద్రం భుజంమీదవున్న ఎడంచేయి, అంతలోనే క్రిందికి జారిపోయింది. మెల్లిగా లోపలికొస్తూ —

"ఎప్పుడొచ్చావ్ అన్నయ్యా!" అన్నాడు. జగన్నాథం అప్పటివరకూ వీరభద్రం వంకే చూస్తున్నాడు... తేప్పరిల్లి...

"వచ్చి చాలాసేపైందిరా!"
"కాఫీ త్రాగావా?"
"లేదురా! నువ్వొస్తావుగదా అని ఆగాను..."

"తీసుకురావే". అని శారదవంక చూశాడు నారాయణరావు. వీరభద్రం ఎందుకో, జగన్నాథాన్ని చూస్తూ కలవరపడుతున్నాడు; ఎప్పుడిక్కణ్ణుంచి కదిలి అవతలికి పోతానా" అని ఎదురుచూస్తున్నాడు, ఇంతలో శారద కాఫీలు అందరికీ తెచ్చి యిచ్చింది. క్షణంలో త్రాగిన వీరభద్రం నారాయణరావుతో 'వస్తానని' చెప్పి ఆ ఛాయల్లో లేకుండా లైబ్రరీ దగ్గరికిపోయాడు. జగన్నాథం భారంగా ఒక్క నిట్టూర్పు విడిచాడు. నారాయణరావు చకితహృదయుడై అన్నగారి కెదురుగా మరో కుర్చీలో కూర్చున్నాడు. సిగరెట్ కాల్చటానికి ధైర్యం చాలటంలేదు.

"ఒరేయ్ నారాయణం...!" జగన్నాథం చుట్టు చుడుతూ ముఖం వంకచూశాడు. నారాయణరావు తలెత్తి చూశాడు.

"నీ ప్రవర్తనేమీ నచ్చటంలేదు" - సూటిగా అన్నాడు. నారాయణరావు తలవంచుకొన్నాడు. అన్నగారంటే ఎంతటి భక్తి - వినయం అతనికున్నాయో, ఆ సమయంలో తేటతెల్లమైంది.

"చెడు సహవాసాలతో, డబ్బునిట్లా దుర్వినియోగపర్చటం మనబోటి వాళ్ళకు మర్యాదైన పని గాదు ... నువ్వేమీ చంటివాడివి కాదుగా! నా అంతటివాడివి. మనవంశ గౌరవానికీ, పేరు ప్రతిష్ఠలకి కళంకం తీసికొని రావటం సమంజసంగా లేదు. పిల్లలులేనంత మాత్రాన, ఏమీతోచటంలేదని దురభ్యాసాలకు అలవాటుపడటం మంచిలక్షణంగాదు.

రక్తస్పర్శగలవాళ్లం. నువ్వుచెడిపోతుంటే చూస్తూ వూరుకోవటం నాకు చేతగానిపని. అమ్మచనిపోయి నాటికి నువ్వెంతో పసివాడివి. నాన్న నీ కోసం ఎంతో శ్రమపడి, తిండీతిప్పల్ని లెఖచేయకుండా నీ క్షేమంకోసం పాటుపడ్డాడు. నువ్వు బాగుపడి, నా అంతటి వాడివవుతావని ఎన్నో కలలుగన్నాడు. నీకోసం, ఆయనేగాకుండా నేనూ సకలశ్రమలు అనుభవించాను. చాలా కాలానికి నా తరువాత ఎవ్వరూ పుట్టలేదని బెంగగా వుంటున్న రోజులలో, తమ్ముడివిగా నువ్వు పుట్టావు. తోడబుట్టినవాడివైనందున నిన్నే చెల్లివిగా భావించాను. నువ్వే తమ్ముడవని నమ్మాను. రాముడికి లక్ష్మణుడు ఎలాసాయపడి, జీవితాన్ని ధన్యత పర్చుకొన్నాడో నువ్వూ అలాగే చేసుకొంటావని ఆశించాను. ఇంతవరకూ నువ్వంటే ఎంతో ప్రేమాభిమానాల్ని కల్గివున్నాను. నీకష్టం వచ్చినా నేను సహించలేను. నేనుబ్రతికివుండగానే, నువ్విట్లా అసభ్యంగా ప్రవర్తించటం ఎంతనీచమైన పని. మానాభిమానాల్ని మంటగలుపుకొని, బ్రతకటం వల్ల ఏమిటీ ప్రయోజనం? చూడబోతే, వాస్తవానికి మీం దంపతులిద్దరూ ఎంతో చిన్నవాళ్లు. లోకమనుషే ఏమిటో తెలియదు. హాయిగావున్న ఆస్తిని అంభవిస్తూ, చేతిలోవున్న మానసబుగిరిని చేసుకొంటూ చల్లగా బ్రతకవలసింది పోయి చెప్పుడు మాటలతో మనస్సుని చెడగొట్టుకొని ఎంతకాలం యిట్లా దిక్కుమాలిన బ్రతుకు బ్రతుకుతావు. శారదనిట్లా ఒంటరిపాలుచేసి నీ దారినువ్వు ఏమీ పట్టనట్టుగా తిరిగితే దానిగతి ఏంగానూ! యివన్నీ నీకునేను చెప్పాలా నారాయణం!"

జగన్నాధం కాస్తాగి చుట్ట అంటించుకొన్నాడు. అన్నగారనే ఒక్కొక్కమాట నారాయణరావు గుండెలికి యీటెపోటులాగా తగులుతోంది. కళ్లనీళ్ల పర్యంతమైనాడు. తలెత్తిజవాబుయిచ్చేతాహతు యెప్పుడూ లేనేలేదు. జగన్నాధం అంటే కేవలం అన్నగారనే దృష్టేగాక 'తండ్రి' అనే మూఢభావంకూడావుంది. చదువుచెప్పించి పెళ్లిచేసి చెక్కుచెదరని ఆస్తిని చేతులారా తన చేతులకప్పజెప్పి మనసబుగిరినిచ్చి సుఖంగా బ్రతకమని అన్న, ఒక సాధువర్తనుణ్ణి ఎదిరించి పల్కేధైర్యం లేనివాడు నారాయణరావు. అక్కణ్ణుంచి జగన్నాధం ఎంతో సేపు హితోపదేశం చేశాడు. ఎన్నో నీతివాక్యాల్ని చెప్పాడు. మంచి మార్గాల్ని వుదహరణగా చూపించాడు. బుద్ధి మార్చుకోమని కోరాడు. యింతవరకు పోయిన డబ్బుని గూర్చి విచారపడవద్దని ధైర్యం నూరిపోశాడు. శారదని కనిపెట్టుకొని వుండమన్నాడు. ఆమెకేలోటూ కల్గించవద్దని మరీ మరీ జాగ్రత్తగా చెప్పాడు. నువ్వేమాత్రం చెడుగా తిరిగినా శారద మనస్సు చెదరిపోతుందని హెచ్చరిక చేశాడు. పిల్లలు లేరని దిగులుపడవద్దన్నాడు. భగవంతుణ్ణి పూజించమన్నాడు. సక్రమంగా జీవితాన్ని మంచితనంతో గడుపుకోమని పదేపదే చెప్పాడు. శారద హృదయానికి, జగన్నాధం మాటలన్నీ ఎంతో శాంతిని చేకూరుస్తున్నాయి. నారాయణరావు అన్నీ వింటూనే దానిగుంటలో పడుకొని అనుకునే శునకం మాదిరిగా లోలోన ఆలోచిస్తూ అనుకోసాగాడు. నిజంగా నారాయణరావు హృదయం ఎంత మూర్ఖంగా మారిపోయింది. వీరభద్రం ఎంతటి ఘటికుడు! వెన్నపూసలాంటి మనస్సుని విరిచేసాడు. పాషాణంకంటే కఠినంగా మార్చాడు. జగన్నాధం మాటల్ని వినగల్గాడేగాని నారాయణరావు మనస్సుని మార్చుకోగల్గేడా! లేదు ఎంతటి దురదృష్టవంతుడుగాకపోతే యిలా మారాడు! వినాశకాలం వచ్చే సూచనలుండబట్టేనేమో! విపరీత బుద్ధులు పుడుతున్నాయి. లేకపోతే నారాయణరావులాంటి వాడికి, దిక్కుమాలినవాడైన వీరభద్రం స్నేహితుడుకావాలా! కాదు కాదు బంధువేకావాలా! కర్మ ... నారాయణరావు శ్రద్ధగా వింటున్నాడని అపోహపడి, జగన్నాధం చెప్పినమాటల్నే మళ్లా చెప్పిచూశాడు. అతనేం మారుమాట్లాడలేదు. విన్నాడుగదా! బాగుపడతాడేమో! నని భావించి వృప్తిగా ఆ రాత్రికి యింటికి చక్కాతిరిగి వచ్చేశాడు. శారద ఆరాత్రి నిశ్చింతగా నిద్రపోదా

మసుకుంది. బావగారి వుద్బోధతో, భర్త నిజంగా మారిపోతాడని తియ్యని కలలుగంది. ఆరాత్రికి వంటకాలన్నీ కమ్మగా తయారుచేసి భర్తని తృప్తిపర్చగల్గింది. అతనికోసం ప్రత్యేకంగా క్రొత్త చీర, పెట్లోంచి తీసి కట్టుకొంది. వాలుజడ వేసుకొని చక్కగా ముస్తాబైంది. దొడ్లోని మల్లె పూవుల్ని మనసుదీరా పెట్టుకుంది. కాటుక కళ్లతో నారాయణరావుకోసం ఎదురు తెన్నులు చూస్తూ వాకిటివసారాలో మంచంవాల్చుకు కూర్చుంది. భోంచేసి వెళ్లినభర్త ఎంతకీరాకుండటం వల్ల నిరీక్షణ ఎక్కువైంది. వీరభద్రం ఆ పూట, నారాయణరావుతో భోజనానికిరాలేదు. ఎక్కడ తిన్నాడో ఎవ్వరికీ తెలియదు.

మామూలుగా జగన్నాథం వాటాలో పేకాట ఆడేవాళ్లు అలాంటివాళ్లు, ఆ మధ్యాహ్నం, నారాయణరావు పెట్టిన సమావేశంలో పీర్ల పంజాలోకి మారుద్దామని తీర్మానించారు.

పీర్లపంజా ఆ వూరికి పడమరగా, కాస్త దూరంగావుంది. వూరు మాటుమణిగినపిదప, ఆ ప్రాంతానికెవ్వరూ పోరు, నిశ్శబ్దంగా వుంటుంది. ప్రక్కనే పెద్ద చెరువు. దానిగట్టుమీద వేసవి కాలంలో అవూరి వాళ్లు చల్లగాలికి చతికిలపడి కూర్చుంటూ వుంటారు.

నారాయణరావు మాటమీద ఆ రోజునే పీర్ల పంజాలో చీట్లాటకు ప్రారంభోత్సవం చేసారు. ఎవరివల్లారద్దీలేకుండా నిర్భీతిగా ఆడుకోవచ్చునని వీరభద్రం నారాయణరావుతో అన్నాడు. అతను సంతోషించాడు.

ఒక వైపు శారద భర్తకోసం చీకట్లో ఎదురు చూస్తోంది. మరోవైపు నారాయణరావు, ప్రామిసరీ నోటువ్రాసితెచ్చిన అయిదువందలతో జూదం ఆడుతున్నాడు. వీరభద్రం నారాయణరావుకి సారధిగావుండి, సలహాలిస్తున్నాడు. ఆటగాళ్లు క్రొత్తరోజనేమో! వుషారుగా డబ్బును గుమ్మరిస్తూ క్రొత్తపేకని కత్తెరవేస్తూ ఆడుతున్నారు. వీరభద్రం సలహాలతో రెండుగంటలాడేసరికి నారాయణరావుకి వెయ్యిరూపాయలు వచ్చినయి.

వీరభద్రం కన్నుగుట్టింది. తానూ ఆడదామని, జల పుట్టింది. వెంటనే నారాయణరావుని లక్షుకోరు కబుర్లతో వుబ్బేసి అయిదువందల్నిరాబట్టాడు. తిరిగి ఆటమొదలైంది. అప్పటికి పన్నెండుగంటలు దాటినయి. చీకటి దట్టంగా అలముకొంది.

శారద నిరీక్షణతో విసిగి వేసారిపోతుంది. తను అలంకరించుకొన్న అలంకారమంతా వృధా అయిపోతోందని నిరాశచెందింది. ఒంటరిపాటుకి తాళలేక పోయింది. "పిల్లలుంటే వాళ్లని పక్కలో వేసుకొని యీపాటికి పడుకొని వుందునుగదా!" అని భావించింది. "తాను గొడ్రాలు కాదుగదా!" శారద లోకంచెప్పుకొనే మాటని పునశ్చరణచేసుకొంది. కాకపోతే సంతానం ఎందుకు కలగటంలేదు? పున్నామనరకం దాటేదెట్లా. గత్యంతరం ఏమిటి? తన యీడువాళ్లు ఎంచక్కగా సంతానవంతులయ్యారు. చూడముచ్చటగా వున్నారు. తనకేరీ? ఏంచేసానని అంతపాపం! భగవంతుడు నామీద యింతచిన్నచూపు చూశాడూ! ఏ కారగాని నోములు నోచుకొన్నానో! ఎవరికే అన్యాయం చేసానో! ఏపాపానికి ఒడిగట్టుకున్నానో! దిక్కుమాలినదానినైనాను. తనకింత యిల్లు వుండేం లాభం? పిల్లలుగల యిల్లు కాకపోయిన తరువాత, శారద కకాలికల పడుతూ, బాధాకులితస్వాంతురాలైంది. చెరిసగం రాత్రి దాటింది. నారాయణరావుకి, ఆడుతున్న కొద్దీ డబ్బు అంతకంతకు పెరుగుతోంది.

(సశేషము)

# 'పాపం బ్రద్దలైంది'

'రాఘవ'

(గతసంచిక తరువాయి)

అదృష్టంచేత తరుముబడిన వాడైనాడు. వీరభద్రం రెండాట లాడగానే వున్న అయిదు వందల్లో రెండొందలు పోయినయి. నిరాశచెందాడు. మిగతాదికూడా పోతుందేమోనని, భయపడి, నారాయణరావుకిచ్చేసి, "నాకు నిద్రొస్తోంది, కాస్త తలకాయనొప్పిగాకూడావుంది. యింటికెడుతాను" అని చెప్పాడు. నారాయణరావు ఆటరంధిలో సరిగా వినిపించుకోక, తలెత్తిచూశాడు. వీరభద్రం మళ్లీ చెప్పాడు. నారాయణరావు సరేనన్నాడు. అతను కదిలాడు ... వస్తుంటే – "యింటివద్ద శారద ఒంటరిగావుంది. త్వరగా వెళ్లి పడుకో! నేనూ రెండాటలాడి యిప్పుడేవస్తాను. శారదకికూడా చెప్పవస్తున్నానని" నారాయణరావు అలవాటుగా చెప్పే పద్ధతిలో చెప్పాడు. వీరభద్రంగుండెలో శారద తిళుక్కుమంది. తన ప్రయత్నం నిర్విఘ్నంగా కొంతసేపట్లో మనస్ఫూర్తిగా తీర్చుకోవచ్చునని. పెద్దపెద్ద అంగలతోయింటికి చేరాడు. శారద అప్పటికి వాకిట్లోంచి లేచివెళ్లి యింట్లోకలతగాపడుకొనివుంది. వీధివాకిలి తలుపులు తెరచుకొనేవున్నాయి. సన్నగా లాంతరు మసక వెల్తుర్ని చిమ్ముతోంది. సుడి సీ, సుడిసీ వీచేగాలికి, గోడకి తగిలించిన సెక్కుక్యాలండర్లు, వుద్రేకంతో టపాటపా మంటూ కొట్టుకొంటున్నాయి. శారద వాలు జడలోని మల్లెపూలు ఆ యింటంతటిని వాసనతో నింపివేస్తున్నయి. వెన్నెలరాత్రికాదు. వీరభద్రం ఎంతో మెచ్చుకొంటూ, తెరచిన తలుపులగుండా నిర్భయంగా లోనికి ప్రవేశించి, చప్పుడు కాకుండా గడియవేశాడు. అయినా రవ్వంత చప్పుడు కాక తప్పలేదు. శారద తలెత్తిచూసింది. ఒక నల్లని నీడ రెండు గుమ్మాలకవతల, మధ్యంగా, నిటారుగా నిలబడివుంది లాంతరు కాంతి, ఛరితీసిన శిరస్సును చెక్కే రహస్యంలాగ వుంది. భయంవేయలేదు. కాని అనుమానంవేసింది. నారాయణరావు అయితే అక్కడెందుకు ఆగిపోతాడు? సరాసరి తనని పిలుస్తూ, దగ్గరకే వచ్చేసేవాడుగ! కాదు తనభర్త కానే కాదు ... మరెవరు? పరాయివాడికి, తనింట్లోకొచ్చేంత ధైర్యముందా? బ్రతికటూసికేనా; వీరభద్రమా! కాదేమో."

"ఎవరామనిషి?" వీరభద్రం పల్కలేదు. కదిలాడు "ఎవరంటుంటే!" శారద ముందుకొచ్చింది. మల్లెపూలవాసనలు, వీరభద్రంని మత్తెక్కించినయి. రాను కొన్న సెంటు వాసనలు గుమ్మనిపించినయి. ముస్తాబు యావత్తూ మధురకోర్కెల్ని లేపినయి. వీరభద్రం దగ్గరగా వచ్చాడు. శారద కాస్త వెనక్కితగ్గింది. యిద్దరూ ఆయింటి మధ్యలోవున్నారు. కటిక చీకటి. శారద గుర్తుపట్టింది. తన వియుక్తాలోచనలు పటపటా తెగినయి బిత్తరపోయింది."

"నువ్వా!" – నాలిక పెగల్లేదు. వీరభద్రం యికిలిస్తూ "నన్ను వెళ్లి పడుకోమన్నాడు" – అన్నాడు. కళ్లుపొరలు గమ్మినయి నోరు సిగరెట్లతో కంపుకొడుతోంది.

"ఎవరు?"

"అన్నగారు"

"నోర్ముయ్!" శారదకంత ధైర్యం ఎలా వచ్చిందో!

వీరభద్రం కొంచెంజంకాడు. బలంపోయింది

"బుద్ధిలేదూ! ఒంటరిగా వున్నావని సాహసిద్దామనుకున్నావేం. పైగా ఆయన వెళ్లిపడుకోమన్నారని అసభ్యంగా ప్రవర్తిస్తున్నావా? పిచ్చి పిచ్చిగా మాట్లాడావంటే మర్యాదక్కదు. యిదివరకూడా యిలాగే చేయాలని చూశావు బంధువుడివిగదా! అని దయ తల్చాను. లేకపోతే నీగతి ఏమయ్యేదో తెలిసివుండేది. ఆయనగారితో గనుక నువ్విట్లా చేస్తున్నావని చెప్పానంటే, నున్నంలోకి ఎముక లేకుండా తంతారు... దిక్కులేనివాడివై వచ్చావని ఆశ్రయమిస్తే యిదా నువ్వుచేసేది. సిగ్గులేదూ!" చెడామడా తిట్టేసింది. వీరభద్రం ఓడిపోయాడు ... కొంచెం పంబాలించుకొని. "ఇక యిప్పుడూ గాదు సమయం... యీ సారి పట్టుపట్టి చూడాలి" - అని వెంటనే వెనుకతిరిగి పోబోయాడు ... ... శారద అతని ముందుగా వెళ్లి చిన్నగావున్నలాంతరు నెక్కించింది. వీరభద్రం తలవంచుకొని, తనగదిలోకి వెళ్లబోతుండగా

"భోంచేద్దువుగానీ రా ..." అని మునుపటిలాగే అంది. అతనికి క్రోధం నిలువెల్లా దహిస్తోంది. రానంటా మనుకున్నాడు. కాని కథ అడ్డం తిరుగుతుందేమోనని, సరేనంటూ బట్టలుమార్చుకొచ్చాడు. శారద వాకిలి తలుపులు తెరచి, వంటింట్లోకి వెళ్ళింది. వీరభద్రం ఆ రాత్రి ఎంతో సిగ్గుపడినవాడిలా ముఖం పెట్టుకొని, నంగనాచిలా, పెట్టిన కూటిని, నోట్లో కుక్కుకుంటూ తిన్నాడు. ఇంకా నారాయణరావు రాలేదు. జరిగిన యీ సారి తతంగం, శారద, నారాయణరావుతో ఎక్కడ చెబుతుందోనని భీతి చెంది, చేయి కడుక్కున్న వెంటనే, చెప్పులు తొడుక్కొని గుమ్మందాటాడు. "ఎక్కడికి?" శారద కంచం కడుగుతూ అనుకుంది.

పేర్లపంజాలోని ఆటగాళ్ళు, సురకొయ్యలు వాలగానే లేచారు. నారాయణరావు చేతులు దులుపుకొని జేబులు చూసుకొన్నాడు. పెట్టుబడి తాలూకు అయిదువందలూ పోయినయి. వచ్చిన లాభం వెయ్యీ దూసుకొనిపోయి, పైపెచ్చు (అప్పుగా) చే బదులు అడిగి పుచ్చుకొన్న డబ్బూ పోయింది. అంతకలిస్తే దాదాపు రెండువేలు ఆ రాత్రి జూదంలో హారతి కర్పూరంలాగా హరించుకొనిపోయింది. వీరభద్రం లేకపోబట్టే యింతపని జరిగిందని దృఢంగా నమ్మాడు. ముఖమంతా జిడ్డుగారుతోంది. తలచెరిగింది. కట్టుకున్న గుడ్డలు సిగరెట్లపొడితో మరకలైనయి. యింటి దారి పట్టాడు. అప్పిచ్చినవాడు కొంతదూరంవచ్చి, నారాయణరావుతో,

"నా బాకీ ఎప్పుడు సర్దుతారు?" - అని అడిగాడు.

"ఒక వారంలో సర్దుతాలే" అని అతణ్ణి పంపించి, సిగరెట్టు కాల్చుకొంటూ యింటికొస్తూండగా - ఆ చీకట్లో, వీరభద్రం ఎదురుగావచ్చి, మొసలి కన్నీరు కారుస్తూ-

"నువ్వులేకపోబట్టే, యివాళ నేనిన్నిమాటలు పడాల్సొచ్చింది." - నారాయణరావుకి అర్ధం కాకుండా అన్నాడు. డబ్బుపోయి అతను చిరాగ్గా వుంటే, యింకా విసిగిస్తూ అర్థంకానట్లు చెప్పచూస్తున్నాడు వీరభద్రం.

"ఎవరోయ్ నిన్నన్నది" అన్నాడు,

"వదినగారు."

"శారదా!"

"అవును."

"ఏమంది?"

"అనవలసినవన్నీ అంది. నువ్వెళ్లి పడుకోమన్నావా లేదా."

"ఒంటరిగా వుంటుందిగదా! భయంవేస్తుందేమో! కాస్త తోడుగా పడుకోమని చెప్పాను."

"పడుకుందామనే వెళ్ళాను, అసభ్యంగా మాట్లాడింది" వీరభద్రం, కాలుస్తున్న సిగరెట్ని విసిరి అవతల పారేశాడు. ఎంతో అవమానంపడిన వాడి

లాగా తర్వాత మాట్లాడాడు. నారాయణరావు కోపం తెప్పించాడు. లోగడవరకూ వీరభద్రం, నారాయణరావుని 'అండీ' అంటూవుండేవాడు. చనువు ఎక్కువైపోవటంతో, 'నువ్వు' అనే వరకూ వచ్చింది. కాలం గతి అలాంటిది!! వీరభద్రం మాటలతో నారాయణరావు వుగ్రుడయ్యాడు అతని మాటల్ని పూర్తిగా నమ్మాడు. పరాపరి యింటికొచ్చాడు. శారద, భర్తకోసం పక్కదులిపి కాస్తోంది.

ఏసమయానికి ఏమవుతుందో ఎవరికి తెలుసు! వచ్చిరావటంతోనే, శారదను పిల్చాడు. ఆ పిలుపులో ఎంతో కఠోరతవుంది. శారద గజగజలాడింది. ఇంతకాలం గడిచినా, తన కాపురంలో, నారాయణరావు అలా పిలవటం శారద వినలేదు. మెల్లిగా వచ్చి దగ్గరగా నుంచుంది. కళ్లెర్రజేసి చూశాడు. ఆమె తెల్లబోతోంది. క్షణంలో శారద చెంపచెళ్లుమంది, కళ్లు చెమ్మగిల్లినయి. మళ్ళా కొట్టాడు. అయిదువ్రేళ్లూ తేలినయి. కందిపోయింది. వీపు పగిలింది. బిగుతుగావున్న జాకెట్టు పిగిలింది. డొక్కలో తన్నాడు. పెట్టుకున్నచీర కుచ్చిళ్లు వదులై జారి, పాదాలపైపడ్డాయి. వాలుజడకొన వూడిపోయింది. రొప్పొచ్చేంతవరకూ కొట్టాడు. ఆమె స్పృహతప్పిపడిపోయింది. అన్నెం పుణ్యం తెలుసుకోకుండా చావబాదాడు. న్యాయమెవరిదో విచారించలేకపోయాడు. ఎవరిది తప్పో అడక్కుండానే చేయిచేసుకొన్నాడు. అంతటికోపం నారాయణరావులో దాగివుందని, శారదకు స్పృహతప్పిపడిపోయేంతవరకూ తెలియనే తెలియదు. మెల్లిగా వెనకవతలేవున్న వీరభద్రం కదిలి ముందుకొచ్చి –

“ఏదో మందలిస్తాననుకున్నానుగానీ, యిట్లా చావబాదుతావనుకోలేదు. నిలువునా ప్రాణాలు తీసేటట్లు వున్నావు... యిక చాల్లేపద. ఎవరైనా నిద్రలేచినట్లయితే, నగుపాటుపాలవుతాం..” అంటూ అప్పుడు నోరు మెదిపాడు. అంతవరకూ వూరుకునే వున్నాడు. నారాయణరావు తరువాత, శారదవంకైనా చూడకుండా దొడ్డివాకిట్లోకి వెళ్లాడు. వీరభద్రం, పడిపోయిన శారద ముఖంమీద యిన్ని నీళ్లుచల్లి, గొంతుకలో కాసిని మంచినీళ్లు పోసాడు. కాస్తాగిన పిదప శారద కదిలింది. కానీ లేవలేకపోయింది. ఆమెలో శక్తి నశించింది. అతికష్టంమీద లేచిందిగానీ, మళ్ళా అంతలోనే దబాల్న పడింది. వెంటనే వీరభద్రం, ఆమెను ఎత్తుకొని, తీసికెళ్లి, పక్కదులిపివేసిన మంచంమీద పడుకోబెట్టాడు. ఆమెకేమీ తెలియని స్థితిగావుంది. ఒళ్లంతా నొప్పిగావుంది. మూల్గుతోంది. వీరభద్రం, ఎంత కిరాతుడు కాకపోతే, నారాయణరావుకి అలా పుల్లింగాలు ఎక్కించి యింతపని చేస్తాడూ! శారదని, భర్తకి తెలియకుండా తాకి, పడుకోబెట్టినందుకు, గర్వంగా వుపకారిలాగా ప్రవర్తిస్తాడూ! కొరివితో తల గోక్కున్నట్లవుతోంది నారాయణరావుకి. యీ విషయం అతనికేమీ తెలియటంలేదు. నారాయణరావు పూర్తిగా చెడటమేగాకుండా, శారదనికూడా నానా హింసలూ పెడుతున్నాడని అటూ జగన్నాధానికీ తెలిసింది, యిటు శారద తల్లిదండ్రులిక్కీ అన్నదమ్ములికీ తెలిసింది. వూరినిండా అప్పులు పెరిగిపోయినయ్యని. వున్న నిల్వధనం చేతులారా ధ్వంసమైందని, నారాయణరావు తలెత్తుకోకుండా, ఎవ్వరికీ కనబడకుండా తిరుగాడుతూ వున్నాడు. ఇంతలో దస్తువసూలు తరుణం వచ్చింది. వీరభద్రం, స్కూలు పిల్లల్ని సరిగా చూడటంలేదని పుకార్లు లేచినయి. హైస్కూలులో చేరవలసిన పిల్లకాయలు సరిగా చదవక, వీధుల వెంట గోడుం బిళ్లలాడుకొంటూ చరిస్తున్నారు. దమ్మిడీ అప్పు, నారాయణరావు ఎంత బ్రతిమలాడుకొన్నా పుట్టడంలేదు. లోగడ యిచ్చిన అప్పుల వాళ్ళు నారాయణరావుని, కనబడితే పీక్కు తింటున్నారు. వీళ్ళని తప్పుకోవటంకోసం, వీరభద్రం దయవల్ల అబద్ధాలాడటం బాగా నేర్చుకొన్నాడు. అదిగో. యిదిగో అని రోజులు దాటవేయటం అలవర్చుకొన్నాడు. ఏంచేయటమో! తోచలేదు.. వీరభద్రంచేత మునసబుగిరి అడపా. తడపా చేయి

స్తూనే, కేవలం సంతకాలు మాత్రం పెడుతూ వున్నాడు దస్తువసూళ్ళ డబ్బు, వసూలు చేసినట్లే చేసి, తాలుకాఫీసులో కడదామనుకొంటూనే, పీర్ల పంజాలోకి కాలుపెట్టాడు ఒకనాడు. ఆ రోజున, చుట్టుప్రక్కల వూళ్ళ ఆటగాళ్ళుకూడా వచ్చారు. వీరభద్రం రెచ్చగొట్టాడు. నారాయణరావు రెచ్చిపోయాడు. వసూలైన పైకాన్ని ఇనప్పెట్టలోంచి రెండు చేతుల్తో తీశాడు. శారద చూసింది. గుండెలు బాదుకుంటూవచ్చి, గోడు గోడున ఏడుస్తూ, "తీసుకొని వెళ్ళవద్దని" కాళ్ళుపట్టుకొని అడ్డుతగిలింది. నారాయణరావు లెఖచెయ్యలేదు. ఆమె బ్రతిమిలాడుతోంది. అతను కాళ్ళని లాక్కోడానికి పెనగులాడుతున్నాడు. అవతల పీర్లపంజా పిలుస్తోంది. యివతల శారద అడ్డగిస్తోంది. వీరభద్రం మాటలు చెవుల్లో గింగురుమంటున్నయి. నారాయణరావు త్వరపడుతున్నాడు. శారద, అతని పాదల్ని వాడేసుకొని,

"యింతకాలమూ, మన డబ్బు పోయినా నేనేమీ అనుకోలేదు. అప్పులు పెరిగి, మనమర్యాదనీ, కుటుంబగౌరవాన్నీ, వంశక్షేమాన్నీ నాశనం చేస్తున్నా నేనేమీ మిమ్మల్ని కాదనలేదు. యీ డబ్బు మనది కాదు. ప్రజలది. రైతులిది. ఎన్నోకష్టాలుపడి, వాళ్లు సర్కారు వారికి యిచ్చుకొన్నారు. దీన్ని మీరు స్వార్థంకోసం, స్వలాభంకోసం, విలాసాలకో తగలేస్తే, జైలుకు వెళ్లాల్సొస్తుంది. యీ పనితగదు. వూరుకోండి. మానుకోండి" గగ్గోలుగా అంటోంది.

అతను వినిపించుకోలేదు ... విసుక్కున్నాడు. తిట్టాడు. కొట్టాడు. ఆమె పట్టువిడువలేదు. మళ్ళీ డొక్కలో తన్నాడు. అవ్రళించింది. ఆమె చేతులు అతని పాదాన్ని వదిలేసినయి. వడివడిగా, నారాయణరావు పీర్ల పంజావేపుకి నడిచాడు. అప్పటికే ఆటమొదలైంది. 'మునసబుగదా అని ఆలస్యమైనా కూర్చోమన్నారు. నారాయణరావు వీరభద్రం ప్రోత్సాహంతో కూర్చున్నాడు.

హేమాహేమీలంతా ఆడుతున్నారు. సిగరెట్లు, నాలికలు మంటలెక్కేంతవరకూ కాల్చారు. ప్రొద్దుపోతున్నకొద్దీ డబ్బు తరిగిపోతోంది. ముఖాలుపీక్కుపోతున్నాయి. అసలు వోపికనసించి పోతోంది. డబ్బుమీదవుండే దాహంకొద్దీ, అలాగే ఆడుతున్నారు. తెల్లారేసరికి, నారాయణరావు, వీరభద్రం చలవవల్ల దివాలాతీసాడు. వూరిముఖం చూడటానికి, సిగ్గు - లజ్జాభిమానాలవల్ల చెల్లలేదు. యింటికి రావటం యిష్టంలేక, సరాసరి అటుంచి అటే, బయలుదేరి. అన్నగారి వద్దకు వెళ్ళాడు. జగన్నాథం వచ్చిన తమ్ముణ్ణిచూసి నిర్ఘాంతపోయాడు, అవుసరమేమిటని ప్రశ్నించాడు. దుర్గమ్మ పల్కరించలేదు. ధర్మారావు హీనంగా చూశాడు జయలక్ష్మి మంచినీళ్ళిచ్చింది. కుశల ప్రశ్నలడిగింది. ఏమిటోగా చెప్పాడు.

(సశేషము)

కడుపునొప్పి, నోట నీరూరుట, త్రేపులు, వాంతులు, మలబద్ధకము లాంటి అజీర్ణ లక్షణములకు
కేసరిగారి
**ఆదిత్య లవణము**
దివ్య ఔషధము
వెల రు. 1 - 75 న.పై.
కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు 14.

# 'పాపం బ్రద్దలైంది'

'రాఘవ'

(గతసంచిక తరువాయి)

"పిల్లలు గల్గలేదని దేవాలయం కట్టిద్దామనుకొంటున్నాను. వూళ్లన్నీ తిరుగుతూ చందాలు పోగుచేస్తున్నాను. అందువల్ల మనిషిని యిలా చిక్కిపోయాను. నువ్వుకూడా ఎంతో అంతయిస్తే బాగుంటుందని వచ్చాను." - అని నిర్భయంగా అబద్ధమాడేశాడు. తనవద్ద యిలా అబద్ధమాడతాడని జగన్నాధం యెట్లా తెలుస్తాడూ! వెంటనే ఒక వెయ్యిరూపాయలు, తెచ్చి యిచ్చాడు. అందుకొని నారాయణరావు ఆ సాయంత్రానికే యింటికొచ్చాడు.

ఆ నాడు దుర్గమ్మ - ధర్మారావూ జగన్నాధంను అనేకవిధాలుగా దూసిపోశారు. ఉన్న వేయి రూపాయలను ఆ రాత్రి భద్రంచేసి, తెల్లారటంతోనే, కొన్ని బాకీలు తీర్చేశాడు. ఉన్న అయిదెకరాల్లో మూడు ఎకరాలకు బేరం పెట్టాడు. తూర్పువేపు గడ్డివాముల దొడ్డిని అమ్మేశాడు. వూరిమధ్య పెద్ద దేవాలయాన్ని కట్టేందుకు, వూరివార్ని సంప్రదించాడు. నిజంగా కడతాడో, లేదోనని కొందరు పెదవులు విరిచారు. నమ్మకంవున్నవాళ్లు ఓపాన శక్తిగా ధన సహాయం చేసారు. నారాయణరావు ఒక్కవారం రోజుల్లో పనివాళ్లని పిల్చుకొచ్చి, దేవాలయానికి కావలసిన ఏర్పాట్లను చేయించసాగాడు. కూలీలు పునాదులు తీయ నారంభించారు. కొందరు రైతులు బళ్లని సాయంచేసి, రాయి తోలిస్తున్నారు. బేరం పెట్టిన మూడెకరాల్ని ఆరువేల కమ్మేశాడు. తాలూకాఫీసులో కట్టవలసిన పైకం కట్టేసాడు. యింత మార్పు నారాయణరావులో తనకు తెలియకుండా ఎలా వచ్చిందోనని వీరభద్రం సెలకోజాలపాటు దిక్కుతోచకుండా ఆలోచించాడు. శారద తిన్న దెబ్బలు మర్చిపోయింది. తన కడుపు పండటంకోసమే, భర్త దేవాలయం కట్టిస్తున్నాడని వుత్సాహపడింది. చేతులో చాలీ చాలకుండా డబ్బువున్నా, నారాయణరావు, అన్నగారికి చెప్పిన అసత్య ప్రకారం దేవాలయం కట్టించడానికి ధైర్యంతో పూనుకొన్నాడు. ఆ పనిమీదే అతనెక్కువగా తిరుగుతున్నాడు. యింటిపట్టున క్షణంకూడా వుండటం లేదు. పేర్ల పంజాయాన తగ్గలేదు. జూదం అడపా. తడపా ఆడుతూనే వున్నాడు.

ఇలా వుంటూండగా, ఒకసారి, నారాయణరావు గ్రామాంతరం వెళ్ళాడు. ఆ సంగతి శారదకు తెలియక, మునుపటికన్నా ఎక్కువ వుత్సాహంతో వుండటంతో, అతనికోసం, మామూలుగా ముస్తాబైంది. నారాయణరావు దేవాలయం విషయంలో, తీరికలేకుండా తిరగటంతో, వీరభద్రం, శారదను వెంటాడటం మొదలెట్టాడు. ఆమె ఎక్కడుంటే, అతనక్కడ వుంటూ వుండేవాడు. అన్నం వండుతూంటే, ఆ మాటా - యీ మాటా చెబుతూ, వంటింట్లోనే వుండేవాడు. దొడ్లో పనిపాటలు చేసుకొంటుంటే, తానూ సాయపడేలాగా, కల్పించుకొని చేయబోయేవాడు. పనివున్నా, లేకపోయినా, శారదను పల్కరిస్తూండేవాడు. ఆ పుస్తకం చదివావా? ఆ కథ ఎట్లావుంది? రావూరి కథ ఎట్లావుందో చెప్పు? చాడీశ్వరీదేవి, అదదైనా భలేగా వ్రాస్తుంది! 'చలం' మైదానం నీకు నచ్చిందా? యిలాంటి వెధవ ప్రశ్నలు అడుగుతూ, ఆమెను విసిగిస్తూ వెంటాడేవాడు. ఆమె లోగడ తిన్న దెబ్బల్ని గుర్తుచేసుకొంటూ, అతన్నేమీ అనేదికాదు. అందువల్ల వీరభద్రం ఆమెను మరింత విసిగించేవాడు.

ఆ నాడు, నారాయణరావులేదని తెలియటంతో

వీరభద్రం శారదను ఎలాగైనా పొందాలనుకున్నాడు, బడిపిల్లలుంటే, తన ప్రయత్నం కుంటుపడుతుందేమోనని, ఎంచి, గబగబ పాఠాలు చెప్పేసి, మధ్యాహ్నం బడిలేదని చెప్పి పంపివేశాడు. వాళ్లు చంకలు కొట్టుకొంటూ వెళ్ళిపోయారు.

అవి చీకటి రోజులు. పాపానికి అనువైన సమయాలు. రాత్రికి భర్త వస్తాడేమోనని, మరింతగా ముస్తాబైంది. ఎదురు తెన్నులు చూసింది. నారాయణరావు రాలేదు. వీరభద్రం భోంచేసాడు. శారదకూడా తిన్నది. వెంటనే వంటిల్లు సర్ది వేసింది. వీరభద్రం మామూలుగా తన వాటాలోకి వెళ్ళి పడుకున్నట్లే పడుకున్నాడు. అలవాటు ప్రకారం యిల్లంతా సర్దుకొని, మధ్య వసారాలో పరుపు వేసుకొని పడుకొంది. నిద్రపట్టింది. వూరు వూరుకునే వుంది. చెరిసగం రాత్రి గడిచింది.

ఎవరో తన మంచంచుట్టూ తిరుగుతున్నట్లు లీలగా తోచింది. కళ్ళు మగతనిద్రవల్ల తెరపిన బడటంలేదు. అయినా, కళ్ళు తెరచి చూసింది. వెలిగించి, గోడకి తగిలించిన చిమ్నీ ఆరిపోయింది. చిమ్మచీకటి. సుడిసీ, సుడిసి గాలి వీస్తోంది. ఎవ్వరూ ఆ చీకట్లో వున్నట్టుగా కనిపించటంలేదు. భ్రమపడుతున్నానేమోనని, శారద మళ్ళా కళ్ళు మూసుకొని, పక్కకి తిరిగిపడుకొంది. - కాస్సేపు నిశ్శబ్దం . . వీరభద్రం నిలబడేవున్నాడు . . అతని శరీరం వేడెక్కుతోంది. తాళుకోలేకపోయాడు ... కదిలి, మంచంవద్దచేరి, కిర్రుమనిపించాడు ... గాజులు పగిలినయి... మంచం క్రూరంగా చప్పుడు అవుతోంది ... ఆమె బాధగా మూల్గుతోంది. మంచంక్రింద మంచి నీళ్ళ గ్లాసు కర్కశంగా మోగింది ... తల్లోని సన్నజాజిపూలు నలిగి నలిగి, వాడిపోయినయి. రేకులు రాలినయి. పక్క దుప్పటి ఉంగచుట్టుకొనిపోయింది. చీకట్లో, వాళ్ళిద్దరి పాపం బ్రద్దలైంది. - ఆమె వగర్చింది. అతను తూలుతూ వెళ్ళి, తన మంచంమీద కూలిపోయాడు. ఎవరికీ, యీ ప్రపంచం దృష్టి అప్పట్లో పట్టినట్టులేదు. తను, పాపంచేసానని, ఎప్పరూ ఆ సమయంలో తల్చుకోలేదు. శారదకు అతణ్ణి తిట్టడానికి మాటలురాలేదు. కొట్టడానికి, గిచ్చటానికి, చేతులు లేవలేదు. అతను తన వేడిరక్తాన్ని - కోరికనీ, ఆమె చలవవల్ల తీర్చుకొన్నాడు. శారద వివశురాలై బలహీనంగావుంది . . తెల్లారేవరకూ, వాళ్ళిద్దరి పాపం ఆ యింట్లో తిరుగాడుతూనేవుంది . . యిరువురూ నారాయణరావుని మోసంచేసారు.

రోజులు గడుస్తున్నకొద్దీ శారద చిక్కిపోవటం మొదలెట్టింది. మనిషి నలిగిపోతూవుంది. తలకట్టు రాలిపోతోంది. క్రొత్తరూపమేదో నారాయణరావుకి శారదలో కనిపిస్తోంది. తీరిపోని వాంఛలు ఆమెలో కల్గుతున్నయి. దేవాలయం గోడలు నానాటికీ లేస్తున్నయి. శారద హృదయంలో తీయని కోరికలు వూరుతున్నయి. వీరభద్రం, నారాయణరావుతో అవుసరముంటేనే మాట్లాడుతున్నాడు. సొంతవంట చేసుకోవటం ప్రారంభించాడు. ఎందుకైనా మంచిదని ఎడఎడంగానే వుంటూ వస్తున్నాడు. భగవంతుని దయవల్ల, పాపమో, పుణ్యమో, శారద మడిగట్టుకొంది. యీ విషయం నారాయణరావుకేం తెలుసు? ఒకసారి డాక్టరుకి చూపించి, శారద పరిస్థితిని తెలియజేసాడు. అతను, ఆమెను పరీక్షించి, చిరునవ్వుతో, దగ్గరకొచ్చి—

"దేవాలయం కట్టిస్తున్నందుకు, దేవుడు దయదల్చాడు . . మీ పుణ్యం పండింది. మీ యావిడ గర్భిణీ స్త్రీ." యింకా ఏమిటో చెప్పాడు. యిక నారాయణరావు, వినలేకపోయాడు. పుట్టిన సంతోషంలో, గబగబ, భార్యతో సహా యింటికొచ్చేశాడు. కొన్నాళ్లకి సీమంతం చేసుకొంది శారద. అప్పణ్ణుంచి ఆ నోటానోట, శారద కడుపుతో వుందన్నవార్త, బంధువులందరికీ తెలిసింది. జగన్నాథం నమ్మలేక నీమ్మాడు. దుర్గమ్మ - ధర్మారావులు నమ్మకపోగా, చెవులు కొరుక్కున్నారు. జయలక్ష్మి ముచ్చటపడింది. యిక ఆ నాటినుండి, నారాయణరావు, చేసిన అప్పుల్ని తీర్చటంకోసం అన్నగారివద్దకు అడపా - దడపాపోయి, డబ్బు తెస్తూండేవాడు. అతను ఏ అభ్యంతరమూ పెట్ట

ఉండాలనే, తన స్వార్జితాస్తి తాలూకు డబ్బుని, తమ్ముడి కిస్తూండేవాడు, నారాయణరావు తెస్తూండేవాడు. యీ రకమైన చర్యలు - సహాయాలూ - దుర్గమ్మకు నచ్చలేదు. భర్తనీ, మరిదినీ తెగతిట్టి పోస్తూండేది. తనవల్ల అన్నగారికి, యింట్లో మాటలు పడాల్సొస్తోందే అని భావించినా, అడక్క తప్పటం లేదు.. క్రమేపీ, నారాయణరావు స్వయంగా వెళ్ళటం మానుకొని, వూరుకొన్నాడు. కొన్ని అప్పులు తీరినై. చివరకు, దేవాలయానికి డబ్బు చాలలేదు. వున్న యిల్లమ్మివేశాడు. వీరభద్రం బడి, మరో యింట్లోకి మారిపోయింది. నారాయణరావు దంపతులు వేరే యిల్లు అద్దెకు తీసుకొన్నారు. దేవాలయంకోసం, ఎంతో కష్టపడుతున్నాడు. యింతలో ఒకనాడు శారద ప్రసవించింది. మొగపిల్లవాడు. జగన్నాథం మురిసిపోతూ బారసాలకొచ్చాడు. యిక ఎవ్వరూ రాలేదు. దేవాలయం పూర్తికాలేదు. వూళ్ళో ఎవ్వరూ ధనసహాయం చేయటంలేదు. రోజులు గడ్డుగా గడుస్తున్నయి. అన్నగార్ని యిక సహాయంకోరటం భావ్యంకాదనుకున్నాడు. అప్పటికీ దుర్గమ్మవల్ల, నారాయణరావు, బంధుకోటిలో తేలికపడ్డాడు. క్రమక్రమంగా మాట పట్టింపు లొచ్చాయి. శుభాశుభాలకు యిరుకుటుంబాలవాళ్ళూ కలుసుకోవటం మానుకున్నారు. నారాయణరావు మూలంగానే, తన సంసారం గుల్లయిపోతోందని దుర్గమ్మ, ప్రచారం సాగించింది. ధర్మారావు, నారాయణరావుని మోసగాడిక్రిందనూ, పాపాత్ముడిక్రిందనూ జమకట్టేసాడు. యికటువంటప్పుడు నారాయణ సంసారానికీ, జగన్నాథం సంసారానికీ, రాకపోకలెట్లా వుంటయి? మంచీ - మర్యాదలావుంటయి? చేతిలో డబ్బు ఖర్చయిపోవటంతో, నారాయణరావు, దేవాలయం నిర్మాణాన్ని కొంతకాలంవరకూ ఆపు చేయించాడు. వీరభద్రం వీలుంటే నారాయణరావునీ శారదనీ, ఆపసిగందునీ చూడటానికి వస్తున్నాడు. లేనప్పుడు లేదు. వచ్చినప్పుడు మాత్రం ఆ పసిగందునిచూసి, వీరభద్రం ఎంతో సిగ్గుపడినట్లుగా నటించేవాడు, శారద ముఖంచూసేదిగాదు. చేసింది ఘోరపాపమని తెలుసు. కాని, కడుపుపండటంతో, ఆపాపాన్నేదో, మమకారం కప్పివేస్తూండేది. చీకటి పాపం మనస్సులో తల్చుకున్నప్పుడల్లా, నారాయణరావుని, నిజంగా మోసంచేసాననే ఏడ్చేది. కాని, పసివాడు అమాయకంగా నవ్వుతుంటే, ఆ పాపం హృదయంలో విడిలిపోతూండేది. ఒక ప్రక్క బాధ. మరో ప్రక్క ఆనందం. అనుభవించింది చీకటి పాపం. కళ్ళెదుట అనుభవిస్తున్నది, తరతరాలవరకూ చెరిగిపోని సంతోషం... శారద అంతగా బాధపడేది గాదు. "తనూ ఒక సంతానవంతురాలైంది" అదే ఆమె తృప్తి. దానివెనుక వున్న క్రీనీడలు_చీకటి- పాపం - నరకం - బాధ - యిలాంటి వేవీ వున్నట్లు భావించేదిగాదు.

మూడుసంవత్సరాలు, ఒడుదుడుకులతో నారాయణరావు తన సంసారాన్ని, అతికష్టంతో నెట్టుకొచ్చాడు. పసికొడుకు మాటలు చెప్పటం నేర్చుకున్నాడు. 'అమ్మ - నాన్న' అనటంవచ్చినయి. అన్నప్రాశన చేశారా దంపతులు. నారాయణరావు, తన తండ్రి పేరుని, కుమారుడికి పెట్టాడు. జగన్నాథం సంతోషిస్తూ, రహస్యంగా ఒకవందరూపాయలు పంపుతూ - "రామకృష్ణుడికి నా ఆశీస్సులు. వాడికి నా ముద్దులు" అంటూ వుత్తరంవ్రాసాడు. ఆ డబ్బుతో కుర్రవాడికి, రెండు చేతులికీ మురుగులు చేయించాడు. మెళ్ళోసన్నని గొలుసువేసాడు. ఆ కుటుంబానికీ - తనకీ ఎంత విరోధంవున్నప్పటికీ, ఎన్నికక్షలు రేగినప్పటికీ ఎంత పగరగిలివున్నప్పటికీ, అన్నగార్ని పూజిస్తూనేవున్నాడు. జగన్నాథం యింకా, నారాయణరావుకి సాయపడటం, దుర్గమ్మ తరపువారు ఓర్చలేకపోయారు. ఏలాగైనా సరే, నారాయణరావుని హింసపెట్టాలని ఎత్తుగడలు వేసి, ఓడిపోయారు. జగన్నాథం అండ వున్నంతకాలం, నారాయణరావుకేమీ ఫరవాలేదని వాళ్ళు చివరకు తేల్చుకొన్నారు.

ఆ సంవత్సరం పంటలు సరిగా పండలేదు. వున్న రెండెకరాలు కలిపితే, ఏటా పండేకన్నా తరుగే

పంట పండింది. దేవాలయం పనులన్నీ మూలపడి పోయినయి. అది ఎలా పుద్ధరించటమో నారాయణ రావుకి పాలుపోలేదు. అప్పుచేద్దామా! చచ్చే లోపుగా తీర్చలేమేమో! చేయకపోతామా తల పెట్టిన కార్యం సగంలోనే ఆగిపోయేటట్లుగావుంది. ఏంచేయటం! నారాయణరావు పరిపరి విధాలుగా ఆలోచించాడు. వీర్ల పంచాయాత, కొడుకు పుట్టంగానే తగ్గిపోయింది. ఆస్తిపోయింది. వున్న యిల్లు అమ్ముడుపోయింది. ఇంకా అప్పులు తీరలేదు. అడిగేవాళ్ళు అడుగుతూనే వున్నారు. వీధిలోకి వెడితే, తలెత్తుకునే ఆస్కారం లేకుండావుంది. ఎంత కాలమని, అన్నగార్ని అడిగి తీసుకోనూ! నారా యణరావుకి మనస్సు వేదనగావుంది. జీవితం అంటే భయంవేసింది. పోయిన మర్యాద, గౌరవం, సభ్యత, ఆస్తీ, యిల్లూ మళ్ళీ వస్తయ్యా! రావని తెలిసివున్నప్పటికీ, మనో వ్యాకులత ఎక్కువైంది. యిదివరకటి మాదిరిగా తిరగటానికి, ధైర్యం చాలటం లేదు. ఎవరితోనైనా మాట్లాడ్డానికి నోరు రావటం లేదు. కన్నతియ్యానే, కాండ్రించి ముఖాన వుమ్మేస్తారేమోనని, భీతిచెందేవాడు. అప్పటికీ, యింత అనుకొంటున్నా, "వీరభద్రంవల్లనే నేనీగతి కొచ్చానని". మాటవరుసకన్నా లోలోన అను కోవటంలేదు. చేసిన పాపం శారదకి చెప్పటానికి, నారాయణరావెంత భయపడుతున్నాడో, శారద కూడా అంతే భయపడుతోంది. రోజులు గడుస్తు న్నయి. ఉన్నట్టుండి ఒకనాటి సాయంకాలం నారాయణరావుకి ఒళ్ళు వెచ్చబడింది. ఆ రాత్రి అతను లంఖణం చేశాడు. కాసిని కాఫీ నీళ్ళు త్రాగి, చంటివాణ్ణి ముద్దెట్టుకొని, పడుకున్నాడు .. తెల్లవారింది.

నారాయణరావుకి జ్వరం బాగా వచ్చింది. చలి. వున్న దుప్పట్లన్నీ కప్పినా వెచ్చదనం పుట్టడంలేదు. అతని కాళ్ళూ చేతులూ . వదులూ గుంజుకుపోతు న్నయి. శారద నానా అవస్థలుపడుతూ సేవచేయటం మొదలెట్టింది. తన మట్టుకు వండుకున్న అన్నం తిన బుద్ధికాక, ఆ చంటివాణ్ణి ఎత్తుకొని, భర్త మంచం వద్ద, దిగాలుపడి కూర్చుంది. డాక్టరొచ్చి . తర చుగా వచ్చే అతను . జ్వరమెంతవుందో చూసి మందిచ్చి వెళ్ళిపోయాడు. కాఫీ మాత్రం త్రాగా లనుకున్నప్పుడల్లా శారద యిస్తోంది.

ఒక వారం గడిచింది. నారాయణరావుకి జ్వరం తగ్గటంలేదు. ఆనాటికానాడు ఎక్కువవుతోంది. డాక్టరు మందు యిచ్చి వెడుతూనే వున్నాడు. యీ వారం రోజుల్లో వీరభద్రం రెండుమూడుసార్లు వచ్చి చూసివెళ్ళాడు. . జగన్నాధానికి కబురు పంపారు.. అతనువచ్చి, ధైర్యంచెప్పి వెళ్ళాడు . .

ఇలా .. వారాలు గడిచినయి. పక్షాలు గడిచి నయి, నెల దాటింది. నారాయణరావుకి ఏం జ్వరమో తేలలేదు. వస్తే నూటరెండో, నూటమూడో వచ్చేది. విపరీతంగా చలివేసేది. వణుకు పుట్టేది. శరీరమంతా భరించలేనంతగా నొప్పులు వుండేవి .. చివరకు ఒకనాడు డాక్టరు, నారాయణరావుకి "అది జ్వరం కాదూ! మనోవ్యాధి" అని తేల్చి చెప్పాడు.. శారదకు అప్పులవాళ్ళు గుర్తొచ్చారు. భయంవేసింది. సరిగ్గా ఆ సమయంలో వీరభద్రం వచ్చాడు. శారద, మాట్లాడక తప్పలేదు. డాక్టరన్న మాటలు చెప్పింది. వినయంగా విన్నాడు. తరువాత, మెల్లిగా, నారా యణరావు దగ్గరగా కూర్చొని, ఓదారుస్తూ-

"నువ్వేటూ బాధపడకు .. జరిగిందేదో జరిగింది. వూరుకో! శారద కంగారుపడుతుంది." ఏమిటో చెబుతున్నాడు నారాయణరావు జ్ఞానహీనుడిలా వింటున్నాడు. శూన్య దృష్టితో భార్యనీ, కుమా రుణ్ణీ చూశాడు .. మెల్లిగా చేయివూపుతూ, కొడు కుని దగ్గరకు తీసుకొన్నాడు. శారదకూడా ఎదు రుగావచ్చి నిలబడింది. నారాయణరావు బాధగా, చూస్తూ.

(సశేషము)

# 'పాపం బ్రద్దలైంది'

'రాఘవ'

(గతసంచిక తరువాయి)

"నేను చాలా పాపాత్ముణ్ణి శారదా! నిన్ను చాలా హింసపెట్టాను. అందుకే నేనిప్పుడు యమయాతనలనుభవిస్తున్నాను. నిన్ను సంతోషపెట్టలేకపోయాను. నిర్దాక్షిణ్యంగా ఏడిపించాను. యిక నేను జీవించను -" అంతకన్నా, ఆయాసం వల్లనూ - బలహీనంవల్లనూ - ఎక్కువచెప్పలేకపోయాడు.. వీరభద్రం, ధైర్యం చెపుతూ_

"నువ్వేమీ బెంబేలుపడకు. నీ కోసం నేనేం చెయ్యమన్నా చేస్తాను. నీ దయవల్ల, యింతవరకూ జీవనోపాధికల్గి బ్రతుకుతూ వచ్చాను. నీ పట్ల నాకున్న విశ్వాసాన్ని, ఎలా తీర్చమంటే, అలా చేస్తాను.. చెప్పు.."

నారాయణరావు.. తనకున్న శక్తితో నే_

"నా దారిన నేనుపోతే, శారదగతి ఏంగాను? పిల్లవాడి శ్రేయస్సు ఎట్లా? దిక్కుతోచకుండా వుంది" - కంట నీరు పెట్టుకున్నాడు.

"నేనూ అదే ఆలోచిస్తున్నా" - దొంగాలోచనలో అన్నాడు వీరభద్రం.. శారదకి ఏమీతోచకుండావుంది.. ఏడుపుతప్ప.

"నువ్వు కాస్త కనిపెట్టుకొనివుండరాదూ!" - నారాయణరావు జేలగా అన్నాడు. వీరభద్రం, శారదవంక చూసాడు. శారద, తన ముఖాన్ని చేతుల్లో దాచుకొని గోడుగోడున ఏడుస్తోంది. పిల్లవాడు, బొమ్మలతో ఆడుకొంటున్నాడు వసారాలో. నారాయణరావు, అంత మనోవ్యాధిలో వుండికూడా అలా అనేసరికి, శారద హృదయం ఒక్కసారిగా క్షోభించింది. వీరభద్రం, నారాయణరావువంక చూస్తూ_

"నీ ఋణం, పోనీ అలాగైనా తీర్చుకుంటాను. విచారపడకు. నా శక్తికొద్దీ కష్టపడి, నీ శారదనీ, పసివాణ్ణీ కనిపెట్టుకొనే వుంటాను. యింతకాలం నీ ఆశ్రయంలో బ్రతికినవాణ్ణి. కాదనలేను. మాటిస్తున్నాను.. అలాగే వుంటాను" అన్నాడు.

నారాయణరావు మనస్సు కుపితమైందనే శారద భావించింది. భర్తకు, నయమవుతుందని ఆశించినందుకు, తనగతే విషమస్థితి కొచ్చిందని కుమిలి, కుమిలి ఏడ్చింది. తరువాత వీరభద్రం చక్కాపోయాడు. 'నారాయణరావు మరణం ఎంత త్వరగా జరిగితే, అంత మంచిదని' వూహించాడు. వీరభద్రం ఎలాంటి ఆలోచన చేసాడు! యిలాంటివాళ్లని భగవంతు డెందుకు సృష్టించుతాడో! బహుశా శారదవంటి స్త్రీలకు బాధల్ని కల్గించి, పరీక్షించడానికేనేమో! నారాయణరావులాంటి వాళ్లని చెడగొట్టి, స్వార్థపూరితంగా బ్రతకడానికేనేమో!

రెండు రాత్రులు గడిచినయి. అమావాశ్య ఆ నాడు. వీరభద్రం ఆ సమయంలో లేడు. శారద తిండిలేక, నిద్రలేక, కృశాంగి అయింది. పసిపిల్లవాడు నిద్రపోతున్నాడు. నారాయణరావు వుండీవుడిగి మూల్గుతున్నాడు. మధ్య మధ్యా కాఫీత్రాగి, దడని తగ్గించుకొంటున్నాడు. కళ్ళు లోతుకుపోయినయి. శరీరం శల్యావశిష్టమైంది. రొప్పు_ఆయాసం ఎక్కువైంది. గాలివల్ల, వూపిరితిత్తులు ఎగిరెగిరిపడుతున్నవి., దాహం అవుతోంది. కాచివడబోసిన నీళ్ళు శారదయిస్తే, అతికష్టంమీద త్రాగాడు. _ చెరిసగం రాత్రి అప్పటికే గడిచింది. భారంగా మూసుకొనివున్న కళ్లనితెరచి, శారదని పిల్చాడు. ఆమెలేచి అతని మంచంమీద కూర్చొంది. కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు కారుతున్నయి. నారాయణరావు, సత్తువలేని చేతినెత్తి, కొనగోళ్ళతో, ఆమె కన్నీటిని తుడుస్తూ_

"ఏడుస్తున్నావా?" _ అన్నాడు. ఆమె ఒక్క మారుగా బావురుమంది. అతని గుండెలు అలిసినయి. _ ధైర్యంకోసం _ ముఖంలో పైకికన్పడేలాగు నిబ్బరంతో _

"లేదు.." _ అంది.

"బాబు ఏడి?" _ రుద్ధకంఠంతో అడిగాడు. శారద లేచివెళ్ళి, కుమారుణి ఎత్తుకొచ్చి, భర్త

పక్కలో పడుకోబెట్టింది. అతను కుమారుణ్ణి ముద్దెట్టుకున్నాడు. తలనిమిరాడు . . శారద, అంత ఏడ్పులోనూ, చిరునవ్వు నవ్వింది. నారాయణరావు తృప్తిపడ్డాడు . . ఆమె చేతిని, తన చేతుల్లోకి మెల్లిగా తీసుకొన్నాడు, శారద దగ్గరగా జరిగి, అతని గుండెలమీద వాలిపోయింది. తల నిమురుతూ-

..."శారదా !"—అన్నాడు. తలెత్తి చూసింది. నవ్వుతున్నాడు. . అతని మనస్సు శాంతికోసం తృప్తిగా నవ్వింది . . అంతే తెలుసు నారాయణ రావుకి . . మిగతా భాగంయొక్క పర్యవసానం, శారదకు తెలుసు. నారాయణరావు ఆత్మ, ఆ నాటి ప్రగాఢ ధ్వాంతంలో, అనంతవాయువులో కలిసిపోయింది. శారద ఒక్కసారిగా, గావురుమంది. పసిపిల్లవాడికేమీ తెలియకపోయినా, ఏడ్చాడు. రక్తస్పర్శ అలాంటిది. అమావాస్య ఎంతటి చీకటి పాపంతో కూడివుందో, శారదకప్పుడర్థమైంది. ఎవ్వరూ శారద నా సమయంలో ఓదార్చేవాళ్ళు లేకపోయారు . . దిక్కుతోచక, భర్తశవంపైబడి, భోరున ఏడుస్తూ - ఆ తెల్లవార్లూ గడిపింది.

అది జ్యేష్ఠమాసం. రోహిణీకార్తె ప్రవేశించింది. ఉబ్బచినుకులు రెండు మూడుసార్లు పడినయి. ఆకాశం, ప్రొద్దుతిరుగంగానే పొగమబ్బులతో కమ్ముకోవటం జరుగుతోంది. పెద్ద పెట్టున గాలి దుమారంలేచి, కోతకొచ్చిన మామిడికాయల్ని రాల్చుతోంది. వడగాలి వీపటంకూడా బాహాటంగా వుంది. రైతులు ఆకు మళ్ళుపోసేసారు. కృష్ణకాలవలు బిగట్టివేసేసారు. వానకోయిలలు వర్షాగమనాన్ని సూచించే సంగీతం, ఆకురాలిన చెట్ల కొమ్మలపైకూర్చుండి, కట్టిస్తూ కూస్తున్నయి.

జగన్నాధం, ఆ కోయిలలకూతల్లోవున్న సారస్యాన్ని వింటూ, ఒకనాడు పడకకుర్చీలో జారగిలబడి చుట్ట కాలుస్తున్నాడు. వాకిటరుగులమీద యిద్దరు ముగ్గురు పిల్లకాయలు చేరి, ముంజికాయల్ని నరుక్కొని తింటున్నారు. అరబోసిన పన్నెండో నెంబరు ధ్యానం కాస్తున్న ఎండవేడిమికి తడిదనాన్ని పోగొట్టుకొంటున్నాయి.

మండువాలో జగన్నాధం భార్య దుర్గమ్మ నవ్వారు మంచంమీద పడుకొని, ఉక్కపోతకి, వూపిరాడక, తాటాకుల విసనకర్రతో మగతగా కళ్లు మూసుకొని, ఆపసోపాలు పడుతూ విసురుకొంటోంది. పడమరవేపు దొడ్డిగుమ్మంలో, దట్టంగా పడుతున్న బాదంచెట్టు నీడలో ఆయింటి కోడలు జయలక్ష్మి పమిటచెంగు పర్చుకొని, స్త్రీలవ్రతకధల పుస్తకాన్ని నోట్లో - నోట్లో చదువుకుంటోంది. ఆకు మళ్ళనీటి తడుపులికి కెళ్లిన ఆమెభర్త ధర్మారావు యింకాయింటికి తిరిగిరాలేదు.

ఇల్లంతా నిశ్శబ్ధంగా వుంది ...

ప్రొద్దు నిప్పుల్ని చెరుగుతోంది - గ్రీష్మతాపం జగన్నాధాన్ని ఎక్కువసేపు కుర్చీలో జారగిలపడుకోనివ్వలేదు. నెమ్మదిగాలేచి, వీధితలుపుల్ని వేద్దామని, వెడుతూండేసరికి, ఎదురుగా తపాలా బంట్రోతు విసురుగా వచ్చి, నుదుట పట్టిన చెమటను కొనగోళ్ళతో తుడిచివేసి, ఒక కార్డుయిచ్చి, గిరుకున్న వెనుతిరిగి చక్కాపోయాడు. వెంటనే అందుకున్న కార్డుపైవున్న అంశాలు ఏవో అతణ్ణి మెలివేసినయి. కుడి చేతితో ఆవుత్తరాన్ని అలాగే పట్టుకొని, ఎడమచేతితో గొడ్డూగోదారాకుండా వీధితలుపుల్ని గట్టిగా గడియవేసి వసారాలో కొచ్చాడు. ఆ తలుపుల చప్పుడుకి కుర్రాళ్లు. అరుగులమీదినుంచి రోడ్డుమీదికి దూకి, తాటిగెలతోసహా చెరువుగట్టుకి చేరారు. ఆరబోసిన ధాన్యాన్ని ఒక్కసారి ఆర చేద్దామని, కుర్చీలోంచి లేచినజగన్నాధం, ఆవుత్తరం ధ్యాసలోపడి, పూర్తిగా మర్చిపోయాడు. అప్పటికీ అందులోవున్న విషయం నమ్మశక్యం కాకుండానేవుందీ. . కాని, ఎంతమానంగా, తనలో తానై - చదువుకున్నా ఆశ్చర్యమే కలుగుతోంది! ఉత్తరంలోవిషయం తప్పని తానెల్లావూహించటం స్పష్టంగా ఉన్న సంగతేదో కళ్ళకి కనిపిస్తుంటే! నమ్మకుండా వుండటం ఎట్లా?

వెంటనే జగన్నాధం కోడల్ని పిల్చాడు. జయలక్ష్మి ఆపాళాన లేచి, చేతిలోవున్న పుస్తకాన్ని అలమారాలోవుంచి, మామగారి దగ్గరకొచ్చి,-

"ఏమిటీ!" అన్నట్లు చూసి, గుమ్మం ప్రక్కనే చాటుగా నిలబడింది. జగన్నాధం తనచేతిలోని వుత్తరంమిస్తూ -

"కాస్తబిగ్గరగా చదువమ్మా!"—అని కుర్చీలో కూలబడ్డాడు, కుంచించుకొనిపోతూ. జయలక్ష్మి ఆవుత్తరాన్ని చూసేసరికి భయమూ - అనుమానమూ కల్గినయి. ఉత్తరానికి నాలుగుమూలలా మసిమరకలున్నాయి. వ్రాసిన అక్షరాలు అలికివేసినట్లుగా వుండి ఏమిటో దీనాతిదీనమైన పరిస్థితిని వ్యక్తం

చేస్తోంది. తల్ల క్రిందులుగావున్న ఆ కార్డుని, సరిగా పుచ్చుకొని -

"పూజ్యులైన జగన్నాథం బావగారికి -

శారద నమస్కరించి వ్రాయునది.

మీకూ - మాకూ బంధురీత్యా రాకపోకలుం సన్నగిల్లినప్పటికీ నేను మీకు పరాయిదానినేమీ కాను. యీ రోజుల్లో నా జీవితం చీకటిగా మారిపోయింది. పరమపూజ్యులైన మీ తమ్ముడుగారు ... నేను యిక వ్రాయలేకపోతున్నాను. ఏదో బాధ, దుఃఖపూరితమై, నా హృదయాన్ని కలచివేస్తోంది. పసివాడు తండ్రికోసం తపించి పోతున్నాడు. వాడి భవిష్యజ్జీవితాన్ని మీరంతా కలిసి దయతో ఎలా పరిష్కరించి, వంశగౌరవాన్ని నిలబెట్టేందుకు ప్రయత్నిస్తూ, ఒకదరికి చేస్తారోనని నమ్మకొని వున్నాను. మీ చూపులికి అందనీయకుండా, మృతకళేబరాన్ని లేకుండా చేసినందుకు క్షమించకోర్తాను, లోగడ మనకున్న ద్వేషాల్ని — పగని - కక్షల్ని మర్చిపోయి యీసారికైన మీరు రాగలరని ఆశిస్తూ — నమస్కరిస్తున్నాను." మీ

శారద

— అని వణకుతూ చదివేసింది. రెండు కన్నీటి బొట్లు జలజలారాలినయి. జగన్నాథం కళ్లుకూడా చెమ్మగిల్లినయి. ఆలస్యాలసంగా జయలక్ష్మి చదివిన వుత్తరంలోని సంగతులికి దుర్గమ్మ లేచి, చేతిలో వున్న విసనకర్రని అమాంతంగా గోడవైపుకి విసురుగా విసిరిపారేసి గబగభా భర్తముందుకొచ్చి -

"ఏమిటండీ! నారాయణరావు పోయడా!" అని కోడలి చేతిలోంచి ఆ కార్డునితీసుకొని, చూస్తూ కంటనీరెట్టుకుంది. జగన్నాథం, తల ప్రక్కకి పెట్టుకొని కళ్లు మూసుకొని నారాయణరావుని గుర్తుచేసుకోసాగాడు.

ఇంతలో ధర్మారావు మిటమిటలాడే ఎండకి రొప్పుకుంటూ - రొజుకుంటూ, పొలంనుంచి వచ్చాడు. ఆసమయంలో అందరి ముఖాల్లోనూ విషాదపూరితమైన భావం ఏదో పొతరలాడుతోంది. "ఏమిటో అఘాయిత్యం జరిగిందని" వూహించాడు. మెల్లిగా, తొడుక్కున్న చెప్పుల్ని, క్రింది మెట్లమీద విడిచి, తల్లిదగ్గరగా వచ్చి, ఆవుత్తరాన్ని అందుకోబోతూండగా - జయలక్ష్మి అతనివంక చూస్తూ -

"మీ నారాయణరావు బాబాయిగారు ..." ఇక చెప్పలేక, పమిటకొంగునోటికడ్డం పెట్టుకొంది. అతను ఆమాటకి ఒక్కసారిగా వూగి, తమాయించుకొంటూ, చేతిలో వుత్తరాన్ని చకచకమంటూ చదివేసాడు. మొదట్లోనమ్మలేక పోయాడు. చివరకు సానుభూతిగా నమ్మదామనుకునేసరికి పాతకలహాలు - కక్షలూ గుర్తొచ్చి, అతని హృదయాన్ని కటువుగా మార్చి వేసినయి.

"చేసిన మోసానికీ - పాపానికీ తగిన ప్రాయశ్చిత్తమే జరిగింది. మనవంశానికి యిక పీడా వదిలిపోయింది —" అని, జగన్నాథం హృదయం తూట్లు పడేలాగు అన్నాడు. జగన్నాదం అక్షణంలో సహించలేక —

"ఎందుకురా అలా నోరుచేసుకొంటావ్! వాడికీ - నాకూ తగాదాలున్నంత మాత్రాన నువ్విలా లెఖ్ఖలేకుండా మాట్లాడటం మంచిదిగాదు. వ్యక్తిగతంగా మా యిద్దరికీ ఎన్నో వుంటయి. అంత మాత్రానికి నీకేం బాధ్యత వున్నట్లు దురుసుగా అంటావ్. తప్పుకాదూ! వాడెంత నీచుడైనా - దుర్మార్గుడైనా — చెడినవాడైనా, నేను అన్నగార్ని కాబట్టి వాడ్ని 'నా'వాడని ఎంచుకోక తప్పదు. చచ్చినా వాడిపేరు నాకు రక్తసంబంధమైందే!"-

ఎంతో సహనపరుడైన జగన్నాథం, ఆ సమయంలో అంతకన్నా ఎక్కువగా అనలేకపోయాడు. తనతమ్ముని సంసారాన్ని గురించి, తానిక ఏవిధంగా మాట్లాడినా, ప్రయోజనంలేదనియెంచి స్తబ్దుగా కూర్చుండిపోయాడు. తనకున్న మర్యాదనీ, గౌరవాన్ని, తమ్ముడిపట్ల వ్యక్తంచేస్తూ, వృధాప్రసంగం చేసినందువల్ల, గిట్టనివాళ్ళ మనస్సు అనేక రకాలుగా వుద్రేకపడుతుందని వూహించి మౌనరూపం ధరించాడు. అనవసరంగా యితరులను, తన స్వార్థం కోసం హింసించటం న్యాయంకాదని భావించే తత్వంగల మనిషి జగన్నాథం అంటే. అలాంటప్పుడు నోరు మెదపటం దేనికి? భార్య అయిన దుర్గమ్మకి - కుమారుడైన ధర్మారావుకీ చులకనభావం కల్గేలాగు ప్రవర్తించటం ఎందుకు? తాను యీ కాస్సేపు, తమ్ముణ్ణి గురించి, 'పైకిఅనకుండా వుండటమే సబబుగా తోచింది. అందుకని జగన్నాథం ఎవరిపట్లా ఏదురాభిప్రాయాన్ని ఏర్పడేలాగు చేయకుండా ప్రసంగాన్ని విరమింపచేసుకున్నాడు. దుర్గమ్మ కీహఠాత్పరిణామం ఎందుకు తన భర్తలో కల్గిందో ఆశ్చర్యం వేసింది. జగన్నాథం అన్న మాటలకు ధర్మారావు నోరు తిరిగి మెదపకుండా, భోజనానికి వంటింటి గుమ్మంవేపుకి దారితీశాడు. అతణ్ణి అనుసరిస్తూ జయలక్ష్మికూడా లోనికేగింది.

(సశేషము)

# 'పాపం బ్రద్దలైంది'

'రాఘవ'

(గతసంచిక తరువాయి)

జగన్నాథం పరితాప హృదయంతో, శారద గతి ఏమిటి? ఆ పసివాడి బ్రతుకేలాగూ? అనే విషయాన్ని తరిచి తరిచి ఆలోచిస్తూ' కకావికల పడుతున్నాడు. అతని అంతర్వాణి అనేక రీతులుగా పల్కుతోంది. ఆలోచనలు, లోతుకిపోయిన కొద్దీ కన్నీరు అప్రయత్నంగా వూరుతోంది. ఏభయ్యో పడిలోకి పడబోతున్న జగన్నాథంకి యీ విషమ పరిస్థితులేమిటి? యీ తెగని సమస్య లేమిటి? అటు సయాన తమ్ముడి భార్య - కొడుకూ దీనావస్థలోపడి, దిక్కుతోచక తికమక పడుతున్నారు. ఇటు తెలివితక్కువ ప్రసంగాలతో, అసమర్థుణ్ణి చేసి, అవిశ్వాసపూరితమైనభావాల్ని వ్యక్తపరుస్తూ ఆత్మక్షోభను కల్గిస్తున్నారు. యిలాంటి అనిర్వచనీయమైన జీవిత దుర్భర స్థితిగతుల్లో జగన్నాథం ఎట్లా ప్రవర్తించటం? ఏది మంచి? ఏది చెడూ?

దుర్గమ్మకి నిశ్శబ్దత కాస్తంత చిరాకని - పాత రోజుల్లో రేగి, పేరుకొనివున్న పగని - తన భర్త పక్షపాత బుద్ధిలో వున్న స్వార్థాన్ని రగిలేటట్లు చేసింది. వాస్తవంగా దుర్గమ్మ తొందరమనిషి. ఏదైనా కోరిక కల్గటమే తరువాయి, తీరేదాకా జగన్నాథాన్ని వూపుతునే వుంటుంది ఏవేవో కుంటిమాటలు మాట్లాడుతూ ఊపిరి సలప నివ్వదు. క్షణంసేపు వూరుకోనివ్వదు. నిజంగా దుర్గమ్మకి ఎంత తొందరో - ఎంత ఆదుర్దా వుందో - ఎన్ని కోర్కెలున్నాయో - వాటికి సరిసమానంగా జగన్నాథంవద్ద పూర్తిగా మూర్తీభవించి వున్నది ఆ ఒక్క సహనమే! కొండవిరిగి మీదపడుతోందన్నా, భయపడేవాడు కాదు. దుర్గమ్మ ఎన్ని దెప్పుడుమాటలన్నా, చిరునవ్వులతో సమాధానమిచ్చి, తలొగ్గిన వాడిలా ప్రవర్తించేవాడు. భర్తని, దైవంతో సమానంగా పూజించాలని దుర్గమ్మకి తెలియకనా? తెలుసు. కాని కోపం ముక్కుమీద ఎప్పుడూ వుండటంచేత, కరుకుగా మాట్లాడుదూ, అసమర్థుణ్ణి చూసినట్లు చులకనగాచూస్తూ వుంటుందే కాని, లోకం దుర్గమ్మనే మెచ్చుకొంటూ - నెత్తికెత్తుకుంటుంది.

"మొత్తానికి చదువున్న భర్తని చేతుల్లో వుంచుకున్నావమ్మా! ప్రజ్ఞంటే నీది? ఎంత తెలివిగల దానివమ్మా! యీ కాలంలో నువ్వు కాబట్టి యీ పనిని చేయగలిగావుగానీ, మరో ఆడదైవతయినా చేయగలుగా! ఎంత అదృష్టవంతురాలివి?"-అని అస్తమానమూ పొగిడిన వాళ్ళు పొగిడినట్లే వుంటారు. దుర్గమ్మకలా ఎవరైనా అన్న రోజున, జగన్నాథం అంటే మరీ హీన దృష్టితో రెచ్చిపోయి, నారాయణరావు విషయాన్ని బయటికిలాగి, ప్రసంగం రూపంలోకి తెచ్చి ఎడా - పెడా తిట్టిపోస్తూండేది. మొదట్లో కొన్నాళ్ళు జగన్నాథం, దుర్గమ్మను అనేక విధాలుగా మందలిస్తూ-మంచి వాక్యాలు చెప్పి చూశాడు. విన్నట్లే వినేది, అంతలోనే ఏమిటో విషయాన్ని గుర్తు చేసుకొని, కోపంతో చిర్రు బుర్రు లాడేది. మళ్ళా 'యథా ప్రకార నిధిరస్తు' అన్నట్లయ్యేది. ఇక అలాంటప్పుడు జగన్నాథం మాత్రం ఏం చేయగలడు? చెప్పిన మాటలు పెడచెవినిబెట్టి, తగుదునమ్మానని బయలుదేరే. కొట్టడానికి మనస్కరించేది కాదు. కావాలని చేసుకొన్న భార్యని కసాయివాడిలాగా కొట్టి చంపాలనే, విసుగుదల ఎంత హెచ్చినా, ఆ భావం కల్గించుకొనే వాడు కాదు, రవ్వంత తప్పుమాటనికూడా పల్కని వ్యక్తి. ఒకవేళ పెదవిని వృథాగా కదిలిస్తే, ఏ పరుష వాక్యం అప్రయత్నంగా - తనకి తెలియకుండా వస్తుందోనని, స్పష్టంగా మాట్లాడి వూరుకునేవాడు. ఏ విషయాన్నైనా సరే చాలా జాగ్రత్తగా ఆలోచించి, దాని లోతుపాతులు క్షుణ్ణంగా తెలిసిన తరువాతనే చేయటానికి తూగేవాడు. అనవసరంగా ప్రవర్తించి అభాసుపాలయ్యేవాడు కాదు. అందుకే వూరంతా జగన్నాథం అంటే చేతులెత్తి నమస్కరిస్తారు. దుర్గమ్మ హర్షిస్తుంది. యిలా వున్నప్పుడు జగన్నాథం ఏ మాట ఆధారం చేసుకొని, దుర్గమ్మతో, ప్రసంగించగలడు? అందుకే వూరుకుండి పోయాడు. నారాయణరావు జగన్నాథం కళ్ళలో కనబడి—

"అన్నయ్యా"—అని కాళ్ళమీద పడి, చంటి బిడ్డలాగా యేడుస్తున్నట్లుగానే, జగన్నాథం తనలోతాను వూహించుకోవటం ప్రారంభించాడు. "తన భార్య స్థితిని, తన కుమారుని స్థితిని ఏం చేయదల్చుకున్నావో?" నని ప్రాధేయ పడుతున్నట్లే భావించసాగాడు. "నువ్వు చేసిన మేలుకి, నేను నీ ఆత్మ తృప్తికోసం బ్రతికినన్నాళ్ళూ మంచిగా బ్రతకలేక పోయాను. నీ మాటల్ని లెఖచేయకుండా తిరిగి చెడిపోయాను. సామాన్యంగా నీకు అప్రతిష్ట

కూడా వచ్చింది. నా ముఖాన్ని యిక చూపటం ఎంతో ఘోరమైన పాపమని యెంచి, క్షమించమని చనిపోయాను'' అని, తనెదుట ప్రత్యక్షమై, నారాయణరావుగోడు గోడున ఏడుస్తూ, చెప్తువున్నట్టే తలపోశాడు. ఇట్లా ఎంత సేపు యోచించినా, ప్రస్తుత కర్తవ్యం ఏమిటో తేలకుండానే వుండిపోయింది.

ఇంతలో దుర్గమ్మ రెండు మూడు సార్లు యింట్లోకి - బయటికీ కాలు గాలిన పిల్లిలా తిరిగింది. భర్తని ఎలాగైనా మాట్లాడించి, ఆయన హృదయ భావమేదో తెలుసుకోవాలని ఎత్తుగడ వేసింది. ఇంతలోకి ధర్మారావు, అతని వెనకే జయలక్ష్మి అక్కడికొచ్చారు. వడగాలి వీస్తూనే వుంది.

"ఎవరికి వారలా ఏమీ పట్టనట్టుగా వుంటే, అక్కడ శారద గతి ఏం కావాలి?''—దుర్గమ్మ భర్త నుద్దేశిస్తూ ఎద్దేవగా అంది. ధర్మారావు తల్లివంక చూశాడు.

"రక్త సంబంధమైన తమ్ముడు పోయినంత మాత్రాన శారద పరాయిదవుతుందా? ఎవరికో ఎందుకు ఆమె అంటే జాలి కలుగుతుంది? అయిన వాళ్ళమే, ఆస్తిపాస్తుల పేరిట, అసభ్యంగా ప్రవర్తించి, దూరం చేసుకున్నప్పుడు, పరాయి వాళ్ళెవరో వచ్చి, శారదను ఆదుకుంటారనుకోవటం వుత్త తెలివి తక్కువతనం''.

జగన్నాధం శాంతంగా ఆలోచించి అన్నాడు. ఆ మాటకి దుర్గమ్మకి ముక్కుమీదికి కోపం ముంచుకొచ్చింది.

"అందుకేగా తమ్ముడొచ్చి, అడిగినప్పుడల్లా యే అడ్డు మాటా చెప్పకుండా వందలకు వందలు దోచి యిచ్చారు. నాటకాలకు కంట్రాక్టరుగా వుండీ వుండి తన ఆస్తిని తెగనమ్మకొని, దూబరాగా ఖర్చు చేస్తువుంటే, మందలించలేక, వూరుకున్నారు. వూరినిండా అప్పులు పెరిగితే, స్వార్జితమంతా చాటుగా పట్టుకుపోయి, తమ్ముడికి ఆదుకున్నారు. కన్న కొడుకున్నాడన్న మాటకూడా లేకుండా, శాకితో మీ తమ్ముడు కబురంపినప్పుడల్లా గంపెడుత్సాహంతో, యినప్పెట్టె తెరచి, అప్పటి కప్పుడే పంపించి వేశారు యెంతుంటే అంతిదబ్బుని. యివన్నీ ఎవరికీ తెలియదనుకుంటున్నారు. నా కుమారుడికి చివరికిట్లా అన్యాయం తలపెడతారని కలలోకూడా అనుకోలేదు.''—మొసలి కన్నీరు కార్చింది.

"నేను మీకేమన్యాయం చేశాననీ!'' - జగన్నాధం బాధగా చూసాడు.

"చేసిందంతా అన్యాయమేగా! యింకా ఏం చేస్తానే! అంటారు''—దుర్గమ్మ ముక్కు చీదుతూ బవాబిచ్చింది.

"నేనెవనరికీ ఏ అన్యాయమూ మనస్ఫూర్తిగా చేయలేదు. నా తమ్ముడికి నేను సాయం చేసానూ అంటే, అది నా వ్యక్తిగత విషయం. ఆపదల్లో వుండి, అలమటిస్తూ వున్న నా తమ్ముడికి, నేను కాకపోతే యింకెవరే సహాయం చేసేది? పరాయివాళ్ళెందుకు జోక్యం కల్గించుకుంటారు? నా స్వార్జితాస్తిని వాడికెందుకిచ్చారు? అని ప్రశ్నించటానికి నీకేం హక్కువుంది. నువ్వలా గుచ్చి గుచ్చి అడగటం భావ్యంకాదు. కన్న కొడుకున్నాడనే భావం నేనేమీ మర్చిపోయి, నా తమ్ముడి సంసారానికి సాయం చేయలేదు, అనవుసరంగా, నువ్వు కోపం పెంచుకోకు''. —జగన్నాధం ఎంతో ఓర్పు చూపుతూ అన్నాడు. ధర్మారావు తల్లిదండ్రుల మాటలన్నీ యింతవరకూ వింటూ వచ్చాడు, తానేదైనా కల్పించుకొని అందామనుకున్నాడు. తల్లి కళ్ళతో అతని వుద్రేకాన్ని ఆపుతూవుంది. చివరకు తల్లినికూడా ధిక్కరిస్తూ, తండ్రివంక చూస్తూ "అదిగాదు నాన్నగారూ? యిచ్చినందుకు మేము ఏమీ వేరుగా భావించటంలేదు మీరంటే.''

"అటువంటప్పుడు మీ తల్లీ - కొడుకులు, నా తమ్ముడంటే ఎందుకిలా విరోధ భావంతో మాట్లాడుతున్నారు?''

"ఎవరి ఆస్తి వారికి వుండగా, మీవద్ద వున్న డబ్బుని కోరటమనేది వృధాగా ఎందుకు జరిగింది?''

"వృధాగా ఏమీ మా తమ్ముడు తీసుకోలేదు''

"వడ్డీకి తీసుకున్నాడా?''—దుర్గమ్మ వింతగా ప్రశ్నించింది.

"నేనేమీ మార్వాడీ వాణ్ణి కాదూ - తలకాయలు మార్చి అక్రమంగా డబ్బుకూడ బెట్టడానికి.''

"అంతమాట ఎవరన్నారు? నాన్నా!''

"మీ వుద్దేశ్యం అలాగే వున్నది గదా''

"ఆ మాట ఎవన్నారండీ! వూరికే మీ వులుకు మీరు బయట పెట్టుకుంటారు.''—దుర్గమ్మ సాలోచనగా అంది.

"లేకపోతే ఏమిటిదంతా? శల్య పరీక్ష చేసినట్లు మాట్లాడుతున్నారు. నా తమ్ముడి అవసరాలకు నేను, మీకు తెలియపర్చకుండా సాయం చేస్తే, మీరది తప్పుగా ఎంచి, నన్ను చిత్రవధ చేసినట్లు చేస్తారూ! నా స్వార్జితం నేనేం చేసినా అడగటానికి మీకేం అధికారం లేదు.''

"ఎందుకు లేదూ ?"— దుర్గమ్మ కోపంతో ప్రశ్నించింది.

'లేదూ'..అన్నాను అంతే'జగన్నాథం ఖండితంగా మూడు ముక్కలూ అక్కడవున్న వాళ్ళముఖాననే అనేసి, చివాలున్న కుర్చీలోంచి లేచి, మండువాలో కొచ్చాడు. యింతసేపూ తు.చ. తప్పకుండా మాట్లాడినప్పటికి జగన్నాథం ముఖంలో కోపం తారాడలేదు. వాస్తవంగా మరో వ్యక్తికైతే, ఆ సమయంలో పట్టరానంత కోపమూ - రోషమూ - విసుగుదలా ముంచుకొచ్చేవి. అలాంటి వేమీ రాకపోవటంలోనే వుంది జగన్నాథం గొప్పదనం. ఇక వృథా ప్రసంగం పెంచటం సమంజసంగా తోచలేదు. "ఏమన్నానో అన్నాను యిక వాళ్లేమనుకున్నా తాను వినిపించుకో దల్చుకోలేదు జగన్నాథం. చేయ దల్చుకున్న కర్తవ్యం చేసెయ్యాలనుకున్నాడు." వెంటనే జయలక్ష్మి వంక చూసి—

"నా చేతి సంచీ ఎక్కడుందమ్మా ?" - అని ప్రశ్నించాడు. మండిగానికి ఏటవాలుగా నిలబడి వున్న జయలక్ష్మి చరాలున అక్కణ్ణుంచి కదిలివెళ్ళి, గదిలోవున్న చేతి సంచీ తెచ్చి యిచ్చింది.

దుర్గమ్మ — ధర్మారావు, జగన్నాథంలో కల్గిన పరివర్తనకి చకితులై పోసాగారు. తల్లీ - కొడుకూ ఒకళ్ల ముఖాలొకరు వింత, వింతగా చూసుకొని తెల్లబోతున్నారు. జగన్నాథం, దణ్ణానవున్న తన బట్టల్నిగభాల్నలాగి, చేతి సంచీలో కుక్కుతున్నాడు. మామగారికి యింకేం కావాలోనని జయలక్ష్మి వేచివుంది. బట్టలు సర్దుకొని, యిల్లంతా కలియ తిరుగుతూ, మూలవున్న అకు జోడుని మెల్లగా తొడుక్కుంటూ—

"నా గొడుగేదమ్మా ? కాస్త ఎక్కడుందో వెతికియ్యి"—అంటూ వాకిట్లోకొచ్చి నిలబడ్డాడు. అంతవరకూ, ఆ ప్రదేశంలోవున్న తల్లీ - కొడుకూ, మండువాలోకొచ్చి - జయలక్ష్మిని దగ్గరకు పిల్చి - ఏమడగాలో తెలియక - ఏం చెప్పాలో తోచక—

"కాస్త కాఫీ కాయి యీ లోపుగా త్రాగి వెడతారు"—అంటూ భర్త దగ్గిరికి వెళ్ళింది దుర్గమ్మ. జయలక్ష్మి వెంటనే కదిలి వెళ్లి కుంపటి అంటించటం మొదలెట్టింది. ధర్మారావు మండువాలో దిక్కుతోచక అటూ-యిటూపచార్లు చేయసాగాడు.

"వెళ్లేవారు ఎలాగూ వెడుతున్నారు. కాస్త కాఫీత్రాగి మరీ వెళ్లరాదూ ! జయలక్ష్మి కుంపటి అంటించటంకూడా అయింది,"—అంటూ, తన కోపాన్ని దిగ మ్రింగుకుంది.

నుదుట పట్టిన చెమటను పై వుత్తరీయంతో తుడుచుకొంటూ, జగన్నాథం కుర్చీలో కూలబడి— భార్యవంక చూస్తూ—

"నేను, శారదను - ఆ పసివాణ్ణి చూసి వద్దామని బయలుదేరాను. పోనీ, నువ్వూ రా రాదూ !"— జాలిగా అన్నాడు.

"పదేళ్ళనుంచీ లేని యీ రాకపోకలు మళ్ళా మొదలెట్టడం దేనికిలేద్దురూ ? మీరే వెళ్ళిరండి సరిపోతుంది."—మామూలుధోరణిలో అన్నా. జగన్నాధంకి, భార్య మనస్సులో యింకా, ఆ సంసారం పట్ల కోపం పోలేదన్న భావం తెలిసిపోయింది. ప్రయత్నిద్దామనే వుద్దేశ్యంతో—

"అయిందేదో అయిందిగా, యిక ఆ పాత విషయాల్ని వృథాగా తరచకు. ఒక్కగానొక్క తమ్ముడు పోయినందుకు నేనెంతగా కుందుతున్నానో తెలియదు. నువ్వంటే వాడికెంతో ప్రేమ. యీ పదేళ్లనుంచీ ముఖాముఖిగా మాట్లాడుకో పోయినా, నీ గురించి ప్రతి వుత్తరంలోనూ వ్రాస్తూవుండేవాడు. వాడి దురదృష్టానికి మనమూ కారణం! యీ సమయంలో శారదకూ—ఆ పసివాడికీ, మనం ఆశ్రయమిచ్చి, కాపాడకపోతే, యింకెవ్వరున్నారు చెప్పు. తోటికోడలిమీద నువ్వామాత్రం జాలిదల్చి ప్రవర్తించకపోతే, శారదగతి ఏంకావాలి? చెప్పు. మనమే పరాయివాళ్ళలాగా తప్పుకుపోతే, వాడి వంశం నిలబడేదెట్లా ? ఆ కుటుంబ గౌరవం మాయమై పోయేలాగు చేయటం మనిద్దరిది న్యాయమేనా? శారదను దిక్కులేనిదానిగా చేసి, ఆపసివాణ్ణి, మనవాడు కాదని, తూష్ణీభావంతో చూసి, లోకం కన్నుకప్పటం మనతరమేనా ? అయిన వాళ్ళూరుకుంటారా ? "చెట్టంత అన్నగారుండి, తమ్ముడి సంసారం చితికిపోయి చిందరవందర అవుతూంటే, చూసి వూరుకున్నాడేమిటి ?"_ అని నలుగురూ ఎత్తి పొడుపు మాటలనరూ ! అను క్షణమూ ఎగతాళిగా మాట్లాడరూ ! యిక తలెత్తి బ్రతికి వున్నంత కాలమూ తిరగ గలమా ! ఎందుకైనా మంచిది నువ్వాలోచించికూడా చూడు..."_ అన్నాడు.

జగన్నాథం దీనంగా భార్య ముఖంలోకి చూస్తూ వున్నాడు, ధర్మారావు చేస్తూ చేస్తూ వున్న పచార్లని తగ్గించుకొని, తల్లివద్దకొచ్చి—

"ఒకసారి యిలా రావే అమ్మా!"— అంటూ ఉత్తరవేపు దొడ్డి వాకిట్లోకి దారి తీశాడు. దుర్గమ్మ కూడా వెంట ననుసరిస్తూ వెళ్లి, చతికిలబడివున్న కొడుకుముందు కూర్చుండి...

ఇంతలో జయలక్ష్మి కాఫీలు ముగ్గురికీ యివ్వటానికి బయలుదేరింది...ధర్మారావు ఏదో అనబోతుండగా_తన చేతిని, కొడుకు నోటికి అడ్డం వుంచుతూ_

"కాస్తాగు... నీ భార్య విన్నదంటే కొంపలంటుకుంటయి... అది కాఫీ తెస్తోంది... యిచ్చి వెళ్లిపోనియ్యి. చెబుదుగాని..."_అని మెల్లిగా అంది.

జయలక్ష్మి సరాసరి ముందు రెండు కంచు గ్లాసులతో, కాఫీ తెచ్చి క్రింద పెడుతూ _భర్త ముఖం వంకా, అత్తగారి ముక్కోపం వంకచూసి, వెనుతిరిగి చక్కాపోయి, మామగారికి కూడా కాఫీ యిద్దామని, గ్లాసు పుచ్చుకొని బయలుదేరి వసారాలోకొచ్చింది, జగన్నాథం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. _జయలక్ష్మి మెల్లిగా—

"మామగారూ!" అంది. జన్నాథం తలతిప్పి చూసి,_ఆమె చేతిలోని కాఫీగ్లాసు నందుకొని పెదవి దగ్గరికి చేర్చుకున్నాడు. జయలక్ష్మి అలవాటు ప్రకారం—

"పంచదార సరిపోయిందా లేకపోతే కాస్త తెమ్మంటారా?"_అంది, జగన్నాథం సాలోచనగా కాస్త కాఫీ రుచి చూస్తూ - చప్పరించి _

"సరిపోయిందమ్మా...నువ్వుకూడా అసుక్కడు కాస్తా త్రాగు... పో"_అన్నాడు. వెంటనే జయలక్ష్మి ముందువాగుండా వంటింట్లోకి వస్తుంటే, ఉత్తరవైపు గుమ్మంలోంచి ఆ తల్లీ కొడుకుల గుసగుసలు వినిపించినయి. మధ్యలో ఆగి, వినటంవల్ల అత్తగారి దురుసుమాటలికి ఆహుతి కావాల్సొస్తుందేమోనని ఏకాయకీగా కాఫీ కుంపటి వద్దకు వచ్చేసింది. తన భాగం మిగుల్చుకొన్న కాఫీని త్రాగుతూ ఒక చెవుని, అత్తగారి నోటి గట్టి మాటలకు అడ్డుగా ఉంచింది. ధర్మారావు అటూ_యిటూ చూస్తూ, తల్లితో_అంటున్నాడు—

"నాన్న అన్నమాటలు జాగ్రత్తగా విన్నావమ్మా?"

"విన్నానురా"—అంది.

"ముందు నీ అభిప్రాయమేమిటీ చెప్పు?"

"నాన్న వూరికే శారద పిన్నిని చూడటానికి కాదు వెళ్ళేది. తమ్ముడిపట్ల వున్న అభిమానాన్ని తిరిగి పోగొట్టుకోకుండా నిలబెట్టుకునేటందుకు, లోకోపవాదాలకు గురికాకుండా, ఆ శారద పిన్నిని - ఆ పసివాణ్ణి చూసినట్లే చూసి, ఆశ్రయ మిస్తానని చెప్పి యిక్కడికి తీసుకొచ్చేందుకు బయలుదేరాడు. నిజంగా ఆమెగారే గనుక కొడుకుతోసహా వచ్చిందో నాకు దక్కే యీ ఆస్తీ కాస్తా ధ్వంసమైపోయి తీరుతుంది. తరువాత నేను చిప్పా _కర్రా పుచ్చుకొని తిరుగవలసిన గతి ఏర్పడుతుంది. యీ సమయంలో వాళ్ళ నేదోవిధంగా విడనాడుకోవడమే మంచిదనిపిస్తోంది. అయినా, ఎవరి ఆస్తీ వాళ్ళకుండగా, మనింటికి శారద పిన్నిని రమ్మంటే మాత్రం వస్తుందంటావా అమ్మా?"

"ఇంకా నీ పిచ్చిగానీ, శారద దక్కిన ఆస్తి ఏముందిరా?"

"ఏమీ లేదా?"

"ఏదో వుందిలే..."

"ఎంతా?"

"ఎంతోదాకా కూడానా! అయ్యో రామ. రెండెకరాలు మాత్రం వుంది. అదైనా చెరువు క్రింద, మహాపండితే ఏ ఆరు బస్తాలో - ఏడుబస్తాలో వస్తయి ఎకరానికి. అంతే!"

"మిగతదంతా బాబాయే పాడు చేసాడా?"

"ఇకఇప్పుడవన్నీ దేనికిగాని. ఏం చేద్దాంచెప్పు?"

"ఎలాగూ యింక రెండెకరాలు వుంది కాబట్టి ఒక పని చేద్దాం."

"ఏమిటది?" దగ్గరగా జరిగి మరింత ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ దుర్గమ్మ ప్రశ్నించింది.

"ఆ పసి కుర్రవాణ్ణి మాత్రం ఎలాగోలాగు, శారద పిన్నిని ఒప్పించి తీసుకొని రమ్మందాం.', వాడికి సర్వ విధాలా పోషణ కర్తలం మనమేగా' అని నాన్నకు నచ్చచెప్పి, పంపుదాం. వీలయితే శారద పిన్నినికూడా కొన్నాళ్ళొచ్చియుండి పొమ్మని కోరినట్లుగా చెప్పమందాం. పదేళ్ళనుంచీ వున్న పాత కక్షల్ని మర్చిపోయామని చెప్పమందాం...అప్పుడు తప్పకుండా వస్తుంది. కొన్నాళ్లు ఆశ్రయమిచ్చి 'మనా' అనే దృష్టితో ఆత్మీయంగా చూసుకుందాం.

(సశేషము)

# 'పాపం బ్రద్దలైంది'

'రాఘవ'

(గతసంచిక తరువాయి)

అప్పుడామె, తనయందూ - తనకుమారుని పోషణయందూ ఎంతో ప్రేమాభిమానాలు కల్గివున్నాయని నమ్ముతుంది. అప్పుడు యిక మనం కోరకుండానే, ఆ రెండెకరాలూ, అపుత్రవాడికి చెందేటట్లు వ్రాసి యిస్తుంది. వాడు మనింట్లోవుంటాడు. ఆపొలం కూడా మనచేతిలోనే వుంచేసినట్లుంటుంది. వీలైతే కవులుకి నేనే తీసుకొని దున్నిస్తాను. దానిమీద వచ్చే అయివేజుతో, కొంతడబ్బుని నిల్వ చేయవచ్చు. "నాపొలంమీదవచ్చిన డబ్బేదీ?" అని ఒక వేళ పిన్ని అడిగిందనుకో - మాటవరుస కంటున్నాను— "మా నాన్నని మోసం చేసి, మీ ఆయన గుంజుకొన్న డబ్బుకి వడ్డీతీసుకొంటున్నాం"—అని నేను సమాధానమిస్తాను. అప్పుడి కేంచేస్తుంది! అందుకని, ఆ పొలాన్ని, ఆ కొడుకు పేరు పెట్టి, దానిమీద అజమాయిషీ మనకిచ్చి, మన చెప్పుచేతల్లో వుండేలాగు చేసుకోవటం ఎందుకైనా మంచిది. లేకపోతే, మన ఆస్తి మనకు, ఎలా తిరిగి వస్తుంది? ఏదో ఒకటి చెయ్యకపోతేనేగాని, యీలోటుతీరదు. అందుకని, ఆ శారదపిన్నిని, కొడుకుతో సహా వచ్చేలాగు చెయ్యడమే, ముందు ముందు సాగబోయే మన ప్రయత్నానికి లాభసాటియైనపని. ఏమంటావ్?"

దుర్గమ్మ తెల్లబోయింది. కొడుకింత ప్రయోజకుడనుకోలేదు. కొద్దిపాటి చదువు చదివినా, బుద్ధి మాత్రం బృహస్పతికన్నా ఎక్కువగావుందని సంతోషపడింది. సరేఅని తలవూపుతూ లేచి - చరచరామంటూ, మందువాగుండా నడిచివచ్చి, భర్తముందు నిలబడింది. ధర్మారావు గొడ్లసావిడిలో కెళ్ళి, ఎడ్లకు వరిగడ్డి వేస్తున్నాడు. జయలక్ష్మి మెల్లిగా వాకిట్లోకొచ్చి, ఆరబోసిన ధాన్యాన్ని దగ్గరకు ప్రోగు చేయసాగింది.

అంతవరకూ భార్యకోసం ఎదురుచూసిన జగన్నాథం కుర్చీలోంచిలేచి, _ మెట్లుదిగుతూ - "ఏం చెప్పదల్చుకున్నావే?" - అన్నాడు.

కోడలు జయలక్ష్మి ఎక్కడ వినిపోతుందో అనే భయంతో _ వాకిటరుగులవరకూ వచ్చి—

"మీమాటనే నెప్పుడు కాదన్నాను చెప్పండి? ఎవరికైనా కష్టాలువస్తూవుంటాయి. అయినవాళ్ళం మనబోటివాళ్ళమే ఆదుకోకపోతే. మాతోటి కోడలికి యింకెవరాదుకుంటారు? 'నా' అని ఎవరాశ్రయమిస్తారు? పాపం! ఆ చంటివాడు "నాన్నా - నాన్నా" అంటూ ఎంతగా తపించి, ఏడుస్తూ వున్నాడో! మీరెలాగైనాసరే వాణ్ణి వెంటబెట్టుకొనిరండి! మీరే 'నాన్న'నుకొని, వూరుకోనన్నా వూరుకొంటాడేమో! అయిందేదో అయిపోయింది. గతాన్ని యింకెందుకూ తవ్వుకోవటం? వీలైతే శారదనికూడా, తీసుకొనిరండి. కొన్నాళ్ళుండిపోతుంది. యింతమందివుండికూడా, దిక్కులేనిదాన్నిగా చేసి. ఒంటరిగా వేడ్పించటం భావ్యంకాదు. మాయదారిలోకం మనల్నే ఆడిపోసుకుంటుంది. కాబట్టి, ఎలాగోలాగు నేచెప్పినట్లు చేసిరండి! శారద ఒకవేళ రానంటుందేమో! వూరుకోకండి. ఎట్లాగైనా, నే చెప్పానని చెప్పి, ఒప్పించి తీసుకురండి! నాకూ వాళ్ళిద్దర్నీ మనస్ఫూర్తిగా చూడాలనేవుంది. భర్తపోయి అదెంత కుమిలి కుమిలి ఏడుస్తోందోపాపం!! చిన్నతనంకూడా ఏమనుకుంటోందో ఏమో" _ అంటూ కళ్ళనీళ్లు పెట్టుకొంది. జగన్నాథం నివ్వెఱపోయాడు. 'తన భార్యలో యింతమార్పు ఒక్కసారిగా ఎలా కల్గిందో'నని ఆశ్చర్యచకితుడై పోయాడు. 'తన ఉద్బోధ ఆక్కరకొచ్చిందని' హృదయాన్ని కుదుటపర్చుకొన్నాడు. ఇక అట్టే సేపు నిల్చుండటం యిష్టంలేక, చేతిలో గొడుగుని, చంకలోపెట్టుకొని రోడ్డెక్కాడు. దుర్గమ్మ వెడుతున్న భర్తవంకచూస్తూ - "తప్పకుండా తీసుకురండీ" - అంది. ఆ మాట, మలుపుతిరుగుతున్న జగన్నాథంకి వినిపించి, ఒక్క చిరునవ్వుని తెప్పించింది.

అప్పటికి ప్రొద్దువాటారబోతోంది. ఆకాశం పొగమబ్బులతో ఆవరించుకొని పోతోంది. జయలక్ష్మి ఆరబోసిన ధాన్యాన్ని బస్తాకెత్తుతోంది. దుర్గమ్మ లోపలికొచ్చేసింది. గంపెడు దుఃఖాన్ని నెత్తుకెత్తుకొని జగన్నాథం చేరేటప్పటికి, నారాయణ

రావు అత్తమామలూ - బావ మరదులూ - వీరభద్రం - శారదను ఓదారుస్తూవున్నారు. వెళ్ళివెళ్ళంగానే, జగన్నాథంకి మాటపెగల్లేదు. ఎట్లా పరామర్శించాలో, అంతవయస్సువున్నా అర్థంకాలేదు. శారదకు మరింత దుఃఖం పెల్లుబికింది. చంటివాడు 'నాన్నా-నాన్నా' అంటూ వచ్చీ రాని మాటలతో, తల్లి నేడిపిస్తున్నాడు. ఆమె వాడి ఏడ్పునిధరించలేక, చేసినచీకటి పాపాన్ని తల్చుకొంటూ, ఏర్పడిన పరిస్థితికి, కుమిలిపోతూ కుళ్ళి, కుళ్ళియేడుస్తూవుంది... వీరభద్రం మాత్రం జగన్నాథాన్ని చూసేసరికి వణకిపోయాడు. ఎదురుగా నిలబడలేక, అక్కడక్కడకు తప్పుకు తిరుగుతూ, కలతతో ముఖాన్ని చాటుచేసుకోవటం సాగించాడు. నెలరోజులు గడిచింది. శారద విషయం పరిష్కారానికొచ్చింది. ఎక్కడవుండి, ఆమె బతుకుని గడపాలనేది ఒకనాడు చర్చనీయాంశమైంది. శారదనుకూడా ప్రశ్నించారు. ఎక్కడవుండి కాలాన్ని వెళ్ళబుచ్చేదీ తెల్పమన్నారు. మొదట్లో ఆమె ఏమీసమాధాన మివ్వలేకపోయింది. జగన్నాథం, తన భావాన్ని వ్యక్తం చేయకముందే, ఆమె తల్లిదండ్రులు, అన్నదమ్ములు, జగన్నాథంతో _ "శారదని కొన్నాళ్ళపాటు మా యింటికి తీసుకొని వెడదామనుకొంటున్నాం... యిక్కడ ఒంటరిగావుంటున్న కొద్దీ, ఆవేదన పడటమేగానీ, యింకేముంది?" - అని తమ తమ మనోభావాల్ని తెలియపర్చారు. శారదకూడా వెళ్ళాలనుకొంది. జగన్నాథం తన అభిప్రాయాన్ని వెంటనే విరమించుకొని, 'సరే! అలాగే చేయండి'. అని చెప్పి రెండురోజులుండి, తన స్వస్థానానికి చక్కాపోయాడు. తరువాత తరువాత, శారదని తీసుకొని, ఆమె వాళ్ళు వెళ్ళిపోయారు. వీరభద్రం వుసూరుమన్నాడు. నారాయణరావు చెప్పినట్లు, యిక తానేం - చేయగలనని, నిరుత్సాహపడ్డాడు. తన ప్రయత్నం విఫలమైనందుకు చిరాకుపడ్డాడు. తను చూస్తూ - చూస్తూండగానే, శారదయింటికి తాళం పడిందని, కన్బొమలు ముడివేస్తూ, పిడికిలి బిగించాడు. ఎలాగైనాసరే, ఆ తాళాన్ని బ్రద్దలుకొట్టి, తీయించాలని, బిగించిన పిడికిలిని తెరచాడు. వీరభద్రంకి, నారాయణరావు పోయినందుకు ఏ విచారమూ లేకపోగా, శారద, తప్పుకొని పోయినందుకు విపరీతమైన ద్వేషం కల్గింది. ఎట్లాగనాసరే శారదను, తిరిగి, చేతుల్లోకి, లాక్కోవాలని, నిర్ధారించుకొన్నాడు.

శారద పుట్టింటివారు మధ్యరకం కుటుంబీకులు. పెద్ద సంసారం. తెల్లవారినదగ్గరనుంచి అధికమైన ఖర్చేగాని, రాబడి బహుతక్కువ. నిశ్చింతంగా కాలం గడపటమనేది ఎన్నడూలేదు. శారద తండ్రి ఒక హైస్కూలు మేస్టరు. స్థిరమైన జీవితాన్ని గడుపుతున్నా, శారద విషయం ఆయనను క్రుంగతీసింది. శారద, వైధవ్యంతో పుట్టింటికొచ్చిందని తెలియడంతో, ఆమె చిన్ననాటి స్నేహితురాలింద్రంతా చూడటానికొచ్చి, కళ్ళనీళ్ళ పెట్టుకొన్నారు. యింత చిన్నవయస్సులోనే యీరాత ఏమిటని?" 'కొందరు విధిని తిట్టిపోశారు. ఎవరుమాత్రం యిప్పుడు చేయగలిందేముంది? క్రమక్రమంగా, శారద విషయం అవుళ్ళో పాతపడిపోయింది. వీధిముఖం చూడని శారద, మెల్లిగా, యింటిపనులుచేస్తూ, ఎండపొడని చూస్తూవుంది. కుమారుడితో, కాలక్షేపంచేయటం కొంతవరకు గడిచిపోతోంది. తీరికవున్నప్పుడల్లా, భర్తని తల్చుకొని కుమిలి, కుమిలి ఏడుస్తూవుండేది. తల్లిదండ్రులు ధైర్యంనూరిబోస్తూ, ఓదార్చేవాళ్ళు. అన్నదమ్ములతోనూ - వదినా మరదళ్ళతోనూ ఎంతసేపు మాట్లాడినా, మనస్సు శాంతంగావుండేదిగాదు. ఏదో తీరనిబాధ హృదయాన్ని కలచివేస్తూండేది, పదేపదే పాతతలపులు గుర్తొచ్చి, మధురస్మృతుల్ని రెచ్చగొట్టేవి. ఏపనిచేద్దామన్నా, వుసారుపుట్టేదిగాదు. వూరికే కూర్చొనివుండటమంటే, అతికష్టమనిపించింది. ఎవరితో ఏం మాట్లాడుదామనుకొన్నా, తన జీవితసంగతులే ప్రస్తావనకొస్తూండేవి. భరించలేనంత ఆవేదన, దుఃఖమూ పొంగుకువచ్చేవి. అందరూ ఓదార్చేవారు. ఏంలాభం? నుదుటికుంకుమ చెరిగిన తరువాత, నూరేళ్ళుబ్రతికినా, ప్రయోజనమేమిటి? శారద విచలిత హృదయంతో, కుర్రవాణ్ణి కౌగిలించుకొనేది. యిట్లా యెంతకాలం గడపాలోనని వున్న రెండునెలలూ శారద తీవ్రంగా యోచించింది. దిక్కుతోచలేదు. వున్నట్టుండి, ఒక్కనాడు, తల్లితండ్రులతో - "నాకిక్కడేమీ తోచటంలేదు. అక్కడవున్న యిల్లు పాడుపడిపోతోంది. పొలం విషయం ఏమైందో తెలియటంలేదు" - అంటూ చెప్పుకొచ్చింది. వాళ్ళు, చేసేదిలేక, "నీయిష్టంవచ్చినట్లు వెడతానంటేవెళ్ళు. అభ్యంతరమేమీలేదు" - అన్నారు. ఆ వారంచివర్లో, శారద, కుమారుణ్ణి ఎత్తుకొని, తన సామానుతో, స్వగ్రామంకివచ్చింది. వున్నపొలం తిరిగి వూడ్పిద్దామనుకొని, కవులుచేసే రైతునిపిల్చి, వూడ్చమనిచెప్పింది. మొంగదిక్కు లేక

పోవటంతో, శారదకు అన్నివిధాలా చిక్కులేర్పడినయి. చేతిలో కానీలేదు. ఉన్నఅప్పులు వడ్డీతో పెరిగిపోతున్నాయి. తీర్చటమనేది కుదరటంలేదు. యిలాంటి విషమస్థితిలో, వీరభద్రంని సాయమడగక తప్పలేదు. అతను ఎగిరి గంతేసాడు. తను, నారాయణరావువల్ల పొందిన, సాయాన్ని అడ్డుపెట్టుకొని, శారదను, అనునయపరుస్తూ - "నువ్వేమీ డబ్బుకోసం యిబ్బంది పడనవుసరంలేదు. నావద్దవుంది. దాన్ని, నీక్షేమంకోసమే వినియోగపరుస్తాను. కంగారుపడకు" - అంటూ, తనవద్దవున్న అయిదు వందల్ని ఆమెకిస్తూ, నవ్వాడు. ఆమె, ఆ పైకాన్ని తీసుకోకతప్పలేదు. పరిస్థితులలా చేసినయి. వీరభద్రంకి అనాలోచితంగా లొంగిపోయింది. అతను, ఆమెను వశీకరణ చేసుకున్నాడు. తనముకాం, ఆమెవద్దే పెట్టాడు. కాలంగడుపుతున్నాడు. శారదచెప్పిన పనల్లా, తలవంచుకొని చేస్తున్నాడు. ఎదురుమాట లేదు. పిల్లవాడిమీద, నారాయణరావు కంటటి అనిర్వచనీయమైన, మమకారంవుండేదో, అలాగే, తనకూవున్నట్టుగా చూడసాగాడు. శారద రెండు పూటలా వుడకేసిపెడుతోంది. కాలం ఆక్షేపణగానే గడుస్తోంది. వూరు రకరకాలుగా అపవాదులు వేస్తూ, వింతవింతగా చెప్పుకొంటోంది. 'వీరభద్రం, శారదని వుంచుకున్నాడని,' వూరుచివరకు, ఒక నెలా - రెండు నెలలు గడిచాక, తృణంగా తీర్మానించి వేసింది. శారద ఆమాట విన్నరోజున తలెత్తుకోలేక పోయింది. వీరభద్రం, ఎంతోసేపు ఎదురుగా కూర్చొని, "శారదా! నువ్వేమీ భయపడకు-లోకం అనేక రకాలుగా అనుకోవటం పరిపాటి. లెఖ్ఖచేయకూడదు. ఒకరికోసం మనం ఏమీబ్రతికటంలేదు. ఒకళ్లసొమ్ము మనం ఏవిధంగానూ తినటంలేదు. ఎవరేమనుకున్నా ఫర్వాలేదు. నువ్వు నిర్భయంగా వుండాలి. నీకున్న అప్పులన్నీ నేను తీర్చేస్తాను. నీకొడుకు విషయంలో ఏ అదుర్దాపడకు వాడికి నేను చదువుచెప్పి, బాగుచేస్తాను. ఉన్న, ఆ పొలాన్ని చూచుకొంటూ, జీవిస్తే, మనకేలోటూ లేదు." - ధైర్యంగా అన్నాడు. శారద కామాటలు నమ్మతగినట్లుగానే వున్నాయి. కాని, ఏదో అనుమానం ఆమెను చిత్రవధచేయటం మొదలెట్టింది. రోజురోజుకీ, వూరికాలు కూతలు భరించలేనంతగా వున్నాయి. మనసు అశాంతితో కల్లోలితమై పోసాగింది. ఎక్కడికన్నా పోవాలనిపించింది. ఎవరు ఆశ్రయంయిస్తారో? వూహించలేకపోయింది. మూడు నాల్గు నెలలనంతరం, ఒకనాడు. శారద, సామానంతా సర్దుకొని, కుర్రవాణ్ణెత్తుకొని, బయలుదేరింది. వీరభద్రం ఆశ్చర్యచకితుడయ్యాడు. ఎక్కడికో తెలియలేదు. ముఖమంతా చెమటలుపోసినయి. గుండె గుటగుటలాడుతోంది. శారద, నెమ్మదిగా, యింటికి తాళంవేసి, మెట్లుదిగబోతోంది. వీరభద్రం, ఆమె వెనకగా నిలబడి___

"ఎక్కడికి శారదా?" తెల్లబోతూన్న ముఖంతో ప్రశ్నించాడు.

"మా బావగారింటికి?" - దృఢసంకల్పంతో చెప్పింది.

"నాతోమాట వరుసకైనా చెప్పకుండా వెళ్ళిపోతున్నావా?"

"యిందులో ప్రత్యేకంగా చెప్పవలసిందేముంది?"

"నన్ను ఒంటరిగా విడిచి వెళ్ళిపోవటం న్యాయమేనా?"

"యిక్కడవుండటంవల్ల నా మనస్సేమీ బాగోటంలేదు.

రోజు రోజుకీ, ఏదో అశాంతి నన్నుకలచివేస్తోంది. పాతరోజులన్ని, గుర్తొస్తున్నాయి. చేసిన పాపం నన్ను భయపెడుతోంది. ఒంటరిగా వుండలేకపోతున్నాను."

"నేనున్నానుగ" - ఎంతో ధైర్యంతో అన్నాడు.

"నేనుండలేను..." - ఖచ్చితంగా తేల్చిచెప్పింది.

"శారదా!" - ప్రాధేయపూర్వకంగా పిల్చాడు. కళ్లుచెమ్మగిల్లినయి. కంఠం రుద్ధమైంది. విషణ్ణవదనంతో___

"నన్ను దిక్కులేనివాణ్ణిగా చేసిపోతావా శారదా! నేను నీకేకష్టమూ రాకుండా కాపాడాలనుకున్నాను. నాయావచ్ఛక్తీ నీకు ధారపోసి, నిన్ను సుఖపెట్టాలనుకొన్నాను. నీబాధల్ని, నావిగా యెంచుకొని, బ్రతుకుదామనుకొన్నాను. యీ చంటివాణ్ణిచూస్తూ, చేసిన పాపాన్ని క్షమించమని, దేవుణ్ణి కోరదామనుకున్నాను. నిన్ను కనిపెట్టుకొని వుండమని నారాయణరావు చెప్పబట్టే, కలకదలకుండావున్నాను. నీబాధ్యతల్ని నేనేవహిస్తున్నా, నువ్విట్లా వెళ్ళిపోవటం, నన్ను ఏడిపిస్తున్నట్లే. శారదా! వూరు

కదలకు వుండిపోవూ!" ప్రతిమిలాడాడు. శ్రమ పడ్డాడు వుంచటంకోసం. కాని. శారద, వుండదల్చు కోలేదు. వెంటనే, అతనిమాటల్ని, పెడచెవినిబెట్టి, పాడుపడిన దేవాలయం గోడల పక్కనుంచి నడిచి, నడిచి, బస్సుకోసం రోడ్డెక్కింది. నారాయణరావు గుర్తొచ్చాడు. వీరభద్రం ఏడ్చాడు. హఠాత్తుగా వచ్చిన శారదని చూసేసరికి, జగన్నాథం నివ్వెఱ పోయాడు. దుర్గమ్మ - ధర్మారావు తెల్లపోయారు. జయలక్ష్మి చిరునవ్వుతో కళ్ళునులుముకొంది. బారె డెక్కినపొద్దు_ఒక్క క్షణం ఆగి, ముందుకికదిలింది. జగన్నాథం, శారదని పల్కరిస్తూ, గతాన్ని ఒక్క పర్యాయం పునశ్చరణచేసాడు. దుర్గమ్మ కాసమ యంలో పాతవాదాలన్నీ, ఏమైనయ్యోమరి, తెలి యదు. చక్కగా పల్కరించి, కోడలిచేత మంచి నీళ్లు, కాలుకడుక్కొందుకు నీళ్లు యిప్పించింది. ధర్మారావు'పిన్నీ'అంటూ పల్కరించాడు. 'నన్నెప్పు డైనా చూశావురా!" అంటూ, జయలక్ష్మి, రామ కృష్ణుణ్ణి ఎత్తుకొని ముద్దాడింది. పది సంవత్సరాల నంతరం, శారద జీవితం యిలా మారినందుకు, అంతా సానుభూతిని కనపరిచారు. ఎంతో ఆప్యాయతతో, శారద కష్టసుఖాల్ని అడిగారు. ఆమె చెమర్చిన కళ్లతో, గూడుకట్టుకున్న దుఃఖంతో, కకాలికలైన హృదయంతో, భారమైన నిట్టూర్పులతో, తన జీవితాంధకారాన్నిగూర్చి, చెప్పుకొంది. అంతరాత్మ ఆవేదన కొంతవరకు తీరినట్లనిపించింది. అయిన వాళ్ళతో, యిలాంటివి చెప్పుకొంటే, కొంత తీరని బాధయేదో తీరి, తేలికపడట్టుగా వుంటుంది. శారద కావేళ, అలాగేవుంది. తన కుటుంబంలో, శారద పట్ల యింత అవ్యాజమైన ప్రేమాభిమానాలు - ఆదరణ - ఆశ్రయం మూర్తీభవించి వున్నందుకు. జగన్నాథం ఎంతో ముచ్చటపడిపోయాడు. లోగడ లేని కలతలన్నీ మాసిపోయినందుకు సంతోషించాడు. సమిష్టి కుటుంబంగా బ్రతకటమనేది, యిన్నాళ్లకు యేర్పడిందని తృప్తిపడ్డాడు.

శారద జీవితానికి, కొంతవరకు శాంతి యేర్పడింది. పిల్లవాడిపట్ల నెరవేర్చవలసిన విధులన్నీ జయలక్ష్మి చూస్తూవుంది. ఆమె కింతవరకు పిల్లలు లేకపోవ టంతో, కొంతకొరత తీరినట్లనిపించింది. దుర్గమ్మ ఎక్కువగా యింటిపనుల్లో జోక్యం కల్గించుకోవటం లేదు. శారద పైపనంతా చేస్తూవుండేది. వంటపని జయలక్ష్మి చేసేది.

శారదకీ, జయలక్ష్మికీ మాటామాటా కలియటమే కాకుండా, మనసుకూడా కలిసింది. యిద్దరికీ, చిన్న వయస్సే. వరుసకీ, అత్తా - కోడళ్లయినారుగాని, వాస్తవంగా, ఆయింట్లో, అక్కాచెల్లెళ్లలాగా మెదుల్తున్నారు. 'తనయిల్లే' అనే దృష్టితోనే, శారద, నడుంవంచి, చాకరీచేస్తూండేది. జయలక్ష్మికిప్పుడు, కొంచెం విశ్రాంతి లభించింది. వూపిరిపీల్చడానికీ, తావుచిక్కింది. దుర్గమ్మహాయిగా, రెండు పూటలూ భోంచేసి, మంచంవిరిగేవరకూ మగత నిద్రపోతూం డేది. శారద, జయలక్ష్మి రథచక్రాల్లాగా, యిల్లంతా తిరుగుతూ పనిపాటలు చేస్తూండేవాళ్లు. ఎన్నడూ లేని, హాయి, జగన్నాథానికి శారదవచ్చిన దగ్గరు నుంచీ లభించసాగింది. వేళపట్టున భోజనాలు అవు తూండేవి.

(సశేషము)

డాక్టరు కే. యన్. కేసరిగారి

'నా చిన్ననాటి ముచ్చట్లు'

వెల రు. 2.00 లే — పోస్టేజి ఉచితం

హిగిన్ బాథమ్స్ స్టాల్సులో దొరుకుతుంది

# 'పాపం బ్రద్దలైంది'

'రాఘవ'

(గతసంచిక తరువాయి)

పండుగలూ - పబ్బాలూ వస్తే - పిండివంటలు చేస్తూండేవాళ్లు. ఎవ్వరికీ యేకష్టమూ కల్గించకుండా, యిరువురూ, దుక్కిటెద్దులాగా నడుచుకొంటూ పనిచేస్తూండేవాళ్లు. పసివాడైన రామకృష్ణణ్ణి, ఒళ్లో పెట్టుకొని, జగన్నాధం, సాకుతూండేవాడు తీరిక సమయాల్లో. వాడి ఆటపాటల్లో పాల్గొంటూ దుర్గమ్మకూడా ఎంతో సంతోషంగా కాలం వెళ్లబుచ్చుతూవుంది. జగన్నాధంమాత్రం అడపా తడపా, శారద పేరునవున్న మిగతా రెండెకరాల్నీ, చూసి వస్తూ. కావలసినపని చేయిస్తూ - అజమాయిషీగా వుండి చూస్తూండేవాడు. యిది వీరభద్రంకి కంటకంగావుంది. చేతిలోవున్న ఆయుధం వ్యర్థంలా నిష్కారణంగా అప్పగించి, శారదపని గడిచిపోయే లాగుచేసేనే! అని దిగులుపడసాగాడు. అయితే పండలూ పోవటమేగాకుండా, అందుకుందనుకొన్న శారదకూడా పిట్టలాగా, చేతుల్లోంచి, ఎగిరిపోయిందని, కుమిలిపోవటం మొదలెట్టాడు. దీనికితోడు, ఆమె పొలంమీద, జగన్నాధం అజమాయిషీ. పుండు మీద కారంచల్లినట్లయింది. గుండెలమీద కుంపటి పెట్టినట్లయింది.

అతనిలో రేగినద్వేషం — పగ — వర్ణనాతీతం. ఎలాగైనా, శారద జీవితాన్ని కళంకపర్చాలని వూహించాడు. యిప్పుడున్న, నీడకూడా చేయాలని సంకల్పించాడు.

శారద జీవితాన్ని బూడిదపాలుచేస్తేనే గాని, తన హృదయం శాంతించదనుకున్నాడు. ఆమెకూ-తనకూవున్న శరీరసంబంధాన్ని ఎట్లాగైనాసరే, జగన్నాధం యింట్లో పొక్కేలాగు చేయాలనుకొన్నాడు. నిలువనీడ లేకుండాచేస్తేనే గానీ, తన కాళ్ళమీదపడి, ఆశ్రయం కోరదనుకున్నాడు. కల్మష పూరిత హృదయంతో, తీర్మానించుకొన్నాడు. తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టాడు. యీ సంగతి పాపం! శారదకేం తెలుసు. గుట్టుచప్పుడుగా జగన్నాధం యింట్లో బ్రతుకుతోంది. పనిచేసినంత సేపూ, శ్రద్ధాభక్తులతో చేస్తోంది. కలో, గంజో త్రాగి ప్రాణం నిలబెట్టుకొంటోంది. వంటరితాన్ని కనురెప్పలమాటున దాచుకొంటూ, కాలం వెళ్ళ బోస్తోంది. తను చేసిన, చీకటిపాపం ఎక్కడ తెలిసి పోతుందోనని ఒదిగి, ఒదిగి జీవించసాగింది. వీరభద్రం పీడ వదిలిపోయిందని, కొంతవరకు నిబ్బరంగా వుంది.

మూడునెలలు గడిచినయి. శారద విషయంలో, దుర్గమ్మ - ధర్మారావూ లాలూచీపడి, ఆనాడు ఆలోచించుకొన్న విషయాన్ని, మాటా - మాటా సందర్భంలో వ్యక్తంచేసారు. శారద విన్నమీదట, ఎదుగుతొంటున్న కొడుకునివంక చూస్తూ - "నేను మీమాట నెప్పుడూ కాదనలేను. నాకు దక్కిన ఆరెండెకరాల్నీ, ఎవరు సాగుబడిచేసి పండించినా సరే, నేనేమీ అనుకోను. కాని, నాకుమారుణ్ణి మాత్రం దిక్కులేనివాణ్ణిగా చేయకూడదని కోరుకుంటున్నాను. వాణ్ణి ఏదోవిధంగా పెంచి, పెద్దచేసి, చదువూ - సంధ్యా చెప్పించి, ఒకమనిషిగా తయారు చేస్తే, నాకదేచాలు. నాకు యింకేకోరికా లేదు. అక్కడికివెళ్ళి నేనేమీ వ్యవసాయం చేయించలేను. బావగారి పుణ్యమాఅని, వచ్చే, ఆ ఆయివేజుతో, మీవద్దేవుండిపోతాను. మీరువేస్తే, యీనాలుగు మెతుకుల్నితింటూ బ్రతుకుతాను. తరువాత మీ యిష్టం" - అంది. తల్లీ కొడుకులనుకున్నది, వేసిన ఎత్తుగడ సాగిందని సంతోషించి, వెంటనే, ధర్మారావు, శారదతో—

"పిన్నీ...అయితే నేను నీపొలం సాగుబడి చేస్తాను" అన్నాడు.

శారద సంతోషపడింది. జగన్నాధం బదులు, ధర్మారావు. అజమాయిషీకి వెళ్ళడం సాగించాడు వ్రాయవలసిన ఒప్పందపత్రాలుకూడా, జగన్నాధం చేత, దుర్గమ్మ వ్రాయించేసింది. శారద మంచికే యిదంతా జరుగుతోందని జగన్నాధం వూహించాడు. జయలక్ష్మి కిదంతా వింతగాతోచింది. తన భర్త - అత్తగారు ఎలాంటివారైందీ, బాగా

శారద తెలుసుకోలేదని, విచారపడింది. యీసంగతి ముఖ కవళికలనుబట్టి శారద గ్రహించింది.

ఒకనాడు, తీరికచూసుకొని, ఎవ్వరూలేని సమయంలో, జయలక్ష్మిని, 'కోడలా!' అనిపిల్చి, "ఏమిటలా వుంటున్నావని" అడిగింది. మొదట్లో జయలక్ష్మి ఏమీలేదనన్నది. శారదవూరుకోలేదు బలవంతంచేసింది. జయలక్ష్మికి చెప్పకతప్పలేదు. శారద వినటానికి, కుతూహలపడింది. దొడ్లోకి చేరారు. దొడ్డితలుపులు గడియవేసారు. చుట్టింట్లో కూర్చొని, జయలక్ష్మి, శారదకు, తాను తెలుసుకొన్న, తల్లి కొడుకులవూహల్ని, ఎత్తుగడల్ని, సంపూర్ణంగా చెప్పేసింది. ప్రొద్దుతిరిగింది. మళ్లీ పని వేళవుతోందని యిరువురూ లేచారు. అలా రెండు మూడు రోజులపాటు, దుర్గమ్మ - ధర్మారావుల మనస్తత్వాన్ని యిరువురూ కాకమ్మకథగా చెప్పుకున్నారు. శారదకు భయంవేసింది. తన భర్తవల్ల, తనకు ఎటువంటి ఆపదరానుందో పూర్తిగా తెలిసిపోయింది. తనపట్ల చూపుతున్న యీప్రేమాభిమానాలన్నీ, కేవలం, ఆరెండేళ్ళకోసమేనని తెల్సుకుంది. తన అనంతరం, రామకృష్ణుడికి చిప్పా-కర్రా చేతికిస్తారేమోనని అభిప్రాయపడింది. ఏం చేయాలో తోచలేదు. ఎక్కడికిపోయి హాయిగా బ్రతకటమో! శారద తరం కాలేదు. యిలాంటి విషయ సమస్యలోనే, వీరభద్రం ఒకసారివచ్చి, శారదనిచూసి వెళ్ళిపోతూండగా జగన్నాధం చూసాడు. "ఎందుకొచ్చావని" అడుగకముందే, "పొలం కౌలుకూ ఓ అయిదువందలిచ్చాను. యిప్పుడేమైనా వస్తుందేమో అడిగి వెళదామని" వచ్చానన్నాడు. జగన్నాధం తెల్లబోతూ, శారద వంక చూసాడు. శారద, ధీరమైన హృదయంతో- "అవునండీ బావగారూ! ఓ అయిదువందలు యివ్వవలసిన మాట వాస్తవమే!" — అంది. జగన్నాధం తాళుకోలేక, "పంటలొచ్చిన తరువాత వస్తుంది"- అని జవాబిచ్చి పంపేశాడు. వీరభద్రం కోర చూపుల్తో, శారదనుచూస్తూ, వీధిగుమ్మందాటాడు. శారద మనస్సు కుదుటపడింది. ఏ అఘాయిత్యంచేసీ, తన జీవితాన్ని ధ్వంశంచేస్తాడోనని కంగారుపడింది సమయానికి, జగన్నాధం వచ్చినందుకు గుండె దడ తగ్గింది. ఆరోజున, వీరభద్రంగురించి, యింటిల్లిపాదీ, ఒక్క జగన్నాధంతప్ప, అంతా అడిగినవారే! రకరకాలుగా అడిగారు. శారద అన్నిప్రశ్నలకు సమాధానాలిచ్చింది. కాని, అంతరాత్మలో అతనంటే, చచ్చేభయం వేయటం మొదలెట్టింది. కనిపెట్టినా వదులుతుందిగాని, వీరభద్రంపడితే వదలడని, ఆ నాటికి తెలుసుకొని రూఢిచేసుకొంది.

## 10

ఒక్క సంవత్సరం, శారదకు అతికష్టంమీద గడిచింది. వీరభద్రం యీసంవత్సరకాలంలో రెండు మూడు దఫాలు చాటుమాటుగావచ్చి, శారదను చూసి, సరి సరి విధాలుగా మాట్లాడటం సాగించాడు. శారద భయభ్రాంతురాలవుతూండేది. ఎన్నో విధాలుగా, శారదను, తనదగ్గరకొచ్చి వుండమని ప్రాధేయపూర్వకంగా అడిగాడు. ఏకష్టమూ కల్గించనన్నాడు. మనస్ఫూర్తిగా నిన్ను కనిపెట్టుకుని వుంటానన్నాడు. శారదవినలేదు. తిరస్కరించింది. "ఇక ఎప్పుడూ యీగుమ్మం తొక్కవద్దని" చెప్పింది. అతను క్రోధంతో చూశాడు. ఆమె గజగజలాడింది. "సరే! నీజీవితం ఏమవుతుందో చూడు" అని, అహంకారిగా వెళ్ళిపోయాడు. శారద, ఆ రాత్రంతా, తిండీ, తిప్పలు మానుకొని, కంటికి మింటికీ యేకధారగా యేడ్చింది. జయలక్ష్మి, శారద నిద్రని పసిగట్టింది. మెల్లిగా అడిగింది అసలు విషయం చెప్పమని. శారదకు తిరస్కరించలేదు. జయలక్ష్మి బ్రతిమాలింది. చివరకు చెప్పకతప్పలేదు. 'తనకూ వీరభద్రంకివున్న సంబంధమూ — చేసిన చీకటిపని - పండిన చీకటి పాపం - యిప్పుడనుభవిస్తున్న ఆపాపపు ఫలితం వివరంగా చెప్పింది. ఆనాడు ఎందుకోయిలా చెప్పుకోవడానికి, యిరువురకూ వీలుపడింది, సవిస్తరంగా శారద చెప్పేసింది. జయలక్ష్మి కళ్ళల్లో నీళ్లునిలిచినయి. 'యీ ఆడజన్మ ఎందుకెత్తినట్లో, ఆమెకు తెలియలేదు, మునుపటికన్నా కూడా శారద చిక్కిపోయింది. వీరభద్రం ఎట్లాగో, తన జీవితాన్ని నాశనంచేసి తీరుతాడని నమ్మేసింది. తనకెక్కడా నిలవటానికి, స్థానంలేకుండా చేస్తాడని వూహించివేసింది. మనస్సు అనేకవిధాలుగా చెదిరిపోయింది. రోజులు క్రమక్రమంగా గడుస్తున్నకొద్దీ, శారదచిక్కి శల్యమైపోసాగింది. ఆమెలోవున్న అలజడి, ఒక్క జయలక్ష్మికితప్ప మరెవ్వరికీ తెలియదు. తనని అభిమానంతో చూస్తూవున్నదికూడా జయలక్ష్మి. అందువల్ల, ఆమెకు తెల్సినా, ఫర్వాలేదనుకొంది.

రామకృష్ణ, ఆనాటి కానాడు ఒళ్లుచేస్తూ, యిల్లంతా కలియతిరుగుతూ, అల్లరిచేయటం సాగిం

వాడు. అందరికీ అలవాటైనాడు, ముఖ్యంగా జయలక్ష్మికి ఎక్కువగా అలవాటయ్యాడు. శారదకంటే, ఎక్కువగా, ఆతణ్ణి సాకటం సాగించింది. నిద్ర లేచిన దగ్గరనుంచీ, పడుకోబోయేవరకూ జయలక్ష్మి సేవలే, రామకృష్ణ పెంపకానికి ఆధారభూతాలు. తల్లిని చూడకుండా కూడా వుండగలడేమోగానీ, జయలక్ష్మిని మాత్రం క్షణంవదలి వుండలేకపోతున్నాడు. అలా పెరుగుతున్నాడు. చంటివాళ్లకేం తెలుసు? ఎవరు చనువిస్తే, వాళ్లదంకే ఎక్కుతారు. అలాగే రామకృష్ణవిషయంలో, శారదకన్నా, జయలక్ష్మికే బాధ్యతలేర్పడినయి. యిలా వుంటూ వుండగా, ఒకసారి జగన్నాథం - దుర్గమ్మ - భర్మారావు అంతాకలిసి, ఎవరిదో బంధువుల వివాహానికి వెళ్ళారు. జయలక్ష్మికి ఆరోగ్యం బాగుండక, మానుకొంది. అందువల్ల, శారద, జయలక్ష్మి యింట్లో వుండిపోవలసి వచ్చింది. పగలల్లా శారద యింటిపనులన్నీ చేసి, మత్తుగా పడుకొంది. జయలక్ష్మి పక్కలో రామకృష్ణ నిద్రపోతున్నాడు. జయలక్ష్మి కలతగా పడుకొంది.

దరిసగం రాత్రి గడిచింది, మూసుకొని వున్న తలుపులు కొట్టినట్లు చప్పుడైనయి. జయలక్ష్మికి వినిపించింది. కళ్లుతెరచి - లేవలేక.

“ఎవరూ ?” — అంది. తలుపుచప్పుడు ఆగిపోయింది. జయలక్ష్మి, “చిన్నత్తయ్యా !” — అని పిల్చి, లేపింది. శారద, బడలిక నిద్రవల్ల త్వరగా లేవలేదు. తిరిగి, మళ్ళీపిల్చింది. వులిక్కిపడి, శారద నిద్రలేచింది. చుట్టూ చూసింది. చిన్నదీపం వెలుగుతోంది. యిల్లంతా చడీచప్పుడూ లేకుండావుంది. నిశ్శబ్దం మూర్తీభవించింది. కళ్ళునులుముకొని, తేరిపార చూసింది.

“చీకటి పాపం - ఆసాటిగ -” మనస్సులో మెదిలింది. భయంవేసింది.

“చిన్నత్తయ్యా !” - జయలక్ష్మి మళ్ళీపిల్చింది.
“ఆఁ...” - శారద పలికింది.

“తలుపు చప్పుడవుతోంది ఎవరోవచ్చారు. కాస్త తలుపుతీద్దూ !” - అంది.

“వీరభద్రం కాదుగదా !” — శారద వులిక్కిపడింది. అప్రయత్నంగా, ఆతనిపేరు పీడకలలాగా గుర్తొచ్చింది.

“యీపాటప్పుడు ఎందుకొస్తాడులే” — అనుకొంటూ మెల్లిగా లేచివెళ్ళి, తలుపుగడియ తీసి, చీకట్లోకి, తొంగిచూసింది - ఎవ్వరూ కనిపించలేదు.

జయలక్ష్మి భ్రమపడిందేమోనని, అనుకొని, మళ్లా తలుపుల్ని మూయబోయింది.

“శారదా !”—ఆచీకట్లో, ప్రహరీ గోడమూలగా, ఎవరిదో కంఠం వినిపించింది, మనిషి కనిపించటం లేదు. ఎవరోనని మెట్లుదిగింది తలుపులు ఓరగావేసి, చూడటానికి.

నాలుగువేపులా కలయచూసింది...యీశాన్యమూలగా, ఎవరోకదిలి, తనదగ్గరగా వస్తున్నట్లు, అలికిడి అయింది. శారద అటువైపే భయభయంతో చూస్తూ నిలబడింది. కదిలిన స్వరూపం, మెల్లగా, గడ్డివాము చాటుకొచ్చి,

“శారదా ! ఒక్కసారి యిలారావూ ! నేను.”

శారద, ఆకంఠంని గుర్తుపట్టేసింది. కదలటానికి, కాళ్లు భూమిలోకి చొచ్చుకొనిపోయినట్లు, అయితే లాగటానికి శక్తిలేకుండా పోయింది. ఏదో బాధ, ఆమెహృదయంచుట్టూ అల్లుకుంటోంది...మూర్తి దగ్గరకొస్తూ—

“నేను... శారదా ! అలా ఎందుకూ భయపడతావ్ ?”

“నువ్వా...వీరభద్రం...”
“ఏం...గుర్తుపట్టలేదా ?”

“మళ్ళా ఎందుకొచ్చావ్...సిగ్గులేదూ. రావద్దంటే !”

“నీకోసం, రావటానికి సిగ్గెందుకూ ?”
“ఛీ” - ఛీదరించుకొంది శారద.

“ఛీదరించుకోకు శారదా ! ఆదరించటానికొచ్చాను. రా. వెళ్ళిపోయి, ఎక్కడైనాసరే హాయిగావుందాం... యీ దిక్కుమాలిన జీవితం యిట్లా ఎంతకాలం గడుపుతావు. నేను ఓర్వలేను... రా...”

వీరభద్రం బలవంతం చేయటం మొదలెట్టాడు. ఆమె ఎన్నోవిధాలుగా నచ్చచెప్పింది. అతను వినిపించుకోవటంలేదు ... బ్రతిమిలాడింది. కంటనీరు పెట్టుకుంటోంది. అతను లెఖచేయటంలేదు...పైగా భయపెట్టడం సాగించాడు. ఆమె ఓడిపోయింది... “యింకా పస్నెందు చెడ్పిస్తావ్ వీరభద్రం, నీవరి

నాజీవితం సర్వనాశనమైపోయింది. నా భర్తని చెడగొట్టి, దుర్వ్యసనాల పాలుచేసి, నా మంగళసూత్రం తెంచావు, నా పసుపుకుంకుమల్ని దూరంచేసావ్. నీవల్ల, చెడుమనిషి ననిపించుకున్నాను. ఎన్నో అపవాదులు పడ్డాను. నీమాయమాటలకి లొంగిపోయి 'నా' అనేదృష్టితో — బంధువుడివనీ - బావవనీ - చనువిచ్చి మాట్లాడాను. చివరకు నన్నీవిధంగా, హింసలపాలు చేసావు. నోరునొక్కి, చీకటి పాపానికి, ఒడిగట్టుకునేలాగు చేసావు. హాయిగా గడుస్తున్న మా సంసారానికి, నిప్పుపెట్టావు. నన్ను అన్నిందాలా యమయాతనలు పెట్టావు. యిప్పటికేదో విధంగా, కొంత ధైర్యంతో బ్రతుకుతున్నాను అపనిందని చూసుకొంటూ - ఒక దాసీదానిలాగా - ఒక పనిమనిషిలాగా - మనోవర్తి పుచ్చుకునే ముసలిదానిలాగా ప్రాణాల్ని నిలబెట్టుకొని, జీవిస్తున్నాను. యింకా ఎందుకు నాకోసం తాపత్రయ పడతావ్? ఏముందని, నన్ను వెంటాడుతున్నావ్" - ఘోరు ఘోరున ఏడుస్తూ, వీరభద్రం వదిలిపెడతాడేమోనానె ఆశతో, అంటోంది. వీరభద్రం వికటంగా నవ్వుతున్నాడు. ఆమె మాటలు అస్పష్టంగా, యింట్లోకి వెళ్ళినయి. జయలక్ష్మికి వినిపించినయి. మెల్లిగా లేచివచ్చి ఓరవాకిలిగుండా చూసింది. శారద గోడు గోడున ఏడుస్తూ, అరుగులమీద కూర్చొనివుంది... వీరభద్రం భయపెడుతున్నాడు.

"నువ్వు గనుక, యీరాత్రి నాతోకలిసి రాకపోయే పక్షంలో, యీయింట్లో నీకు తావు నీడా లేకుండాచేస్తాను. నువ్వుచేసిన పాడుపనిని, నీ జగన్నాథం బావకీ, దుర్గమ్మక్కయ్యకీ - ధర్మారావుకి చెబుతాను. నిన్ను వీధిలోకి, వెళ్ళగొట్టేలాగు చేస్తాను. నీచీకటి పాపం ఆనాటితో పోయిందనుకున్నావేమో! లేదు. నేటితోపోయేటట్లుచేస్తాను. వస్తావా మర్యాదగా రా, లేదంటావో, నీవిషయాన్ని రచ్చకెక్కించి, గోలచేసి, మరీ తీసుకొనిపోతాను. నువ్వొచ్చేదాకా నేనీ యిల్లుకదలను. నువ్వుచేసిన పాడుపనిని అందరికీ చెబుతాను. న్యాయం అప్పుడే తేలుతుంది. అప్పుడెవరికోసం వస్తావు...నలుగురూ వుమ్మేస్తారు. దేవుడా! అంటూ, మళ్లీ నావద్దకేవస్తావు. అంత రభసజరుగకముందే లేచిరా...మర్యాదగా చెబుతున్నా. యిప్పటికే చాలా పొద్దుపోయింది." - వీరభద్రం శనిగ్రహంకన్నా గట్టిగాపట్టుకొని పీడించసాగాడు. యీమాటలన్నీ జయలక్ష్మి జాగ్రత్తగా వినింది. ఏంచేయాలో తోచలేదు. వెంటనే, దొడ్లోకివెళ్ళి, ప్రక్కింటి యజమానిని లేపుకొచ్చింది. యీలోపుగా శారద, అతని కాళ్లు పట్టుకొని ప్రార్థిస్తోంది. అతను రమ్మనమని చేయిపుచ్చుకొని లాగుతున్నాడు. ఆసమయంలో వీరభద్రం తలకాయ ఫెటేల్ మంది; వీపుమీద రెండు మూడు దెబ్బలు పడినయి. 'అమ్మో' — అంటూ, వీరభద్రం, వాకిటి ముందు తూలిపడిపోయాడు. శారద, తటాలున ప్రక్కకి తప్పుకొని, జయలక్ష్మి దగ్గరకొచ్చి, బిక్కు బిక్కుమంటూ చూసింది. వీరభద్రం పడినచోటనుండి లేవటానికి ప్రయత్నిస్తున్నాడు. యింతలో చుట్టుప్రక్కల వాళ్ళంతా పోగై, బండి మోకు తెచ్చి వీరభద్రం కాళ్లు చేతుల్ని బిగించి కట్టివేసారు. తీసుకొచ్చి, ఒకగుంజకి కట్టివేశారు. నానా మాటలూ అన్నారు. అతను తలవంచుకొని గుండెల్లో దాచుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ సమయంలో, వాకిటి ముందంతా జనం చేరి, గోల గోలగావుంది. రామకృష్ణ లేచి,—

"అమ్మా!" — అని ఏడ్చాడు. జయలక్ష్మి ప్రక్కకి తిరిగిచూసింది. శారద కనిపించలేదు.— కంగారుపడింది.

"చిన్నత్తయ్యా" — అని పొలికేక పెట్టింది. యిల్లంతా ప్రతిధ్వనించింది. వాకిటిముందు జనం పల్చపల్చనవుతున్నారు. జయలక్ష్మి, రామకృష్ణుణ్ణి చంకన వేసుకొని, యిల్లంతా - గదులన్నీ - దొడ్డంతా - చెట్లచాటున - బావుల ప్రక్కన - నూతిలోనూ - తిరిగి, తిరిగి చూసింది. శారద జాడలేదు. రామకృష్ణుడు 'అమ్మా - అమ్మా' - అని, జయలక్ష్మిని పిలుస్తున్నాడు. ఎంతచూసినా దొడ్డిలో కూడ ఆచూకీ తెలియలేదు... కాని, దొడ్డితలుపులు బార్లాగా తెరువబడివున్నయి. గాలికి వూగుతున్నయి. జయలక్ష్మి సరాసరి వెళ్ళిచూసింది - ఎవ్వరూ తిరుగుతున్నట్లు జనసంచారంలేదు. చీకటి దట్టంగావుంది. తెల్లవారటానికి యింకా చాలా కాలవ్యవధివుంది... అందుకే, యిక తనజీవితం, ఎలాగూ రచ్చకెక్కుతుందని భావించి, జయలక్ష్మి ముఖం చూడటానికి చెల్లక, ఆయింట్లో వుండటానికి మనస్కరించక, కన్నకొడుకుని వదిలేసి, చీకటి తెరలగుండా శూన్యంలోకి దూసుకొని, శారద వెళ్ళిపోయింది. -